www.andhrajyothy.com
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI   పేజీలు: 14   వెల (Price) : Rs. 6.50   సంపుటి (Volume) : 65   సంచిక (Issue) : 253
శనివారం | 28-12-2024
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి తె. 3.33 తదుపరి చతుర్దశి; నక్షత్రం: అనూరాధ రా. 10.13 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: తె. 4.05-5.45; దుర్ముహూర్తం: ఉ. 6.47-8.15; అమృతఘడియలు: ఉ. 11.03-12.46; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.47; సూర్యాస్తమయం: 5.45
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


మన్మోహన్‌సింగ్ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు

నాడు / నేడు

షాకులు.. శోకాలు



ఎవరు మోపిన భారం?

సంపద సృష్టిస్తామంటూ జనం నెత్తిన చంద్రబాబు 15,485 కోట్ల భారం మోపారని జగన్ రోత పత్రిక వాపోయింది. ఇందులో... రూ.6,072.86 కోట్ల వసూలు మొదలైందని, జనవరి నుంచి 9,412.50 కోట్లు వసూలు చేస్తారని శోకాలు పెట్టింది. ఈ లెక్కలు నిజమే అయినప్పటికీ... ఈ భారం మోపిందెవరన్నదే అసలు ప్రశ్న! దీనికి సమాధానం...

2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి... 2022లో సెప్టెంబరు 29, డిసెంబరు 22, మార్చి 23, మే 30వ తేదీల్లో మూడు విడతల్లో మొత్తం 8113.60 కోట్ల ఇంధన సర్దుబాటు చార్జీల కోసం ఈఆర్‌సీకి డిస్కమ్‌లు ప్రతిపాదనలు పంపించాయి. అప్పుడు అధికారంలో ఉన్నది సాక్షాత్తూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనే విషయం ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు కదా!

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.12,849 కోట్ల ఎఫ్‌పీసీసీఏ చార్జీల వసూలుకు అనుమతించాలంటూ ఈ ఏడాది మే 24 - 27 తేదీల మధ్య డిస్కమ్‌లు ప్రతిపాదించాయి. అప్పుడూ ముఖ్యమంత్రిగా ఉన్నది వైఎస్ జగన్మోహన్ రెడ్డే! చంద్రబాబు కాదు!

నిబంధనల ప్రకారం డిస్కమ్‌లు ప్రతిపాదనలు పంపిన 90 రోజుల్లోపు ఈఆర్‌సీ వాటిపై ప్రజాభిప్రాయం సేకరించి నిర్ణయం వెలువరించాలి. కానీ... ఎన్నికల ముందు కొత్త 'బాదుడు'తో కష్టం తప్పదని కాబోలు, జగన్మోహన్ రెడ్డి దీనిని వాయిదా 'వేయించారు'. అప్పటి ప్రతిపాదనలకు కూటమి సర్కారు వచ్చాక ఈఆర్‌సీ ఆమోదం తెలిపింది. అంటే... ఇది అక్షరాలా జగన్ బాదుడే! కూటమి సర్కారుది కాదు!



ఇది విజయవాడకు చెందిన ఒక వినియోగదారుడి విద్యుత్ బిల్లు..

ఇందులో... విద్యుత్ వాడకం చార్జీలు రూ.358, ఫిక్స్‌డ్ చార్జెస్ రూ.20, కస్టమర్ చార్జెస్ రూ.45, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.6.72.

వీటిలో కూటమి ప్రభుత్వం కొత్తగా పెంచినవి, వేసిన చార్జీలు లేవు.

ఇక.. ట్రూఅప్ చార్జీ రూ.21.74, ఎఫ్‌పీపీసీఏ చార్జీ రూ.65.76, మరో ఎఫ్‌పీపీసీఏ చార్జీ 46.80... ఈ మూడు జగన్ హయాంలో ప్రతిపాదించి ఆమోదించి, వసూలు చేయడం మొదలుపెట్టినవే!

ఇప్పుడు చెప్పండి! బిల్లులు భగభగమనిపించింది ఎవరు?

విద్యుత్ చార్జీల బాదుడు జగన్‌దే!

- సర్దుబాటు పేరుతో వరుసగా పోట్లు
- అధికారంలో ఉండగా రకరకాలుగా దెబ్బలు
- చివరి రెండేళ్లలో 20వేల కోట్లకు పైగా బాదుడు
- ఎన్నికల ముందు వ్యతిరేకత వస్తుందనే భయం..
- అప్పుడు నిర్ణయం పెండింగ్‌లో పెట్టిన ఈఆర్‌సీ
- కూటమి సర్కారు వచ్చాక వాటికి ఆమోదం
- తన హయాంలో పెరిగిన చార్జీలు
- ఇప్పుడు తగ్గించాలంటూ జగన్ వింత పోకడ

చార్జీలు ఒక్క పైసా పెంచని కూటమి సర్కారు వచ్చే ఏడాది 'పోటు' ఉండదని ఇప్పటికే స్పష్టీకరణ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

బాదుడు జగన్‌ది.. బాధలు పెట్టింది జగన్..
షాకులు ఇచ్చింది జగన్... శోకాలు పెడుతున్నదీ జగనే!

'నేను చార్జీలు పెంచుతా. ఆ చార్జీలను మీరు తగ్గించాలి' ఇదీ.. ఆయన వైఖరి. అధికారంలో ఉండగా జగన్ వరుసగా ఐదేళ్లపాటు 'బాదుడే బాదుడు' కార్యక్రమం అమలు చేశారు. 'చార్జీల పెంపు' అనే మాట వాడకుండా.. ఇంధన సర్దుబాటు, ట్రూ అప్ చార్జీల పేరుతో బిల్లులు భగభగమనిపించారు.

గతంలో విద్యుత్ చార్జీలు పెంచాల్సి వస్తే.. ప్రజలకు చెప్పి పెంచేవారు. కానీ... జగన్ వచ్చాక చాపకింద నీరులా, దొంగ దెబ్బలు కొట్టడం మొదలుపెట్టారు. 2019లో అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది నుంచీ ఇదే తీరు. 'విద్యుత్

మిగతా 13వ పేజీలో...

అశ్రునివాళుల మధ్య..

స్మృతి పథంలోకి

- మన్మోహన్ సింగ్‌కు రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ తదితరుల నివాళి
- ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో నేడు ఉదయం 11:45కు అంత్యక్రియలు
- స్మృతి స్థలంలో స్మారక నిర్మాణం
- దేశం గొప్ప రాజనీతిజ్ఞుణ్ని కోల్పోయింది
- విచారం వ్యక్తం చేసిన కేంద్ర క్యాబినెట్
- భారత రాజకీయ, ఆర్థిక రంగాల్లో మహోన్నత వ్యక్తి.. సీడబ్ల్యూసీ నివాళి
- నేడు 'కేంద్ర' సంస్థలకు ఓపూట సెలవు

న్యూఢిల్లీ, డిసెంబరు 27: దివాలా అంచున ఉన్న దేశానికి కొత్త దిశ చూపి దశ మార్చిన ఆర్థిక మాంత్రికుడు, నిష్కళంక పాలకుడు.. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ విశ్వవ్యాప్త అశ్రునివాళుల మధ్య శనివారం శాశ్వత స్మృతిపథానికి చేరుకోనున్నారు. ఆయన అంత్యక్రియలను శనివారం ఉదయం 11:45 గంటలకు ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో నిర్వహించనున్నట్లు కేంద్ర హోం శాఖ ప్రకటించింది. ప్రభుత్వ లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు జరపడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లూ

మిగతా 2వ పేజీలో...

- మన్మోహన్ జీవితం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయక పాఠం!.. వీడియో సందేశంలో మోదీ
- నేటి దేశాభివృద్ధి ఆయన సంస్కరణల ఫలితమే: బాబు
- మన్మోహన్ ఓ చాంపియన్ ఘనంగా నివాళులర్పించిన అగ్రరాజ్యాధినేతలు

13

మెగా డీఎస్సీ ఇంకెప్పుడు?

నోటిఫికేషన్‌కు బాలారిష్టాలు



- బడులు తెరిచేనాటికి కొత్త టీచర్లు కొలువుదీరేనా?
- అభ్యర్థుల సన్నద్ధత కోసం 3 నెలలు వాయిదా
- తర్వాత వర్గీకరణపై నివేదిక కోసం నిలిపివేత
- డీఎస్సీ ప్రకటించాక భర్తీకి కనీసం 3 నెలలు
- తర్వాత టీచర్ల శిక్షణకు మరికొంత సమయం
- మరో 5 నెలల్లో ప్రక్రియ అసాధ్యమని వాదన

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాబోయే విద్యా సంవత్సరంలో బడులు తెరిచే నాటికి కొత్త టీచర్లు కొలువుదీరేలా కనిపించడం లేదు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, భర్తీ ప్రక్రియను పూర్తి చేయడంతో పాటు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడానికి మరో ఐదు నెలల సమయం మాత్రమే ఉంది. అయితే ఈ నోటిఫికేషన్ ఇప్పట్లో ఇచ్చే అవకాశాలు లేవు. ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ తన నివేదిక సమర్పించిన తర్వాతే ఈ ప్రక్రియ ముందుకు కదలనుంది. మరోవైపు పూర్తిస్థాయి ఉపాధ్యాయులతో పాఠశాలలు నడుపుతామని, కొరత అనే మాట లేకుండా చేస్తామని కూటమి ప్రభుత్వం గట్టిగా చెబుతోంది. మొత్తం 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సీఎం చంద్రబాబు తొలి సంతకం డీఎస్సీ ఫైలుపైనే పెట్టారు. ఆ వెంటనే జూలై 1న డీఎస్సీ ప్రకటించాలని ప్రభుత్వం భావించింది. కానీ నోటిఫికేషన్ విడుదల వాయిదా పడుతూనే ఉంది. ఇప్పటికే చాలావరకు ప్రక్రియ పూర్తికావాల్సి ఉండగా, ఇంతవరకూ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేని

మిగతా 14వ పేజీలో...

'గనుల్లో' తిమింగలం తిష్ఠ

తీవ్ర ఆరోపణలున్నా ఇంకా అక్కడే

గత ప్రభుత్వంలో వైసీపీ నేతలతో కలిసి అడ్డగోలుగా వ్యవహరించిన, అవినీతి, అక్రమాలకు పాల్పడిన, తీవ్ర అభియోగాలు వచ్చిన అధికారులపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కొందరిపై కేసులు పెట్టి విచారణకు ఆదేశించగా, మరికొందరు అధికారులను తప్పనిసరి సెలవుపై పంపిస్తోంది. అయితే గనుల శాఖలో ఎన్నో ఆరోపణలున్న ఓ అధికారి మాత్రం అక్కడే తిష్ఠ వేశారు. ఆయన్ను జూలైలోనే బయటకు పంపాలనుకుంటే పెద్దలు అడ్డుపడ్డారు. రెండో జాబితాలో అయినా ఆయనపై చర్యలు తీసుకోవాలనుకుంటే మళ్లీ సేమ్ సీన్. ఇప్పుడు మూడో జాబితా సిద్ధమైంది. అందులోనూ తొలిపేరు ఆయనదే. మళ్లీ పాత కథే. ఆయన్ను సెలవుపై పంపించొద్దంటూ ఏకంగా ఇద్దరు మంత్రులు, మరో ప్రజాప్రతినిధి ఒత్తిడి చేస్తున్నారు. ఏ అండాలేని వారు సెలవుపై వెళ్లిపోతున్నారు. పెద్దల అండదండలున్న ఈ తిమింగలం మాత్రం గనుల శాఖ నుంచి కదలనంటే కదలనంటోంది.

- గనుల వెంకటరెడ్డి కంటే ఘనుడు
- సెలవుపై పంపడానికి గనుల శాఖ యత్నం
- ససేమిరా అంటున్న ఇద్దరు అమాత్యులు
- గతంలో రెండుసార్లు పైరవీలు
- తాజాగా సీఎంవో నుంచి వచ్చిన జాబితాలోనూ ఆయనదే తొలిపేరు
- ఇప్పుడు కూడా పెద్దల నుంచి తీవ్ర ఒత్తిళ్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆ అధికారి గనుల ఘనుడు వెంకటరెడ్డిని మించిన మహా ఘనుడు. కంటికి కనిపించకుండా అక్రమాలు, అవినీతికి పాల్పడటంలో ఆయనకు ఎవరూ సాటిరారనే పేరుంది. ఇలాంటి వారిని వెనకేసుకొస్తుందనే పేరున్న గత జగన్ ప్రభుత్వం కూడా ఆయన దోపిడీని భరించలేక చర్యలు తీసుకుంది. కానీ కూటమి ప్రభుత్వంలో ఆయన్ను కదల్చలేకపోతున్నారు. గత

మిగతా 9వ పేజీలో...

దళిత ఎంపీడీవోపై వైసీపీ నేత దాడి

గొంతు మీద కాలేసి.. పిడిగుద్దులు!

- అన్నమయ్య జిల్లా గాలివీడులో దౌర్జన్యకాండ
- కర్రలతో విచక్షణారహితంగా కొట్టిన వైనం

14

మన్మోహన్ జీవితం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయక పాఠం

- అనేక సవాళ్ల మధ్య ఆయన అసాధారణ విజయాలు సాధించారు
- వీడియో సందేశంలో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, డిసెంబరు 27: దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ జీవితం భవిష్యత్ తరాలకు ఒక స్ఫూర్తిదాయక పాఠంగా ఉంటుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశ విభజన తర్వాత సర్వస్వమూ పాకిస్థాన్‌లో వదిలేసి భారత్‌కు వచ్చిన కుటుంబానికి చెందిన మన్మోహన్.. తీవ్రమైన సమస్యల మధ్య కూడా అనేక అసాధారణ విజయాలు సాధించారని గుర్తు చేశారు. ఈ మేరకు మోదీ శుక్రవారం ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. 'దేశ ప్రజానీకం పట్ల, దేశాభివృద్ధి పట్ల మన్మోహన్ అంకితభావం ఎల్లప్పుడూ గౌరవాన్ని అందుకుంటుంది. ఆయన మృతి దేశానికి తీరని నష్టం కలిగించింది. హుందాతనం మూర్తీభవించిన వ్యక్తిగా, మేధావిగా, ఆర్థికవేత్తగా, సంస్కరణలకు అంకితమైన నాయకుడిగా మన్మోహన్ ఎప్పటికీ గుర్తుండిపోతారు' అని మోదీ తెలిపారు. సవాళ్లతో కూడుకున్న సమయంలో మన్మోహన్ ఆర్బీఐ గవర్నర్‌గా పని చేశారని, పీవీ నరసింహారావు హయాంలో కేంద్ర ఆర్థికమంత్రిగా దేశాన్ని నూతన ఆర్థిక పథంలో నిలిపారని, ప్రధానిగా దేశాభివృద్ధికి కట్టుబడి సేవలందించారని వివరించారు. వ్యక్తిగతంగా మన్మోహన్ పాటించిన విలువలనూ మోదీ ప్రశంసించారు. 'ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థల్లో చదువుకొని, ఉన్నత హోదాల్లో పని చేసిన మన్మోహన్‌సింగ్.. తన మూలాలను, వాటి తాలూకు విలువలను ఎన్నడూ మర్చిపోలేదు. నిజాయితీ, నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనంగా జీవితం గడిపారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలిచారు. కొన్నేళ్లుగా ఆరోగ్యం సహకరించకపోయినా వీల్‌చెయిర్‌లో వచ్చి పార్లమెంటు కార్యకలాపాలకు హాజరయ్యారు' అని గుర్తు చేశారు. మన్మోహన్ సింగ్‌ది రాజకీయపార్టీలకు అతీతమైన వ్యక్తిత్వమని, తాను గుజరాత్ సీఎంగా ఉన్న రోజుల్లో అనేక జాతీయ, అం తర్జాతీయ అంశాలపై ప్రధానిగా ఉన్న మన్మోహన్‌ను కలిసి మాట్లాడేవాడినని మోదీ పేర్కొన్నారు. 2014లో తాను ప్రధాని అయిన తర్వాతా మన్మోహన్‌ను ఆయన పుట్టినరోజున కలిసి మాట్లాడానని తెలిపారు.

బెళగావిలో మన్మోహన్ సంస్మరణ సభ

బెంగళూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహాత్మాగాంధీ బెళగావిలో బాధ్యతలు చేపట్టి వందేళ్లు గడిచిన సందర్భంగా నిర్వహిస్తున్న సభ.. రెండో రోజు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంస్మరణ సభగా మారింది. 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' సభను రద్దు చేసి, అక్కడే మన్మోహన్ సింగ్ సంస్మరణ సభ నిర్వహించారు. కేపీసీసీ ఆధ్వర్యంలో శుక్రవారం మన్మోహన్‌సింగ్ సంస్మరణ సభ నిర్వహించారు. సీఎం సిద్దరామయ్య, మంత్రులు పుష్పాంజలి ఘటించారు.

అసలైన రాజనీతిజ్ఞుడు మన్మోహన్

- భారత రాజకీయ, ఆర్థిక రంగాల్లో మహోన్నత వ్యక్తి
- మాజీ ప్రధానికి సీడబ్ల్యూసీ ఘన నివాళి

న్యూఢిల్లీ, డిసెంబరు 27 : మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ భారత రాజకీయ, ఆర్థిక రంగాల్లో ఓ మహోన్నత వ్యక్తి అని, అసలైన రాజనీతిజ్ఞుడని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) పేర్కొంది. తన జీవితం, అందించిన సేవలతో మన్మోహన్ దేశ దశ, దిశను మార్చేశారని అభిప్రాయపడింది. ఈ మేరకు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి అర్పిస్తూ సీడబ్ల్యూసీ ఓ తీర్మానం చేసింది. మన్మోహన్ సింగ్ మృతి నేపథ్యంలో న్యూఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో సీడబ్ల్యూసీ శుక్రవారం సమావేశం అయింది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని మాజీ ప్రధానికి పుష్పాంజలి ఘటించారు. 1990ల్లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా పని చేసిన మన్మోహన్ సింగ్ భారతదేశ ఆర్థిక రంగ సరళీకరణకు రూపశిల్పి అని సీడబ్ల్యూసీ తన తీర్మానంలో పేర్కొంది. మన్మోహన్ ముందుచూపుతో చేపట్టిన సంస్కరణలు భారతదేశం ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకొని నిలబడేలా చేశాయని, అంతర్జాతీయ వాణిజ్యాన్ని ప్రోత్సహించాయని తెలిపింది. ప్రైవేటీకరణ, విదేశీ పెట్టుబడులకు ప్రోత్సహించడం వంటి నిర్ణయాలతో మన్మోహన్‌సింగ్ భారతదేశాన్ని ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా చేశారని వివరించింది. ఉపాధి హామీ పథకం, విద్యా హక్కు చట్టం, జాతీయ ఆహార భద్రత చట్టం, భూసేకరణ చట్టం, వ్యవసాయ రుణ మాఫీ, ఎస్సీ, ఎస్టీలకు సామాజిక న్యాయం అందించే 93వ రాజ్యాంగ సవరణ, సమాచార హక్కు చట్టం వంటివి అన్నీ మన్మోహన్ హయాంలోనే జరిగాయని సీడబ్ల్యూసీ గుర్తు చేసింది. సమ్మిళిత వృద్ధి, విదేశీ వ్యవహారాలు, ఆర్థిక రంగ బలోపేతం వంటి అంశాలతో పాటు సగటు పౌరుడి సంక్షేమం కోసం మన్మోహన్ సింగ్ చేసిన కృషి వల్లే భారతదేశం ప్రపంచ శక్తిగా ఎదిగిందని వివరించింది. విద్యావేత్తగా, ఆర్థికవేత్తగా, సంస్కరణకర్తగా మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని సీడబ్ల్యూసీ తీర్మానం చేసింది.



మన్మోహన్ సింగ్ భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న రాహుల్ గాంధీ; చిత్రంలో ఖర్గే


పీవీని కాదని..
మన్మోహన్‌కు ఔనని..

- ఏఐసీసీ కార్యాలయంలోకి పీవీ భౌతికకాయం రాకుండా నాడు గేట్లు మూసేసిన కాంగ్రెస్ పార్టీ
- మన్మోహన్‌కు రాజ్ ఘాట్‌లో అంత్యక్రియలు నిర్వహించాలంటూ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి
- కార్యకర్తల సందర్శనార్థం ఆయన పార్థివదేహాన్ని ఏఐసీసీ కార్యాలయంలో ఉంచుతామని వెల్లడి



న్యూఢిల్లీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక పతనం అంచున ఉన్న దేశాన్ని గాడిన పెట్టిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు ఇవ్వని గౌరవాన్ని.. కాంగ్రెస్ అధిష్ఠానం ఆయన హయాంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన మన్మోహన్ సింగ్‌కు ఇస్తోంది! పీవీ చనిపోయినప్పుడు ఆయన భౌతిక కాయాన్ని సైతం ఏఐసీసీ కార్యాలయానికి రానివ్వకుండా గేట్లు మూసేసిన కాంగ్రెస్ పార్టీ.. పీవీ భౌతిక కాయాన్ని హైదరాబాద్‌కు పంపి అంత్యక్రియలు చేయించిన అధిష్ఠానం.. ఇప్పుడు రాజ్‌ఘాట్‌లో మన్మోహన్ సింగ్‌కు అంత్యక్రియలు నిర్వహించాలని, అక్కడ ఆయన ప్రత్యేక స్మారకస్థలిని ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తోంది! వీపీ సింగ్, మొరార్జీ దేశాయ్, పీవీ నరసింహారావు మినహా.. దేశ మాజీ ప్రధానులందరి అంత్యక్రియలూ ఢిల్లీలోనే జరిగిన సంగతి తెలిసిందే. పీవీ నరసింహారావు చనిపోయినప్పుడు కేంద్రంలో అధికారంలో ఉండీ అంత కఠినంగా వ్యవహరించిన కాంగ్రెస్ పార్టీ.. మన్మోహన్ విషయంలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. పార్టీ కార్యకర్తల సందర్శనార్థం మన్మోహన్ సింగ్ భౌతిక కాయాన్ని శనివారం ఉదయం 8-30 నుంచి 9-30 వరకు ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో ఉంచుతామని.. 9.30కి అంతిమయాత్ర మొదలవుతుందని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శుక్రవారం ధ్రువీకరించారు. యమునా నది ఒడ్డున ఉన్న రాజ్‌ఘాట్‌లో అంత్యక్రియలు నిర్వహించాల్సిందిగా శుక్రవారం కేంద్రాన్ని కూడా కోరినట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెప్పాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధానమంత్రి నరేంద్రమోదీకి స్వయంగా ఈ విజ్ఞప్తి చేశారు. అనంతరం.. మన్మోహన్‌కు అంత్యక్రియలు నిర్వహించిన చోటులోనే స్మారకాన్ని కూడా నిర్మించాలని కోరుతూ రెండు పేజీల లేఖ రాశారు. రెండు సార్లు ప్రధానిగా సేవలందించిన మన్మోహన్‌కు దేశ ప్రజల హృదయాల్లో అత్యంత గౌరవనీయస్థానం ఉందని, ఆయన సాధించిన విజయాలు, దేశానికి చేసిన సేవలు అపూర్వమని ఖర్గే ఆ లేఖలో గుర్తుచేశారు. మాజీ ప్రధానులకు అంత్యక్రియలు జరిగిన చోటే వారి స్మారకాలను నిర్మించిన సంప్రదాయం ఉందని గుర్తుచేశారు. అలాగే.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు ప్రియాంక గాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్ ప్రత్యేకంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి ఈ మేరకు అభ్యర్థించారు. రాజ్‌ఘాట్‌లో ఒక్కొక్కరికీ ప్రత్యేక స్మారక స్థలం ఏర్పాటు చేసేందుకు స్థలం సరిపోనందువల్ల.. రాష్ట్రీయ స్మృతిస్థల్‌లో మాజీ ప్రధానుల స్మారక చిహ్నాలు ఏర్పాటు చేయాలని 2013లో యూపీఏ హయాంలో మన్మోహన్ సింగ్ అధ్యక్షతన కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు అదే మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు రాజ్‌ఘాట్‌లో ప్రత్యేక స్మారక స్థలం కావాలని కాంగ్రెస్ పార్టీ స్వయంగా కోరడం గమనార్హం. అంతేనా.. మన్మోహన్‌కు ప్రత్యేకంగా స్మారకస్థలిని నిర్మించకపోవడమంటే దేశ తొలి సిక్కు ప్రధానిని ఉద్దేశపూర్వకంగా అవమానించడమేనని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ ట్వీట్ చేశారు.

అశ్రునివాళుల మధ్య..
స్మృతి పథంలోకి



(మొదటిపేజీ తరువాయి)

చేయాల్సిందిగా రక్షణ శాఖను కోరినట్లు వెల్లడించింది. మరోవైపు.. మన్మోహన్ మృతి పట్ల కేంద్ర మంత్రివర్గం శుక్రవారం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన భేటీ అయిన క్యాబినెట్.. మన్మోహన్ మృతికి సంతాప సూచకంగా తొలుత రెండు నిమిషాలపాటు మౌనం పాటించింది. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడుతూ సంతాప తీర్మానం చేసింది. "దేశ ప్రజల జీవితాలపై మన్మోహన్ సింగ్ చెరగని ముద్ర వేశారు. ఆయన మృతితో దేశం ప్రముఖ రాజనీతిజ్ఞుడిని, ప్రఖ్యాత ఆర్థికవేత్తను, మహోన్నత నాయకుడిని కోల్పోయింది" అని ఆ తీర్మానంలో పేర్కొంది. ఢిల్లీలోని సమాధి కాంప్లెక్స్‌లో ఉన్న స్మృతి స్థలంలో ఆయన స్మారకాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మన్మోహన్ మృతికి సంతాప సూచకంగా ఏడురోజులపాటు జాతీయ సంతాపదినాలుగా కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు జనవరి 1 వరకూ దేశవ్యాప్తంగా జాతీయ జెండాను అవనతం చేస్తారు. అలాగే, ఇతర దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలన్నింటిపైనా జాతీయ జెండాను అవనతం చేస్తారు. ఆయన అంత్యక్రియల సందర్భంగా.. శనివారం కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల కార్యాలయాలకు ఒంటిపూట సెలవు ప్రకటిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా.. ఢిల్లీలోని మన్మోహన్ సింగ్ నివాసంలో ఆయన భౌతిక కాయాన్ని శుక్రవారం పలువురు ప్రముఖులు, పెద్ద సంఖ్యలో ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు సందర్శించి కడసారి నివాళులు అర్పించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ, ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ వాద్రా తదితరులు ఆయన నివాసానికి వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారు. మన్మోహన్ కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆర్థికమే కాదు.. హరిత లక్ష్యాలు కూడా!

- మన్మోహన్‌లో మరో కోణం

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంటే కేవలం ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన లక్ష్యాలనే ఎక్కువ మంది ప్రస్తావిస్తారు. కానీ, ఆయనలో హరిత లక్ష్యాలు కూడా ఉన్నాయి. 2004-14 మధ్య పదేళ్లపాటు ప్రధాని పీఠం అలంకరించిన మన్మోహన్‌సింగ్ దేశంలో హరిత సంపద విరాజిల్లేలా అనేక నిర్ణయాలు తీసుకున్నారు. వాతావరణ మార్పులపై జాతీయ ప్రణాళిక(ఎన్‌ఏపీసీసీ), అటవీ హక్కుల చట్టం, జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్జీటీ) వంటివి తీసుకువచ్చారు. తద్వారా పర్యావరణ పరిరక్షణ, అటవీ సంరక్షణకు పెద్దపీట వేశారు. అటవీ సంపదపై ఆదివాసీలకే హక్కులకు కల్పించడం ద్వారా వన సంరక్షణకు ప్రాధాన్యమిచ్చారు. అదేవిధంగా 25 లక్షల మందికి హక్కులు కల్పించారు.

జిన్నాను తాకిన మన్మోహన్ బంతి!

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ క్రీడా ప్రియుడు కూడా. అవిభాజ్య భారత్‌లోని పంజాబ్ రాష్ట్రంలో జన్మించిన మన్మోహన్‌సింగ్ తన 13 ఏళ్ల ప్రాయంలో లాహోర్‌లోని జూనియర్ కాలేజీ మైదానంలో తన మిత్రులతో కలిసి హాకీ ఆడుతున్నారు. ఈ మైదానానికి సమీపంలో ఉన్న ఓ ఇంటి ముందు ఓ పెద్దాయన నిలబడి వీరి ఆటను ఆసక్తిగా వీక్షించారు. ఇంతలో మాస్టర్ మన్మోహన్ సింగ్ కొట్టిన బంతి గోల్ పోస్టులోకి వెళ్లకుండా పొరపాటు ఇంటి ముందు నిలబడి వీరి ఆటను వీక్షిస్తున్న పెద్దాయన తలను తాకింది. అయితే.. బంతి తగిలిన పెద్దాయన నవ్వి ఊరుకున్నారు. ఆయన ఎవరో కాదు.. పాకిస్థాన్ విభజన కోసం పట్టుబట్టిన మహమ్మద్ అలీ జిన్నా. ఈ సరదా సంఘటనను మన్మోహనే స్వయంగా చెప్పుకొచ్చారు. - (సెంట్రల్ డెస్క్)

కొరడాతో కొట్టుకుని నిరసన

- తమిళనాడులో శాంతిభద్రతల పరిస్థితిపై బీజేపీ అధ్యక్షుడు అన్నామలై వినూత్న చర్య

చెన్నై, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంజనీరింగ్ విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనపై తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అన్నా విశ్వవిద్యాలయంలో జరిగిన ఘటనకు ప్రభుత్వ భద్రతా వైఫల్యమే కారణమంటూ, ఇందుకు నిరసనగా శుక్రవారం అన్నామలై కొరడాతో ఆరుసార్లు కొట్టుకున్నారు. విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనను ఖండిస్తూ తాను 48 రోజుల పాటు వ్రతం ఆచరించి మురుగన్ ఆలయానికి వెళ్లి రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న వేధింపులు, అత్యాచారాల గురించి నివేదించనున్నట్లు గురువారం ఆయన ప్రకటించారు. తమిళనాడులో డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు తాను పాదరక్షలు ధరించని శపథం చేశారు. వ్రతంలో భాగంగా తన ఇంటి వద్దే ఆరుసార్లు కొరడాతో కొట్టుకుంటానన్నారు. ఆ ప్రకారం శుక్రవా రం కోయంబత్తూరులో తన నివాసం ఎదుట చొక్కా లేకుండా, పచ్చరంగు లుంగీ ధరించి, నుదుట విభూతి రేఖలు దిద్దుకుని పార్టీ కార్యకర్తల సమక్షంలో కొరడాతో కొట్టుకున్నారు. ఆ సమయంలో ఆయన చుట్టూ చేరిన పార్టీ శ్రేణులు 'వెట్రివేల్.. వీరవేల్' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

తమిళ సంప్రదాయంలో భాగమే: అన్నామలై

అన్నామలై విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నిరసన తమిళ సంప్రదాయంలో భాగమేనని అన్నారు. బీజేపీ కార్యకర్తలెవరూ తనను అనుసరించరాదని విజ్ఞప్తి చేశారు. మహిళా లోకానికి జరుగుతున్న అన్యాయాల ను నిరోధించాలని తమిళుల ఆరాధ్య దైవమైన మురుగప్పెరుమాన్‌ను వేడుకోవటంలో భాగంగానే మండలం పాటు వ్రతం ఆచరిస్తున్నట్లు చెప్పారు.

వచ్చే ఏడాదిలో 4 గ్రహణాలు

- వీటిలో 2 సూర్య, 2 చంద్ర గ్రహణాలు
- భారత్‌లో కనిపించనున్న ఒక చంద్రగ్రహణం

ఇండోర్, డిసెంబరు 27: వచ్చే సంవత్సరంలో నాలుగు గ్రహణాలు సంభవించనున్నాయని, వీటిలో రెండు సూర్య, రెండు చంద్రగ్రహణాలు ఉంటాయని మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినీ జీవాజీ అబ్జర్వేటరీ సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్ర ప్రకాష్ గుప్తా శుక్రవారం తెలిపారు. అయితే వీటిలో ఒక్కదానిని మాత్రమే భారత్‌లో ఖగోళశాస్త్ర ప్రేమికులు చూసే అవకాశం దక్కనుందన్నారు. 2025 మార్చి 14న సంపూర్ణ చంద్రగ్రహణం సంభవిస్తుందని, అయితే ఇది భారత్‌లో పగటిపూట సంభవించనుండటం వల్ల ఇది కనిపించే అవకాశంలేదని తెలిపారు. అమెరికా, పశ్చిమ యూరప్, పశ్చిమాఫ్రికా, ఉత్తర, దక్షిణ అట్లాంటిక్ మహాసముద్రాల ప్రాంతాల్లో ఇది కనిపిస్తుందన్నారు. మార్చి 29న పాక్షిక సూర్యగ్రహణం సంభవిస్తుందని, ఇది కూడా భారత్‌లో కనిపించదని తెలిపారు. ఇక సెప్టెంబరు 7-8 మధ్య ఏర్పడే సంపూర్ణ చంద్రగ్రహ ణం భారత్‌తోపాటు ఇతర ఆసియా దేశాలు, యూరప్, అంటార్కిటికా, పశ్చిమ పసిఫిక్ మహాసముద్రం, ఆస్ట్రేలియా, హిందూ మహాసముద్ర ప్రాంతాల్లో కనిపిస్తుందని గుప్తా తెలిపారు. ఇక 2025 సంవత్సరంలో చివరిగా సెప్టెంబరు 21-22 మధ్య పాక్షిక సూర్య గ్రహణం సంభవిస్తుందని, ఇది భారత్‌లో కనిపించదని తెలిపారు.

హిడ్మా కోసం 10 వేలకు పైగా బలగాలు!

- ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ముమ్మర వేట

చర్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మాద్వి హిడ్మా కోసం ఛత్తీస్‌గఢ్ అడవులను భద్రతా దళాలు జల్లెడ పడుతున్నాయి. వేలాది మంది వాగులు, వంకలు దాటుతూ గాలిస్తున్నారు. హిడ్మా టార్గెట్‌గా ఐదు క్యాంపుల ద్వారా.. దాదాపు 10 వేలకు పైగా బలగాలు అడవుల్లో ముమ్మర వేట సాగిస్తున్నాయి. బీజాపూర్, సుకుమా జిల్లాల అడవుల్లో చేపట్టిన ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో డీఆర్‌జీ, కోబ్రా, ఎస్టీఎఫ్, మహిళా కమాండోలు పాల్గొంటున్నారు. హిడ్మా సొంతూరైన సుకుమా జిల్లా పూవర్తిలో కొద్దినెలల కిందే సీఆర్‌పీఎఫ్ క్యాంపును ఏర్పాటు చేశారు. అనంతరం పూవర్తి పక్కనే ఉన్న కొండపల్లి, గుండం గ్రామాల్లోనూ క్యాంపులు ఏర్పాటు చేశారు.

జాతీయ వ్యవసాయ అకాడమీ ఫెలోగా శాస్త్రవేత్త భానుప్రకాశ్ రెడ్డి



హైదరాబాద్, డిసెంబరు 28: జాతీయ వ్యవసాయ అకాడమీ(నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్) ఫెలోగా జాతీయ పోషకాహార సంస్థ(ఎన్ఐఎన్) సీనియర్ శాస్త్రవేత్త, బయోకెమిస్ట్రీ విభాగం సారథి డాక్టర్ భానుప్రకాష్ రెడ్డి ఎంపికయ్యారు. పోషకాహార రంగంలో భానుప్రకాష్ చేసిన విస్తృత పరిశోధనలకు గుర్తింపుగా ఆయనకు ఫెలోగా అవకాశం దక్కిందని ఎన్ఐఎన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. మనిషికి ఎంత పోషకాహారం కావాలి? పోషకాహార లోపాలు, నిత్యం ఉపయోగించే వంట దినుసులతో అనేక వ్యాధులను ఎలా దరిచేరకుండా చూసుకోవచ్చనే అంశాలపై భానుప్రకాష్ దశాబ్దాలుగా పరిశోధనలు నిర్వహిస్తున్నారు. వంట దినుసులతో మధుమేహాన్ని ఎలా దరిచేరకుండా చూసుకోవచ్చనే దానిపై విజయవంతంగా పరిశోధనలు నిర్వహించారు. జాతీయ, అంతర్జాతీయంగా 250 పరిశోధనా వ్యాసాలను ప్రచురించారు. ఐసీఎంఆర్-బసంతి దేవి అవార్డుతో పాటు పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను భానుప్రకాష్ అందుకున్నారు.

26/11 ముంబై పేలుళ్ల నిందితుడు అబ్దుల్ రెహ్మాన్ మక్కీ మృతి

న్యూఢిల్లీ, డిసెంబరు 27: నిషేధిత జమాత్-ఉద్-దవా ఉగ్రవాద సంస్థ డిప్యూటీ చీఫ్, ముంబై పేలుళ్ల నిందితుడు అబ్దుల్ రెహ్మాన్ మక్కీ పాకిస్థాన్‌లో మృతి చెందాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అతడు లాహోర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం గుండెపోటుతో చనిపోయాడు. 2008 నవంబరు 26న జరిగిన ముంబై పేలుళ్ల సూత్రధారి హఫీజ్ సయీద్‌కు అబ్దుల్ రెహ్మాన్ మక్కీ బావమరిది. ఉగ్రవాదులకు నిధులు సమకూర్చిన కేసులో రెహ్మాన్ మక్కీకి యాంటీ టెర్రరిజం కోర్టు 2020లో ఆరునెలల జైలు శిక్ష విధించింది. ఆ తర్వాత 2023లో ఐక్యరాజ్య సమితి అతడిని అంతర్జాతీయ ఉగ్రవాదిగా గుర్తించి, అతడి ఆస్తులను స్తంభింపచేయడంతో పాటు అతడి ప్రయాణాలపై ఆంక్షలు విధించింది.

మన్మోహన్ ఓ చాంపియన్

- జాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల నివాళి

న్యూఢిల్లీ, డిసెంబరు27: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంపై జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. ప్రపంచంలోని గొప్ప చాంపియన్లలో మన్మోహన్‌సింగ్ ఒకరని, భారత్-అమెరికాల మధ్య పౌర అణు సహకార ఒప్పందంలో కీలకపాత్ర పోషించారని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటొనీ బ్లింకెన్ చెప్పారు. రెండు దేశాల మధ్య స్నేహం బలోపేతమయ్యేందుకు విశేషంగా కృషి చేశారని తెలిపారు. మన్మోహన్ చేపట్టిన ఆర్థిక సంస్కరణలతో ఎప్పటికీ గుర్తుండిపోతారని బ్లింకెన్ కీర్తించారు. రష్యా-భారత్ మధ్య ప్రత్యేక వ్యూహాత్మక బంధం ఏర్పడటంలో మన్మోహన్ పాత్ర కీలకమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చెప్పారు. ఆర్థిక రంగంలో భారత్ ప్రగతి కోసం ఆయన విశేషంగా కృషి చేశారని ప్రశంసించారు. భారత్-చైనా మధ్య సంబంధాలు సజావుగా కొనసాగేలా మన్మోహన్ యత్నించారని చైనా విదేశాంగ ప్రతినిధి మావో నింగ్ తెలిపారు. మన్మోహన్ హయాంలో సరిహద్దు అంశంపై కీలక ఒప్పందాలు కుదిరాయన్నారు. దేశ ప్రయోజనాల కోసం ధైర్యంగా ఆర్థిక సంస్కరణలు చేపట్టారని భారత్‌లో బ్రిటన్ హైకమిషనర్ లిండీ కామెరాన్ కీర్తించారు. ఆర్థిక రంగంలో భారత్‌ను సరైన స్థానంలో ఉంచడంలో కీలకంగా వ్యవహరించారని అభిప్రాయపడ్డారు. అఫ్ఘానిస్థాన్ ప్రజలకు మన్మోహన్ మంచి మిత్రుడని ఆదేశ మాజీ అధ్యక్షుడు హమిద్ కర్జాయ్ తెలిపారు. మన్మోహన్‌తో పని చేయడం గొప్పగా ఉండేదని మాల్దీవుల మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్ చెప్పారు. బ్రిక్స్, ఐబీఎస్‌ఏ గ్రూపుల ఏర్పాటులో మన్మోహన్ కీలకంగా వ్యవహరించారని బ్రెజిల్ అధ్యక్షుడు లులా డిసెల్వా చెప్పారు. మంచి స్నేహితుడిని కోల్పోయానన్నారు. మన్మోహన్ గొప్ప దార్శనికుడని, అసామాన్య రాజనీతిజ్ఞుడని నేపాల్ మాజీ ప్రధాని పుష్ప కమల్ దహల్ చెప్పారు. అనేకతరాలపాటు ఆయన స్ఫూర్తి కొనసాగుతుందన్నారు. మన్మోహన్ దార్శనిక ఆర్థికవేత్త అని శ్రీలంక మాజీ అధ్యక్షుడు మహింద రాజపక్స చెప్పారు.

అవినీతికి మన్మోహన్ వ్యతిరేకం

అవినీతికి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ వ్యతిరేకమని ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నాహజారే చెప్పారు. 2010 ఆరంభంలో మన్మోహన్ పాలనకు వ్యతిరేకంగా తాను ఉద్యమించినప్పుడు లోక్‌పాల్, లోకాయుక్త చట్టాలకు సంబంధించి తన డిమాండ్లపై చురుగ్గా నిర్ణయాలు తీసుకున్నారని హజారే కీర్తించారు. మన్మోహన్‌సింగ్ సేవలను భారత్ ఎప్పటికీ గుర్తించుకుంటుందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తెలిపింది. అతి సాధారణ కుటుంబం నుంచి వచ్చి అత్యున్నత పదవి చేపట్టారని కీర్తించింది.

నా స్నేహితుడా...సోదరుడా... ఇక సెలవు!!

మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం

మన్మోహన్‌సింగ్ మృతిపై మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం భావోద్వేగంతో స్పందించారు. "గుడ్‌బై.. మైమిత్రా.. మైభాయ్, మన్మోహన్" అంటూ "ఎక్స్"లో తమ ఇద్దరి అనుబంధాన్ని వివరించారు. 1990ల్లో తామిద్దరం ఆర్థిక మంత్రులుగా ఉన్నప్పుడు కలిసి పనిచేసిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి తనను విషాదంలో ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గొప్ప వ్యక్తి, భారత ఆర్థిక సంస్కరణల రూపశిల్పిని స్మరిస్తూ ఎన్నెనో వ్యాసాలు, పుస్తకాలు రాయవచ్చన్నారు. భారత్ ప్రపంచంలోనే గొప్ప ఆర్థికశక్తిగా ఎదిగేందుకు ప్రధానిగా ఆయన ఓ మంత్రసానిలా కీలకపాత్ర పోషించారని కొనియాడారు. అవినీతిపై ఇద్దరం అవిశ్రాంత పోరాటం చేశామన్నారు. ఓ కీలక కేసును బయటకు తీయడంలోనూ సహకరించుకున్నట్లు గుర్తుచేసుకున్నారు. "ఎక్కువ మందికి ఓ విషయం తెలియదు. మలేషియన్లతో నేడీ విషయాన్ని పంచుకోవాలి. నన్ను జైల్లో వేసినప్పుడు మన్మోహన్ ఓ సాహసానికి పూనుకున్నారు. అది అప్పటి మలేషియా ప్రభుత్వానికి నచ్చేదీకాదు. రాజకీయంగానూ సరైన నిర్ణయం కాదు... అయినా మన్మోహన్ ఆ పని చేశారు. నా పిల్లల చదువులకు ఉపకార వేతనాలు ఇవ్వడానికి ముందుకు రావడం... మరీ ముఖ్యంగా మా అబ్బాయి ఇహ్‌సాన్‌కు.. నేను వాటిని తిరస్కరించినా... ఆ చర్య ఆయన ఉదార స్వభావానికి, మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం" అని ఇబ్రహీం ప్రశంసించారు.

ప్రభుత్వ నియంత్రణ నుంచి ఆలయాలకు స్వేచ్ఛ కల్పించాలి

దేశవ్యాప్తంగా 'జాగరణ్ అభియాన్' ప్రచారం

5న విజయవాడలో ప్రారంభం: వీహెచ్‌పీ

న్యూఢిల్లీ, డిసెంబరు 27: ఆలయాలకు ప్రభుత్వ నియంత్రణ నుంచి స్వేచ్ఛ కల్పించాలన్న డిమాండ్‌ను వీహెచ్‌పీ తీవ్రం చేసింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా భారీ ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆలయాలను ప్రభుత్వాల నియంత్రణ నుంచి బయటకు తీసుకురావాలన్న అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జనవరి 5వ తేదీ నుంచి 'జాగరణ్ అభియాన్' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి మిలింద్ పరండే వెల్లడించారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ నుంచి ఈ క్యాంపెయిన్ ప్రారంభం అవుతుందని, 2 లక్షల మందికి పైగా పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. హిందూ సమాజంలోని ప్రముఖ వ్యక్తులు, సాధువుల నాయకత్వంలో ఈ దేశవ్యాప్త ప్రచార కార్యక్రమం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

మెనోపాజ్‌కు.. దేశీయ 'గడ్డి'తో ఔషధం

- అభివృద్ధి చేసిన ఎన్ఐఎన్ పరిశోధకురాలు వందనా సింగ్

హైదరాబాద్, డిసెంబరు 27: మహిళలను తీవ్రంగా ఇబ్బందిపెట్టే మెనోపాజ్ (రుతుచక్రం ఆగిపోయే దశ) సమస్యలకు చెక్ పెట్టే ఔషధాన్ని.. జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) శాస్త్రవేత్త వందనా సింగ్ అభివృద్ధి చేశారు! అది కూడా దేశీయంగా దొరికే గడ్డితో ఆమె ఆ ఔషధాన్ని తయారుచేయడం విశేషం. ఈ ఔషధానికి పేటెంట్ కూడా మంజూరైంది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది నడివయసు మహిళలు మెనోపాజ్‌కు ముందు, తర్వాత పలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీన్ని మెనోపాజ్ సిండ్రోమ్‌గా వ్యవహరిస్తారు. ఈ సమస్యకు ఎన్ఐఎన్‌కు చెందిన వందనా సింగ్ ఎటువంటి దుష్ప్రభావాలూ లేని ఔషధాన్ని కనుగొనేందుకు నడుం బిగించారు. స్వతహాగా ఆమె ఆయుర్వేద వైద్యురాలు కావడం.. దేశీయ గరికలో ఉండే ఔషధగుణాల గురించి తెలిసి ఉండడంతో.. మెనోపాజ్‌కు 'నాన్ హార్మోనల్ థెరపీ ఫార్ములేషన్'ను అభివృద్ధి చేశారు. దీనికి ఇప్పటికే ప్రపంచవ్యాప్త గుర్తింపు లభించింది.

మరోసారి 'మిలియన్ వీసా' రికార్డు

- భారతీయులకు పదిలక్షలకుపైగా వలసేతర వీసాలు
- వరుసగా రెండో ఏడాదీ టాప్‌లో భారత్
- విదేశీ విద్యార్థుల ర్యాంకింగ్‌లో అగ్రస్థానం
- భారత్‌లోని అమెరికా ఎంబసీ వెల్లడి
- హెచ్-1బీ వీసాల రెన్యూవల్ ఇక తేలిక



న్యూఢిల్లీ, డిసెంబరు 27 : రికార్డు స్థాయి సందర్శకుల వీసాలు సహా మొత్తం పది లక్షలకుపైగా వలసేతర వీసాలను భారతీయులకు వరుసగా రెండో ఏడాది జారీ చేసినట్టు భారత్‌లోని అమెరికా ఎంబసీ ఒక ప్రకటనలో తెలిపింది. చదువుల కోసం తమ విద్యార్థులను అమెరికాకు పంపిన దేశాల వరసలో భారత్ టాప్‌లో నిలిచిందని తెలిపింది. ఈ ఏడాది 3,31,000 మందిని మనదేశం పంపినట్టు పేర్కొంది. 2008/2009 తర్వాత ఈ స్థాయిలో వేరే దేశం నుంచి అమెరికాకు చదువుల కోసం రావడం ఇదే తొలిసారి. అంతేకాదు.. అంతర్జాతీయంగా అత్యధికంగా గ్రాడ్యుయేట్లను వరుసగా రెండో ఏడాది కూడా అగ్రదేశానికి పంపిన ఘనతను కూడా భారత్ సొంతం చేసుకుంది. ఇప్పుడు అక్కడ రెండు లక్షల మంది (19 శాతం) గ్రాడ్యుయేట్లు మనదేశం నుంచి ఉన్నారు. విద్య తర్వాత పర్యాటకం, వ్యాపార అవసరాల కోసం అమెరికాను భారతీయులు సందర్శిస్తున్నారని ఈ సంస్థ తెలిపింది. అమెరికాకు భారత్ నుంచి సందర్శకుల సంఖ్య గత నాలుగేళ్లలోనే ఐదు రెట్లు పెరిగి.. 20 లక్షలమందికి చేరిందని వివరించింది. గత ఏడాది తొలి పదకొండు నెలలతో పోల్చితే.. ఈ ఏడాది అదే కాలానికి పెరుగుదల 26 శాతమని తెలిపింది. ఇప్పటికే యాభై లక్షలమంది వలసేతర వీసాల మీద అమెరికాలో ఉన్నారని, ప్రతి రోజూ ఈ వీసాలను వేలల్లో జారీ చేస్తున్నామని తెలిపింది. మరోవైపు.. హెచ్-1బీ వీసాలను అమెరికాలోనే పునరుద్ధరించే ఆలోచనతో చేపట్టిన పైలట్ విధానం మంచి ఫలితాలను ఇచ్చిందని ఆ దేశ విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. దీనివల్ల ప్రత్యేక వృత్తి నిపుణులను అత్యధికంగా అమెరికాకు అందిస్తున్న భారత్ ఎక్కువ లబ్ధి పొందనుంది. సాధారణంగా హెచ్-1బీ వీసా గడువు ముగియగానే మనవాళ్లు భారత్‌కు తిరిగి వచ్చి రెన్యువల్ (స్టాంపింగ్) చేయించుకోవాల్సి ఉంటుంది. ప్రయోగాత్మకంగా చేపట్టిన కొత్త విధానం ప్రకారం.. ఇకపై వీరు అమెరికాలోనే తమ వీసాలను రెన్యువల్ చేయించుకునే వెసులుబాటు కలగనుంది.


తిరుమల ఆలయం ముందు పీవీ సింధు, వెంకట దత్తసాయి

శ్రీవారి సేవలో సింధు దంపతులు

తిరుమల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నూతన దంపతులు, స్టార్ షట్లర్ పీవీ సింధు, వెంకట దత్తసాయి శుక్రవారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు అందుకున్నారు. ఇటీవల ఏడడుగులు వేసి ఒక్కటైన ఈ జంట గురువారం రాత్రి కాలినడకన తిరుమల చేరుకున్నారు. శుక్రవారం వేకువజాము జరిగిన అభిషేక సేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు.

నేటి నుంచి బెజవాడలో తెలుగు రచయితల మహాసభలు

విజయవాడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో శనివారం నుంచి 'కలం' సందడి చేయనుంది. ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను రెండ్రోజుల పాటు నిర్వహించనున్నారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసింది. విజయవాడ వన్‌టౌన్‌లోని కేబీఎన్ కళాశాలలో శని, ఆదివారాల్లో ఈ మహాసభలు నిర్వహించనున్నారు. సభాప్రాంగణానికి అమరజీవి పొట్టి శ్రీరాములుగా ప్రాంగణంగా నామకరణం చేశారు. దుబాయి, అమెరికా, లండన్, యూఏఈ దేశాల నుంచి మొత్తం 1500 మంది ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరవుతున్నారు. శనివారం ప్రారంభోత్సవ సభకు ముఖ్య అతిథులుగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ, అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు హాజరుకానున్నారు. విశిష్ట అతిథిగా డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు హాజరవుతారు. ఆరో ప్రపంచ తెలుగు కవుల మహాసభలను పురస్కరించుకుని రూపొందించిన 'మార్పు' పరిశోధనా గ్రంథాన్ని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ ఆవిష్కరిస్తారు. ఈసారి మహాసభల్లో కవి సమ్మేళనంతోపాటు యువగళ సమ్మేళనం నిర్వహించనున్నారు. 300 మంది విద్యార్థులు హాజరు కానుండగా వారికి ఇక్కడ అవగాహన సదస్సులు నిర్వహిస్తారు.

వాహన స్కామ్‌పై విజి'లెన్స్'



కార్లు, ఈ-ఆటోల కొనుగోలుకు రూ.వందల కోట్లు ఖర్చు



- వాహన డీలర్లతో ఎస్సీ కార్పొరేషన్ అధికారులు కుమ్మక్కు
- రూ.93.98 కోట్లు స్వాహా చేసి దళిత యువతకు ద్రోహం
- జగన్ భజన చేసిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారే కీలక లబ్ధిదారు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోని దళిత యువకులకు స్వయం ఉపాధి కల్పించాలనే సంకల్పంతో కార్లు, ఈ-ఆటోల కొనుగోలు కోసం ఆరేళ్ల క్రితం నాటి టీడీపీ ప్రభుత్వం రూ.వందల కోట్లు వెచ్చించింది. అయితే వాహన డీలర్లతో కుమ్మక్కైన ఎస్సీ కార్పొరేషన్ అధికారులు రూ.93.98 కోట్లు స్వాహా చేశారు. గత ప్రభుత్వంలో జగన్ భజన చేస్తూ, దళిత జనోద్ధారకుడిగా రాజకీయ పార్టీ పెట్టి ఎన్నికల్లో పోటీ చేసిన ఓ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈ స్కామ్‌లో కీలక పాత్రధారి అని తెలుస్తోంది. ఈ వ్యవహారంపై విచారణకు వైసీపీ ప్రభుత్వంలో ఓ మంత్రి ప్రయత్నం చేసినా, తాడేపల్లి ప్యాలెస్ నుంచి ఫోన్లు చేసి అక్షింతలు వేయడంతో కిక్కురుమనలేదు. దళితుల అభివృద్ధికి కేంద్రం ఇచ్చిన నిధుల గురించి ఇటీవల ఢిల్లీ నుంచి లేఖ రావడంతో కూటమి ప్రభుత్వం ఈ బాగోతంపై దృష్టి సారించింది. ఈ-ఆటోలు, కార్ల స్కామ్‌పై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం విచారణ మొదలుపెట్టినట్లు తెలిసింది. గ్రామాల్లో స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం అమలులో భాగంగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఈ-ఆటోలు కొనుగోలు చేసేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం టెండర్లు పిలిచింది. అందుకోసం ఎస్సీ యువతకు ఈ-ఆటోలు పంపిణీ చేసి వాటిని చెత్త తరలించేందుకు వినియోగించేందుకు సిద్ధమైంది. అందుకోసం 2017-18, 2018-19 సంవత్సరాలకు సంబంధించి జాతీయ సఫా యీ కర్మచారీ ఆర్థిక అభివృద్ధి సంస్థ, జాతీయ ఎస్సీ ఆర్థిక అభివృద్ధి సంస్థ నుంచి నిధులు తీసుకుంది. అప్పట్లో ఈ-ఆటోల సరఫరాకు పుణెకి చెందిన కైనటిక్ గ్రీన్ ఎనర్జీ అండ్ పవర్ సొల్యూషన్స్ లిమిటెడ్ సంస్థ ఆథరైజేషన్‌తో తాడేపల్లికి చెందిన వెంకటేశ్వర ట్రేడర్స్ ఒప్పందం చేసుకుంది. సరఫరాదారుల తరఫున ఆథరైజ్డ్ డీలర్ అనిల్‌కుమార్‌రెడ్డి 7,500 పవర్ ఆటోలు సరఫరా చేసేందుకు ఒప్పందం చేసుకుని రూ.77.91 కోట్లు అడ్వాన్స్‌గా పొందారు. అయితే ఆయన రూ.57.98 కోట్ల విలువైన 2,550 వాహనాలు మాత్రమే సరఫరా చేసి, మరో 4,950 వాహనాలు ఇవ్వలేదు. అడ్వాన్స్‌లో రూ.19.93 కోట్లు ఆయన వద్దనే ఉండగానే ఈగల్ అగ్రి ఎక్విప్‌మెంట్, కావలి పేరుతో 280 మెకనైజ్డ్ డ్రెయిన్ క్లీనింగ్ మెషిన్లు సరఫరా చేస్తామని మరో రూ.23.72 కోట్లు అడ్వాన్స్ తీసుకున్నారు. అందులోనూ రూ.14.27 కోట్లు విలువైన 209 మెషిన్లు సరఫరా చేసి, మరో 71 మెషిన్లు ఇవ్వకపోగా, రూ.9.45 కోట్లు తిరిగి చెల్లించలేదు. ఇదే కంపెనీ 660 ట్రాక్టర్లు సరఫరా చేస్తామని రూ.38.87 కోట్లు అడ్వాన్స్ తీసుకుని, రూ.26.56 కోట్లు ఖరీదైన 451 ట్రాక్టర్లు మాత్రమే సరఫరా చేసింది. తిరిగి చెల్లించాల్సిన రూ.12.31 కోట్లు డీలర్ వద్దనే ఉన్నాయి. మొత్తం మీద అనిల్‌కుమార్ రెడ్డి వద్దే రూ.41.69 కోట్లు ఆగిపోయాయి. ఈ మొత్తం తిరిగి చెల్లించాలంటూ వైసీపీ హయాంలో ఓ మంత్రి ఆదేశంతో ఎస్సీ కార్పొరేషన్ నోటీసు ఇచ్చింది. వెంటనే వైసీపీ పెద్దల నుంచి ఫోన్లు రావడంతో అధికారులు మౌనంగా ఉండిపోయారు. మరోవైపు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఎంట్రాన్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ 15 మెకనైజ్డ్ డ్రెయిన్ క్లీనింగ్ మెషిన్లు సరఫరా చేస్తామని రూ.3.52 కోట్లు అడ్వాన్స్‌గా తీసుకుని 6 మెషిన్లు మాత్రమే సరఫరా చేసింది. తీసుకున్న అడ్వాన్స్‌లో రూ.2.93 కోట్లు ఇప్పటికీ ఆ కంపెనీ ఖాతాలోనే ఉంది.

మరో డీలర్ రూ.49 కోట్లకు టోపీ

దళిత యువతకు కార్ల సరఫరా పేరుతో మరో డీలర్ ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.49కోట్లకు టోపీ పెట్టారు. విజయవాడకు చెందిన రాధా మాధవ్ ఆటో మొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ 1,061 ఇన్నోవాలు, 588 ఇతియోస్ కార్లు సరఫరా చేస్తామని రూ.221.64 కోట్లు అడ్వాన్స్ తీసుకుంది. అయితే రూ.172.28 కోట్ల విలువైన 1,230 వాహనాలే సరఫరా చేసింది. వాహనాలు తీసుకోవడంలో కార్పొరేషన్ జాప్యం చేసినందున 2018 నాటి ఒప్పందం ప్రకారం 2021లో ఇవ్వలేమని, పెరిగిన ధరల ప్రకారం తీసుకునేందుకు అంగీకరిస్తే పరిశీలిస్తామని ఆ సంస్థ ప్రతినిధులు తేల్చిచెప్పారు. అయితే ఎస్సీ కార్పొరేషన్ నోటీసులిచ్చేలోపు వారి డీలర్‌షిప్‌ను టొయోటా రద్దు చేసింది. అప్పటి సీఎం జగన్‌ను పొగడ్తలతో ముంచెత్తి ఆయనకు ఎన్నికల్లో మేలు చేసేందుకు రాజకీయ పార్టీని ప్రారంభించి, గత ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన ఒక రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వల్లే ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.93.98 కోట్లు గండిపడినట్లు తెలుస్తోంది. అడ్వాన్స్‌లు ఇచ్చింది టీడీపీ ప్రభుత్వంలో అయినా... డీలర్ల నుంచి వైసీపీ ప్రభుత్వం సొమ్ము వసూలు చేయలేకపోవడానికి ఆ డీలర్ సదరు అధికారికి బినామీ కావడమేనని కారణమని తెలుస్తోంది. డీలర్‌కు నోటీస్ ఇచ్చినప్పుడల్లా జగన్ పేషీ నుంచి ఫోన్ రావడంతో మంత్రులు కూడా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి ఉండేదని విజిలెన్స్ ప్రాథమిక విచారణలో తేలింది.

సీఏ ఫైనల్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ సత్తా

- జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు కైవసం


విలేకరులతో మాట్లాడుతున్న మట్టుపల్లి మోహన్

గుంటూరు(విద్య), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన సీఏ ఫైనల్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్లు అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ వెల్లడించారు. ఈ మేరకు మెయిన్ క్యాంపస్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మోహన్ మాట్లాడుతూ తమ విద్యార్థి రిషబ్ ఓత్సవాల్ ఆర్ మొదటి ర్యాంకు కైవసం చేసుకున్నాడని తెలిపారు. అదే విధంగా మంజులూరి మోహన్‌కృష్ణ 33, కేసన సాయిచరణ్ 34, కాకుమాను కృష్ణ చైతన్య 40వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు తమ విద్యార్థులు 50 సార్లు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

పోలవరం నిర్మాణ బాధ్యత చేపట్టాలని రాష్ట్రాన్ని కేంద్రమే కోరింది

- ఆర్థిక శాఖ 2016లో లేఖ రాసింది
- సత్వర లబ్ధి కోసం 41.15 మీటర్ల ఎత్తున తొలి దశలో పూర్తికి ఏపీ ప్రతిపాదన
- 'ఆర్‌టీఐ' ప్రశ్నకు జలశక్తి శాఖ జవాబు

అమరావతి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను చూసుకోవాలని రాష్ట్రప్రభుత్వాన్ని కేంద్రమే కోరింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ 2016 సెప్టెంబరు 30వ తేదీన లేఖ రాసింది. అలాగే ప్రాజెక్టు ప్రయోజనాలు సత్వరమే అందేందుకు వీలుగా తొలి దశలో 41.15 మీటర్ల ఎత్తున పనులు చేపడతామని.. భూసేకరణ కూడా చేస్తామని రాష్ట్రప్రభుత్వమే కోరిందని వెల్లడించింది. క్రమంగా 45.72 మీటర్ల ఎత్తున నిర్మాణం పూర్తిచేస్తామని చెప్పిందని తెలిపింది. 41.15 మీటర్ల కాంటూరులో పనులు చేపట్టడంపై సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద సీనియర్ జర్నలిస్టు ఇనగంటి రవికుమార్ వేసిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ పై సమాధానాలిచ్చింది. అయితే ఈ జవాబులు అస్పష్టంగా ఉన్నాయి. ఎవరు సీఎంగా ఉండగా తొలి దశలో పూర్తిచేస్తామని రాష్ట్రప్రభుత్వం చెప్పిందో ఆ శాఖ వెల్లడించలేదు. దాటవేత ధోరణితో వ్యవహరించింది. వాస్తవానికి 2019లో సీఎం చంద్రబాబు దిగిపోయేంతవరకు దశలవారీ నిర్మాణమన్న ఊసే రాలేదు. పనులన్నీ 45.72 మీటర్ల ఎత్తున పూర్తిచేసే దిశగానే జరిగాయి. పోలవరం ఎత్తు 150 అడుగులు.. డిశ్చార్జి 50 లక్షల క్యూసెక్కులు ఉండేలా డిజైన్ చేశారు. కానీ జగన్ గద్దెనెక్కాక.. రెండు దశల్లో నిర్మాణమని మొదలు పెట్టారు. 2020 తర్వాత.. 41.15 మీటర్ల కాంటూరులో 115 టీఎంసీల నీటి నిల్వకే పరిమితం చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. రెండోదశలో 45.72 మీటర్ల కాంటూరులో పనులు పూర్తిచేసి గరిష్ఠంగా 194.6 టీఎంసీలు నిల్వ చేస్తామని కేంద్రానికి తెలియజేశారు. ఆర్‌టీఐ కింద అడిగిన ప్రశ్నకు.. జలశక్తి శాఖ పొడిపొడిగా జవాబులిచ్చింది. సమాధానాన్ని ఇంతటితో ముగిస్తున్నట్లు పేర్కొనడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పెట్టుబడికి రెట్టింపు.. యాప్ టోకరా!

ఉక్కుటౌన్‌షిప్(విశాఖపట్నం), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పెట్టిన పెట్టుబడికి 54 రోజుల్లో రెట్టింపు ఇస్తామని 'కోస్తా' అనే యాప్ ప్రకటన చూసి స్టీల్‌ప్లాంటుకు చెందిన ఓ ఉద్యోగి డబ్బులు పెట్టారు. చెప్పినట్టుగానే నిర్వాహకులు వారం వారం డబ్బులు చెల్లిస్తూ వచ్చారు. దీంతో తెలిసిన ఉద్యోగులతో అతను యాప్‌లో పెట్టుబడులు పెట్టించారు. వారం వారం నగదు చెల్లిస్తుండడంతో నమ్మకం కుదిరి ప్లాంటులో కీలక విభాగాలకు చెందిన ఉద్యోగులు భారీసంఖ్యలో ఈ యాప్‌లో పెట్టుబడులు పెట్టారు. మూడు వారాల క్రితం క్రిస్మస్ ఆఫర్‌గా 15 రోజుల్లోనే పెట్టుబడికి రెట్టింపు ఇస్తామని చెప్పడంతో కొంతమంది అప్పులు చేసి మరీ కట్టారు. అయితే వారం నుంచి ఆ యాప్ పనిచేయకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు స్టీల్‌ప్లాంటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం స్టీల్‌ప్లాంటు సీఐ కేశవరావు వద్ద ప్రస్తావించగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఇసుక అక్రమార్కుల మధ్య ఆధిపత్య పోరు

- ఎమ్మెల్యే పేరుతో ఒకరు, ఎంపీ పేరుతో మరొకరు
- బాపట్ల జిల్లాలో ఒకరి ఎక్స్‌కవేటర్‌కు నిప్పు.. కేసు నమోదు


బోయినవారిపాలెంలో తగులబడుతున్న ఎక్స్‌కవేటర్

చీరాల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గంలో ఇసుక అక్రమార్కుల మధ్య ఆధిపత్య పోరు ఎక్స్‌కవేటర్‌ను తగులబెట్టుకునే వరకూ వెళ్లింది. ఒకరు ఎంపీ పేరుతో, మరొకరు ఎమ్మెల్యే పేరుతో దందా సాగిస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. చీరాల మండలం బోయినవారిపాలెంలో శుక్రవారం తెల్లవారుజామున ఇసుక అక్రమ తవ్వకాలు జరిగే ప్రదేశానికి సమీపంలో ఒకరి ఎక్స్‌కవేటర్‌ను మరోవర్గం వారు తగులబెట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు సంబంధించి వాస్తవ పరిస్థితులను కలెక్టర్ జె.వెంకటమురళికి సమగ్ర నివేదిక ఇచ్చేందుకు అధికారులు సమాయత్తమైనట్లు సమాచారం. ఈ ఘటనపై ఈపురుపాలేనికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

పరకామణి దొంగలకు లోక్ అదాలత్‌లో రాజీనా!

- వీహెచ్‌పీ ఆధ్వర్యంలో 5న శంఖారావం: భానుప్రకాశ్ రెడ్డి

తెనాలి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు హిందూ ఆలయాలను మింగేస్తే, సీఎంగా ఉన్న జగన్ రెడ్డి గుడిలో లింగాన్ని కూడా మిగల్చలేదని టీటీడీ పాలకమండలి సభ్యుడు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాశ్‌రెడ్డి విమర్శించారు. గుంటూరు జిల్లా తెనాలిలోని వైకుంఠపురం వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని శుక్రవారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'తిరుమల ఆలయంలో పరకామణి దొంగలను ఏ విచారణ లేకుండా కేవలం లోక్ అదాలత్‌లో రాజీ చేయటం దారుణం. రూ.100 కోట్లపైన దోచేశారు. వీటిపై పూర్తి విచారణ జరిగితేనే పాత్రధారులు, దోపిడీదారులు బయటకు వస్తారు. అందుకే దీనిపై స్పెషల్ ఎంక్వైరీ కోరాను. త్వరలో డీజీపీని కలసి నా దగ్గరున్న వివరాలను అందించి, విచారణ కోరతాను' అని భానుప్రకాశ్ రెడ్డి అన్నారు. జనవరి 5న విజయవాడలో హిందూ ధర్మ పరిరక్షణ కోసం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శంఖారావం పూరించనున్నామని, హిందూ ధర్మ పరిరక్షణకోసం తీర్మానం చేయనున్నట్టు చెప్పారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ట్రంప్ విస్తరణ వాదం

వచ్చే నెలలో అమెరికా అధ్యక్షపదవిని చేపట్టబోతున్న డోనాల్డ్ ట్రంప్, ఇటీవల ఓ విచిత్ర ప్రకటన చేశారు. పనామా కాలువ తిరిగి అమెరికా అధీనంలోకి వచ్చేయాలన్నది ఆయన వ్యాఖ్యల సారాంశం. అట్లాంటిక్, పసిఫిక్ సముద్రాలను కలిపే పనామా కాలువ అమెరికా వాణిజ్యానికి అతిముఖ్యం. నలభైశాతం వాణిజ్యం ఈ కాలువ గుండా సాగుతున్నందువల్ల, అమెరికా తన ఆర్థిక ప్రయోజనాలు కాపాడుకోవాలంటే అది పూర్తిగా తమ నియంత్రణలోనే ఉండాలంటున్నారు ఆయన. ఇంకా గద్దెనెక్కకముందే వరుస వివాదాస్పద వ్యాఖ్యలతో ట్రంప్ దుమారం రేపుతున్నారు. కెనడాని అమెరికా 51వ రాష్ట్రంగా అభివర్ణించారు, గ్రీన్‌లాండ్‌ను ఏకంగా కొనేస్తామన్నారు. పనామా కాలువ చైనా అధీనంలో ఉన్నదనీ, నౌకల మీద విధించే రాకపోకల రుసుములు చెల్లించలేక అమెరికా బక్కచిక్కిపోతోందనీ, అందువల్ల కాలువ తిరిగి తన చేతికి వచ్చేయాలనీ అంటున్నారు. ఆయన ఏ నిముషానికి ఏమంటాడో, ఏమి చేస్తాడోనని మిత్రదేశాలు, శత్రుదేశాలు ఏకరీతిన వణికిపోయే కాలం ఇప్పటికే మొదలైపోయింది.

ట్రంప్ వ్యాఖ్యల్లో ఔచిత్యం లేకపోవచ్చును గానీ, వ్యూహం ఉందట. అర్థంపర్థంలేని ఈ తరహా ప్రతిపాదనలు చేసినప్పుడు, ఎదుటివారు తమకు తెలియకుండానే కాస్తంత అర్థవంతంగా స్పందిస్తారు కనుక, వారు అలా వలలో పడగానే, అందులో నుంచి ట్రంప్ తన ప్రయోజనాన్ని ఏరుకోగలరట. కెనడాను గ్రేట్ స్టేట్ ఆఫ్ అమెరికాగా అభివర్ణిస్తూ, దాని ప్రధానిని తమ గవర్నర్‌గా వ్యాఖ్యానించడమనే దుస్సాహసం వెనుక ఆర్థిక, వాణిజ్య యుద్ధాలున్నాయి. ట్రంప్-ట్రూడో సుంకాల సంగ్రామం మధ్య గిలగిలలాడి కెనడా ఆర్థికమంత్రి చివరకు తట్టాబుట్టాసర్దుకున్న విషయం తెలిసిందే. జస్టిన్ ట్రూడో వంటి స్థితప్రజ్ఞతలేని నాయకుడికి ట్రంప్ సరిస్థాయిలో తూగుతారు.

గత పాలకుల నిర్ణయాన్ని తప్పుబట్టడంలో ట్రంప్‌ను మించినవారెవ్వరూ లేరు. ట్రంప్ కన్ను ఎప్పటినుంచో గ్రీన్‌లాండ్‌మీద ఉంది. డెన్మార్క్ నుంచి దీనిని కొనేస్తానని ఆయన తొలివిడత పాలనలోనే ఊగిపోయారు. ఇప్పుడు డెన్మార్క్‌కు కొత్త రాయబారిని ప్రకటిస్తున్న సందర్భంలో తిరిగి ఆ వాదన ముందుకు తెచ్చారు. అమెరికా భద్రతకీ, ఇంకా చెప్పాలంటే యావత్ ప్రపంచ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకీ గ్రీన్‌లాండ్ తన గుప్పిట్లో ఉండటం అవసరమని విశ్లేషిస్తున్నారు. గతంలో మాదిరిగానే ఇప్పుడు కూడా డెన్మార్క్ ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. గ్రీన్‌లాండ్ అమ్మకానికి సిద్ధంగా లేదని ఆ స్వయంపాలిత ప్రాంతం అధినేత ఘాటుగా స్పందించారు. అట్లాంటిక్, ఆర్కిటిక్ సముద్రాల మధ్యన ఉన్న ఈ మంచు ప్రాంతం అమెరికా సైనికస్థావరంగా, మరీ ముఖ్యంగా ప్రచ్ఛన్న యుద్ధకాలంలో పలురకాల రక్షణపరిశోధనలకు ఉపకరించిన విషయం తెలిసిందే. మంచు ఫలకం కిందన వందమీటర్ల లోతులో అర్థంతరంగా వదిలేసిన ఒక సైనికస్థావరం నిక్షిప్తమైన విషయాన్ని నాసా ఇటీవల వెలుగులోకి తెచ్చింది. అనేకానేక మారణాయుధాలను దాచేందుకు, సన్నద్ధంగా ఉంచేందుకు ఈ క్యాంప్ సెంచురీని ఉపయోగించాలనుకున్నారు. అరవైఏదేళ్ళనాటి ఈ రహస్య నగరంలో ఆయుధాల అవశేషాలు, అణువ్యర్థాలు నిక్షిప్తమై ఉన్నాయన్నది వార్త. రక్షణపరంగా ఎంతో కీలకమైన గ్రీన్‌లాండ్ గురించి ట్రంప్ అదేపనిగా మాట్లాడటం, గతంలో తన మాట కాదన్నందుకు అలిగి డెన్మార్క్ పర్యటనను రద్దుచేసుకోవడం వంటి పరిణామాలు గమనిస్తే ఈ మారు అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన చర్యలు మరింత గట్టిగా ఉండవచ్చునేమో.

నూటపాతికేళ్ళక్రితం పనామా కాలువను నిర్మించింది అమెరికాయే గానీ, 1977లో జిమ్మీకార్టర్ హయాంలో కుదిరిన ఒప్పందం ప్రకారం అది 1999 డిసెంబరు 31న పనామా దేశం అధీనంలోకి వెళ్ళిపోయింది. అలనాటి పరిణామాన్ని ఇప్పుడు ట్రంప్ చారిత్రక తప్పిదంగా అభివర్ణిస్తున్నారు. మిత్రదేశానికి తమ దేశం ఎంతో విలువైన ఈ కాలువను మూర్ఖంగా ఇచ్చేసిందనీ, దీనిని తీసుకున్నవారు బాధ్యతతో, నిబద్ధతతో వ్యవహరించనిపక్షంలో తన కొత్త యంత్రాంగం వెనక్కుతీసుకొనే పని మొదలుపెడుతుందని అంటున్నారు ఆయన. ఆ కాలువ వాడకానికి చెల్లించాల్సిన రుసుమును ఒక పద్ధతి ప్రకారం నిర్ణయిస్తామనీ, కాలువను తిరిగి ఇచ్చేయడం జరగనిపని అంటూ పనామా అధ్యక్షుడు ఘాటుగానే స్పందించారు. చైనా అధీనంలో ఈ కాలువ ఉన్నదన్న రీతిలో ట్రంప్ నర్మగర్భంగా చేసిన వ్యాఖ్యలు అర్థం లేనివి. ఎంతోకాలంగా ఈ కాలువ సింగపూర్ సంస్థ నిర్వహణలో ఉండటంతో, అమెరికా వాణిజ్యనౌకలకు మాత్రమే అధిక రుసుముల కష్టాలు వచ్చినట్టుగా ఆయన చిత్రీకరిస్తున్నారు. కెనడానుంచి, నార్వేనుంచి ఆర్థిక, వాణిజ్య ప్రయోజనాలు, రాయితీలూ పొందడానికి ట్రంప్ ఈ తరహా ఒత్తిడి వ్యాఖ్యలు చేస్తున్నారని అర్థమవుతూనే ఉంది. దేశభద్రత పేరిట చివరకు మంచుద్వీపాన్ని కూడా ఆయన రాజకీయం చేస్తున్నారు.

అల్లావుద్దీన్ ఖాన్ అనశ్వర సప్తస్వరాలు

అదొక అపురూపమైన రసానుభూతి. గొప్పదనం సమక్షంలో ఉన్నానని నాకు నేను ప్రప్రథమంగా తెలుసుకున్న సందర్భమది. యాభై హేమంతాల క్రితం (1974లో) న్యూఢిల్లీలోని మోడరన్ స్కూల్‌లో ఒక షామియానా కింద ఆసీనులమయి వున్నాము. నేను కళాశాల విద్యాభ్యాసంలోకి ప్రవేశించిన తొలి సంవత్సరమది. నా స్నేహితులు కొంతమంది మోడరన్ స్కూల్‌లో జరగనున్న సంగీత సభకు నన్ను తీసుకువెళ్లారు. అలీ అక్బర్ ఖాన్ సరోద్‌పై లయాన్విత సరిగమలను, రవి శంకర్ సితార్‌పై సుకుమార రాగాలను, అల్లా రఖాఖాన్ తబలాపై మనసు, తనువును పులకరింప చేసిన శబ్దరావాలను ఆ కచేరిలో వినిపించారు. దశాబ్దాలు గడిచిపోయినందున ఆ సంగీత మాంత్రికులలో ఎవరు ఏ రాగాలను వాయించిందీ గుర్తుచేసుకోలేక పోతున్నాను. అయితే పరిసరాలను విస్మరింపచేసిన ఆ వాద్య ధ్వనులు నన్ను సంపూర్ణంగా మంత్రముగ్ధుని చేశాయన్నది నాకు ఇంకా ఒక పచ్చని జ్ఞాపకంగా ఉన్నది. అలీ అక్బర్ ఖాన్, రవి శంకర్ ఇరువురికీ గురువు అయిన అల్లావుద్దీన్ ఖాన్ స్మృత్యర్థం ఆ సంగీత సభను నిర్వహించారు.



■ రామచంద్ర గుహ


గతానుగతం

యాభై సంవత్సరాల క్రితం న్యూఢిల్లీ మోడరన్ స్కూల్‌లో నా సంగీతాసక్తులను పూర్తిగా మార్చి వేసిన ఆ రాత్రి, కొద్ది రోజుల క్రితం అన్నపూర్ణాదేవి సుర్ బహార్‌పై అద్భుతంగా వాయించిన మంజ్ ఖమాజ్ రాగం రికార్డింగ్‌ను వింటున్నప్పుడు, మళ్లీ జ్ఞాపకమొచ్చింది. ఆ రాగాన్ని ఇంతకు ముందు ఎన్నోసార్లు విన్నాను. అయితే ఇప్పుడు అది ఎలాగో మన మహోజ్వల సంగీత వారసత్వం, ప్రత్యేకించి ఒక నిర్దిష్ట ఘరానా (మైహర్) గురించి ప్రగాఢంగా ఆలోచింపచేసింది.

అలీ అక్బర్ ఖాన్ తోబుట్టువు, రవి శంకర్ మొదటి భార్య అన్నపూర్ణాదేవి. తండ్రి అల్లావుద్దీన్ ఖాన్ వద్దే ఆమె సంగీత శిక్షణ పొందారు. ఆమె ఎంచుకున్న, ఆమెకు బాగా ఇష్టమైన వాద్య పరికరం సుర్ బహార్. అయితే ఈ ప్రతిభావంతురాలి సంగీత జీవితం సాఫీగా సాగిపోలేదు. వివాహ జీవితంలో వైపరీత్యాలు ఆమెను ఏకాంతవాసానికి గురిచేశాయి. అయితే ఆమె సంగీత వైదుష్యం పలువురు గొప్ప సంగీతకారులను సృష్టించింది. వేణుగాన విద్వాంసుడు హరిప్రసాద్ చౌరాసియా వారిలో ఒకరు. (అన్నపూర్ణ జీవితం, సంగీత వైదుష్యం, వారసత్వంపై నిర్మల్ చందర్ ఇటీవల ఎ–6 ఆకాశ్ గంగ అనే డాక్యుమెంటరీ ఫిల్మ్‌ను రూపొందించారు).

అన్నపూర్ణ సంగీతాన్ని వింటూ 1974లో ఆ రాత్రి అలీ అక్బర్ ఖాన్, రవి శంకర్‌ల సరోద్, సితార్ వాద్యాల గురించిన ఆలోచనలు అల్లావుద్దీన్ ఖాన్‌పై వేద్ మెహతా రాసిన వ్యాసాన్ని మళ్లీ చదివేందుకు నన్ను పురిగొల్పాయి. అల్లావుద్దీన్ ఖాన్‌ను పలుమార్లు స్వయంగా చేసిన ఇంటర్వ్యూల ఆధారంగా వేద్ ఆ వ్యాసాన్ని రాశారు. ఆసక్తికరంగా ఉన్న వేద్ కథనంలో కల్పన ఎక్కడ ముగిసిందో, వాస్తవం ఎక్కడ ప్రారంభమయిందో చెప్పడం కష్టం. ఇప్పుడు బంగ్లాదేశ్‌లో ఉన్న ఒక మూర్ఖాల గ్రామం నుంచి అల్లావుద్దీన్ జీవన ప్రస్థానం ప్రారంభమయిందని వేద్ వివరించారు. తనకు సంగీతాన్ని నేర్పగల గురువులను అన్వేషిస్తూ కలకత్తాకు వచ్చిన అల్లావుద్దీన్ ఎంతటి కష్టనష్టాలు ఎదురైనా ఓర్పుగా భరిస్తూ, ఎదుర్కొంటూ కఠిన, గంభీర గురువుల వద్దకు చేరగలిగారు. ఆయన తన స్వతస్సిద్ధ సంగీత ప్రతిభను గురువుల శుశ్రూషతో పరిపూర్ణం చేసుకున్నారు. ఈ సంగీత జిజ్ఞాసువు, ఆనాటి సుప్రసిద్ధ సంగీతకారుడు వజీర్ ఖాన్ బీన్‌కార్ వద్ద శిక్షణ పొందడానికి రాంపూర్ వెళ్లారు. బీన్‌కార్ దయతలచలేదు. ఆయనను ఎలాగైనా ప్రసన్నం చేసుకునేందుకు అల్లావుద్దీన్ శతథా ప్రయత్నించారు. ఫలితం లేకపోయింది. విసిగిపోయిన అల్లావుద్దీన్ ఒక రోజు రాంపూర్ నవాబుకు తన గోడు చెప్పుకున్నాడు. నవాబు సూచన మేరకు గర్విష్ఠి అయి వజీర్ ఖాన్ తన శిష్యుడిగా అల్లావుద్దీన్‌ను స్వీకరించాడు.





బాబాగా ప్రేమాస్పదుడు అయిన ఉస్తాద్ అల్లావుద్దీన్ ఖాన్ (1862–1972) ఇరవయ్యో శతాబ్ది ప్రముఖ సంగీత ఉపాధ్యాయులలో ఒకరు. ఆయన సంగీత విద్యా కుటుంబం విస్తృతమైనది. అందులో పండిట్ రవి శంకర్, పన్నాలాల్ ఘోష్, నిఖిల్ బెనర్జీ మొదలయిన వారితో పాటు తనయుడు అలీఅక్బర్ ఖాన్, తనయ అన్నపూర్ణాదేవి కూడా ఉన్నారు. వీరితో పాటు ఇంకా ఎందరో బాబా శిష్యులు హిందుస్థానీ శాస్త్రీయ సంగీతంలో ధ్రువతారలుగా వెలుగొందుతున్నారు.

అల్లావుద్దీన్ ఆ తరువాత మధ్య భారతంలోని మైహర్ అనే చిన్న సంస్థానానికి వెళ్లి, లోకోత్తర సంగీతాన్ని సృష్టిస్తూ ప్రతిభావంతులైన శిష్యులను అద్వితీయ సంగీత కారులుగా తీర్చిదిద్దుతూ జీవితాంతం అక్కడే ఉండిపోయారు. ఆయన శిష్యులలో, ఇప్పటికే ప్రస్తావితమైనవారే కాకుండా సితార్ విద్వాంసుడు నిఖిల్ బెనర్జీ, వేణుగాన విద్వాంసుడు పన్నాలాల్ ఘోష్ తదితరులు ఉన్నారు. అన్నట్టు ఏమంత ప్రతిభావంతుడు కానప్పటికీ మైహర్ మహారాజా కూడా అల్లావుద్దీన్ శిష్యగణంలో ఒకరు. సంగీత బోధన చేయని సమయాలలో అల్లావుద్దీన్ నమాజ్ చేసేవారు. మతాచారం ప్రకారం రోజుకు ఐదుసార్లు నమాజ్ చేసేవారు. అంతేకాకుండా మైహర్ పట్టణంలోని హిందూ దేవాలయంలో నిత్యం పూజలు, ప్రార్థనలు చేస్తుండేవారు. క్రమంగా మైహర్‌లోను, సంగీతలోకంలోను ఆయన 'బాబా' (బెంగాలీలో తండ్రి, హిందుస్థానీలో గౌరవనీయ వృద్ధ విజ్ఞాని అని అర్థం)గా సుప్రసిద్ధమయ్యారు.

వేద్ మెహతా వ్యాసం (ఇది 1970లో ప్రచురితమైన ఆయన 'పోర్ట్రైట్ ఆఫ్ ఇండియా' పుస్తకంలో ఉంది) తరువాత అల్లావుద్దీన్ ఖాన్ జీవితం, సంగీతంపై ఇటీవల వెలువడిన అంజనా రాయ్, సహనగుప్తా పుస్తకాలు చదివాను. బాబా సంగీతం గురించి సమగ్రంగా తెలుసుకునేందుకు మెహతా వ్యాసం కంటే ఈ పుస్తకాలు ఎక్కువగా ఉపకరించాయి. అల్లావుద్దీన్ వైయక్తిక, వృత్తిగత ప్రస్థానాలు, పలు విభిన్న సంగీత వాద్యాలను వాయించడంలో ఆయనకు ఉన్న అసమాన అధికారం, భారతీయ సంగీతానికి ఆర్కెస్ట్రా, పలు కొత్త జోడ్ రాగాలను సృష్టించడంలో ఆయన అసమాన కృషిని లోతుగా సమగ్రంగా ఈ పుస్తకాలు వివరించాయి. ఇరువురి కథనాలు పలుచోట్ల ఆరాధనాపూర్వకంగా ఉన్నప్పటికీ బోధనకు సంబంధించి బాబా సిద్ధాంతాన్ని ఏ ఒక్కరూ ప్రస్తావించలేదు. వేద్ మెహతా ప్రకారం 'బోధనలో బాదడం అంతర్భాగమే కాకుండా అనివార్యం' అనేది బాబా సిద్ధాంతం! ఇది యథార్థమేనని నా బెంగాలీ స్నేహితులు ధ్రువీకరించారు, మైహర్ మహారాజా సైతం గురువు గారి అసహనం ఫలితంగా దేహశుద్ధికి గురయ్యారనే ఐతిహ్యం ఒకటి ఉన్నది మరి.

అల్లావుద్దీన్ ఖాన్ వ్యక్తిత్వంలోని ఈ లక్షణం ఈ తరం వారికి సహజంగానే నచ్చకపోవచ్చు. సహన గుప్తా పుస్తకానికి అన్నపూర్ణాదేవి రాసిన ముందు మాటలోని ముగింపు మాటలు నాకు ఎంతో సాంత్వననిచ్చాయి (అన్నపూర్ణాదేవి తన తండ్రి గురించి ఆంగ్లంలో రాసింది ఈ ముందు మాట ఒక్కటే కావచ్చు). ఆమె ఇలా రాశారు: 'బాబా తన జీవితంలో నాలుగు దశాబ్దాలకు పైగా మైహర్‌లో గడిపారు. భగవదత్తమైన తన సంగీతాన్ని ఇతరులకు వినిపించారు, శిష్యులకు బోధించారు. ఇరవయో శతాబ్ది మహోన్నత సంగీత వాద్యకారులలో పలువురు ఆయన శిష్యులే. అలీఅక్బర్ ఖాన్, రవి శంకర్, పన్నాలాల్ ఘోష్, నిఖిల్ బెనర్జీ తదితరులను ఆమె ప్రముఖంగా ప్రస్తావించారు ఆమె తన పేరును ఆ జాబితాలో చేర్చలేదు. లలితకళాభిజ్ఞురాలుగా సుర్ బహార్ వాయిద్యంలో అద్వితీయ ప్రతిభాశాలిగా భారతీయ సంగీత జగత్తులో అన్నపూర్ణ సుప్రసిద్ధురాలు. ఆమె ముందు మాటలోని చివరి వాక్యం నా మనసులో నిలిచిపోయింది: 'అన్నిటికీ మించి బాబా, నాకు తెలిసిన వారందరిలోను బహుశా పరిపూర్ణ లౌకికవాది'. అంజనారాయ్ కూడా ఇదే విధంగా రాశారు: అల్లావుద్దీన్ ఖాన్ సంకుచిత స్వభావుడు కాదు. మతాభినివేశ జాతీయవాది కాదు. ఆయన దేశభక్తి ప్రపూర్ణుడు. ఒక విశాల ప్రపంచ దృక్పథంలో మిళితమైన దేశభక్తి ఆయనది... హిందువులు ముస్లింల మధ్య సంపూర్ణ సమైక్యతను ఆయన ఆకాంక్షించారు. సకల మతాలు, విశ్వాసాల సమ్మేళనాన్ని ఆయన ఆశించారు'.

నేను సంగీత విద్వాంసుడిని కాను, సంగీత గుణగ్రహణ పారీణుడిని కాను, కేవలం ఔత్సాహిక శ్రోతను మాత్రమే. ఆ స్ఫూర్తితోనే ఈ కాలమ్ రాశాను. అదే స్ఫూర్తితో అల్లావుద్దీన్ సంగీత విద్యా కుటుంబంలోని వారి సంగీత కృతులలో వ్యక్తిగతంగా నాకు ఇష్టమైన వాటిని ప్రస్తావించదలుచుకున్నాను. అవి: ఇంతకు ముందే ప్రస్తావించిన అన్నపూర్ణదేవి మంజ్ ఖమాజ్‌తో పాటు రవి శంకర్ పహాడి ఝింఝోటి; అలీ అక్బర్ ఖాన్ ఛాయానట్; నిఖిల్ బెనర్జీ రాగేశ్వరి, పన్నాలాల్ ఘోష్ హంసధ్వని, బహదూర్ ఖాన్ నట్ బిల్వాల్. సంగీత విశ్వంలో అల్లావుద్దీన్ ఖాన్ ఒక ధ్రువతార. ఆయన సంగీతం అజరామరమైనది అనేది ఎన్నటికీ ఎవరూ కొట్టివేయలేని సత్యం.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

చరిత్ర మరచిపోని మంచిమనిషి

పాతిక సంవత్సరాల నాటి మాట. 1999లో డాక్టర్ మన్మోహన్ సింగ్ దక్షిణ ఢిల్లీ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు పోటీ చేశారు (లోక్‌సభకు ఆయన పోటీ చేయడం అదే మొదటిసారి, అదే చివరిసారి). ఆ ఎన్నికలలో ఆయన ఓడిపోయారు. అప్పుడు నేను ఎన్‌డీ టీవీలో పనిచేస్తున్నాను. 'ఫాలో ది లీడర్' 'అనే ఒక ఎన్నికల కార్యక్రమాన్ని మేము నిర్వహిస్తున్నాం. ఎన్నికలలో పోటీ చేస్తున్న ఒక నాయకుడి ప్రచారంలో ఒకరోజు పాటు ఆయన వెన్నంటి ఉండి వార్తా నివేదన చేయడం ఆ కార్యక్రమం ప్రత్యేకత. డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రచార సరళిని కవర్ చేసే బాధ్యతను నాకు అప్పగించారు. నియోజకవర్గం పర్యటనలో మన్మోహన్ వెంట ఉండి మా కార్యక్రమానికి అవసరమైన సమాచారాన్ని సమకూర్చాలి. చెప్పినంత తేలిక కాదు ఈ పని. ఎందుకంటే ఆయన బిడియస్తుడు. పది మందిలో ఉండలేరు. టీవీ కెమెరాల ముందుకు రావడానికి సంకోచిస్తారు. మేము ఆ రోజు మొదటి సగాన్ని ఆయన గృహంలోనే గడిపాము ఆయనతో కలిసి ఉదయం ఉపాహారం తీసుకున్నాం. ఆ తరువాత ఆయన విస్తృత గ్రంథాలయంలో మాటా మంతీ జరిపాము. ఆ తరువాత మన్మోహన్ తన నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్లినప్పుడు ఆయన వెంట వెళ్లాం. అక్కడ గుంపుల మధ్య ఉండవలసిరావడంతో ఆయన చాలా ఇబ్బందిపడ్డారు. తోపులాటలు, నెట్టుకోవడాలు ఆయనకు సుతరామూ నచ్చవు. అయినా ఆయన ఓపిక వహించారు.

మంచి రోజులలోను, కష్టాలు చుట్టుముట్టిన రోజులలోను హుందాతనం కోల్పోకుండా మెలగడం ఎలా అన్నది మన్మోహన్ జీవితం నుంచి మనం నేర్చుకోవలిసిన పాఠం. ప్రజా జీవిత ఒత్తిళ్లు తన స్థితప్రజ్ఞతను ప్రభావితం చేసేందుకు ఆయన ఎన్నడూ అనుమతించలేదు. విప్లవాత్మక కొత్త పుంతలు తొక్కిన భారత ఆర్థిక మంత్రి ఆయన. ప్రధానమంత్రిగా కీలక ఇండో–అమెరికా అణు ఒప్పందానికి ఆయనే ప్రధాన కారకుడు అయ్యారు. అయితే ఇందుకు అయన గానీ, ఆయన కుటుంబ సభ్యులుగానీ ఎటువంటి ప్రచారాన్నీ కోరుకోలేదు ఒక టీవీ షోలో భాగంగా 'సింగ్ ఈజ్ కింగ్' అనే పాటను ప్రసారం చేశాం. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి మాకు ఫోన్ వచ్చింది. అంత ఉల్లాస స్థితిని మరోసారి చూపించకుండా నివారించడం మంచిదని సూచించారు. మరో సందర్భంలో మన్మోహన్‌ను 'ఇండియన్ ఆఫ్ ది ఇయర్'గా ఎంపిక చేశాం. ఒక ఫైవ్ స్టార్ హోటల్‌లో నిర్వహించదలిచిన ఆ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి రావడానికి నిరాకరిస్తూ దానిని తన ఇంటి వద్దనే స్వీకరించేందుకు ఆయన సంకోచిస్తూ అంగీకరించారు. 'నాకంటే ఎన్నో గొప్ప విజయాలు సాధించినవారు మరెందరో ఉన్నారని' ఆయన వినమ్రంగా ప్రతిస్పందించారు.

స్వీయ ఉన్నతికి స్వీయ ప్రచారం చేసుకోవడమే నిపుణ రాజకీయ వ్యూహంగా పరిగణన పొందుతున్న ఈ కాలంలో ఎటువంటి పటాటోపాలు లేని మన్మోహన్ సింగ్ పాతకాలం నాయకుల సత్సంప్రదాయాలకు ప్రతినిధిగా కనిపిస్తారనడం సత్యదూరం కాదు. జాతి శ్రేయస్సుకు మౌనంగా పనిచేసిన ఉదాత్త నాయకుడు ఆయన. మన్మోహన్ తన వృత్తి జీవితంలో మొదటి నుంచీ నమ్మలేని రీతిలో నిర్దిష్ట పని గంటలకు మించి ఎక్కువగా పనిచేయడం అలవరచుకున్న వ్యక్తి. జీవితంలో చాలా కష్టపడి ఉన్నతస్థాయికి వచ్చినందున పనిపట్ల అతి నిష్ఠ, స్వీయ క్రమశిక్షణను తన విధి నిర్వహణలో అంతర్భాగం చేసుకున్నారు. ఆయనతో నా చివరి వ్యక్తిగత సమావేశాలలో ఒకసారి దేశ విభజన బీభత్సాల నుంచి తమ కుటుంబం ఎలా తప్పించుకున్నదీ వివరించారు. పేదరికంలో తాను పెరిగిన తీరు, ఉపకార వేతనాల ఆధారంగా విద్యాభ్యాసం చేయడం, విద్య ఆసరాతో ఉన్నత స్థాయికి ఎదగడం గురించి చెప్పారు. అప్పుడు ఆయన కొంచెం భావోద్వేగానికి లోనవడాన్ని గమనించాను. ఆయనలో అటువంటి భావోద్వేగ ధోరణి చాలా అరుదు. ఈ విషయాన్ని ఆయన భార్య కూడా గమనించినట్టున్నారు. వెంటనే మేమున్న గదిలోకి వచ్చి 'బస్ కరో, టీ తీసుకుందాం రండి' అని దృఢ స్వరంతో అన్నారు. ఇంట శ్రీమతి మన్మోహనే బిగ్‌బాస్ అనేది స్పష్టం.



> యూపీఏ రెండో ప్రభుత్వం వేసిన ప్రతి తప్పటడుగుకు నిందలు భరించడానికి బదులు ప్రధానమంత్రి పదవి నుంచి మన్మోహన్ నిష్క్రమించి ఉండవలసింది. ఆయన మంత్రిమండలి సభ్యులపై పోటెత్తిన అవినీతి ఆరోపణలు ప్రభుత్వ ప్రతిష్ఠను పూర్తిగా దిగజార్చాయి. అయినప్పటికీ చరిత్ర ఆయనపై తన తీర్పును చాలా అభిమానపూర్వకంగా ఇచ్చి తీరుతుంది, సందేహం లేదు.

తన తొలి సంవత్సరాల గురించి ఆయన భావోద్వేగంతో వివరిస్తున్నప్పుడు సువ్యక్తమవుతున్న ఆకాంక్షా భరిత, ప్రతిభాపాటవాలే చోదక శక్తిగా ప్రభవిస్తున్న 'నవ' భారత కథకు ఆయనే పూర్వగామి అన్న వాస్తవం నాకు స్ఫురించింది, ఆశ్చర్యపరిచింది. ఈ నూతన భారతదేశం ఆవిర్భవించేందుకు అద్వితీయంగా దోహదం చేసింది ఆయనే అన్న వాస్తవాన్ని చరిత్ర విస్మరించదు మన్మోహన్ యవ్వన కాలంలోని భారత దేశంలో కులీన విద్యాధిక వర్గాలకు వెలుపలి వారికి అవకాశాలు తక్కువగా ఉండేవి. చదువులో ప్రశస్తంగా ఉండడమే ఆనాటి వారికి సమాజంలో, ఎదుగుదలకు ఒక ప్రధాన మార్గంగా ఉండేది. డాక్టర్ మన్మోహన్ సింగ్ 'యాదృచ్ఛిక' ప్రధానమంత్రి కావచ్చు కాని ఆయన ఒక మెరిటోక్రాట్ (ప్రతిభా సంపన్నతతో ఎదిగిన వ్యక్తి). ఇది, మనం పొరపాటుపడడానికి వీలులేని ఒక నిశ్చిత సత్యం. తనకు లభించిన ప్రతి పరిమిత అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదిగారు. యువ మన్మోహన్ నాటి భారతదేశానికి 1991 అనంతర భారతదేశానికి మధ్య ఎంత వ్యత్యాసమున్నదో మనం విస్మరించకూడదు. ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా తన సాహసోపేత విధానాలతో తీర్చిదిద్దిన నేటి భారతదేశంలో ఎదుగుదలకు అనూహ్యమైన అవకాశాలు లభిస్తున్నాయి.

మన్మోహన్ మృదుభాషి. సొంత గొప్పలు చెప్పుకునే వ్యక్తి కాదు. ఎటువంటి పరిస్థితులలోను నిండు ఆత్మ విశ్వాసంతో వ్యవహరించే వ్యక్తి. ఈ కారణంగానే ఎటువంటి అహమికలు, దురహంకారం, వ్యక్తి ఆరాధనా ఉన్మాదానికి లోనుకాకుండా అత్యున్నతస్థాయి అధికార పదవుల ఒత్తిళ్లను నిబ్బరంగా తట్టుకుంటూ సమర్థంగా తన బాధ్యతలను నిర్వర్తించగలిగారు. తన రాజకీయ పరిమితులు ఏమిటో ఆయనకు బాగా తెలుసు. ఆ పరిధులలోనే ఆయన పనిచేశారు. సదా జాతి నిర్మాణ లక్ష్యాలకు ప్రాధాన్యమిచ్చి వాటికి కట్టుబడ్డారు. అణు ఒప్పందం లాంటి అనివార్యమైన కఠిన నిర్ణయాలను తీసుకోవలసివచ్చినప్పుడు ఆదేశించడం కాకుండా చర్చలు, ఏకాభిప్రాయ సాధనతో తీసుకున్నారు.

2009లో తన గుండె ఆరోగ్యం సజావుగా లేదని వెల్లడయినప్పుడే ఆయన రాజకీయ జీవితం నుంచి నిష్క్రమించి ఉండవలసిందేమో? ఆనాటి నుంచే ఆయన ఆరోగ్యం క్షీణించడం ప్రారంభమయింది. సంకీర్ణ రాజకీయాల ఒత్తిళ్లు పెరగసాగాయి. యూపీఏ రెండో ప్రభుత్వం వేసిన ప్రతి తప్పటడుగుకు నిందలు భరించడానికి బదులు ప్రధానమంత్రి పదవి నుంచి నిష్క్రమించి ఉండవలసింది. ప్రభుత్వంపై ఎన్ని ఆరోపణలు వచ్చినప్పటికీ మన్మోహన్ వ్యక్తిగత నిజాయితీని, చిత్తశుద్ధిని ఎవరూ అనుమానించలేదు. అయితే ఆయన మంత్రిమండలి సభ్యులపై పోటెత్తిన అవినీతి ఆరోపణలు యూపీఏ రెండో ప్రభుత్వ ప్రతిష్ఠను పూర్తిగా దిగజార్చాయి. అయినప్పటికీ చరిత్ర ఆయనపై తన తీర్పును చాలా అభిమానపూర్వకంగా ఇచ్చి తీరుతుంది, సందేహం లేదు. 1991లో ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణలతో ఒక తరం రూపుదిద్దుకున్నది, లక్షలాది కుటుంబాలు పేదరికం నుంచి బయటపడ్డాయి. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించింది. జాతి పురోగతికి ఇంతగా దోహదం చేసినప్పటికీ మన్మోహన్ తన స్వతస్సిద్ధ స్వభావానికి అనుగుణంగా ఈ పురోగతి వైయక్తిక ప్రయత్నం వల్ల కాకుండా ఒక సమష్టి కృషి ద్వారా మాత్రమే సాధ్యమయిందని వినమ్రంగా చెప్పుతారు.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

ఒక పాత్రికేయుడుగా మరొక ప్రత్యేక కారణానికి మన్మోహన్‌ను ప్రేమగా గుర్తు చేసుకుంటాను. ఆయన ప్రభుత్వాన్ని మేము తరచు తీవ్రంగా విమర్శిస్తుండేవాళ్లం. అయినా మన్మోహన్ గానీ, ప్రధాన మంత్రి కార్యాలయంలోని ఆయన అధికారులుగానీ ఒక్కరు కూడా ఎన్నడూ నాకు ఫోన్ చేసి మందలించడమనేది జరగనేలేదు. 2జి స్పెక్ట్రమ్ వేలం నిర్వహణలో ప్రభుత్వం వ్యవహరించిన తీరును నేను తీవ్రంగా విమర్శించాను. ఆ తరువాత మన్మోహన్‌ను నేను ఒక అధికారిక కార్యక్రమంలో కలుసుకున్నాను. నన్ను చూడగానే నవ్వుతూ 'నీ కాలమ్‌ను చదివాను. కొన్ని ముఖ్యమైన అంశాలను మీరు లేవనెత్తారు.' అని ఆయన అన్నారు. ఇతర నాయకులలో ఎంత మంది అటువంటి సౌహార్దభావంతో విమర్శలకు ప్రతిస్పందిస్తారు?


ఒక తుది జ్ఞాపకం. 2004 సార్వత్రిక ఎన్నికలలో దిగ్భ్రాంతికరమైన ప్రజా తీర్పు అందరినీ ఆశ్చర్యపరిచింది. తదుపరి ప్రధానమంత్రి ఎవరు అవుతారనే విషయమై ఉత్తేజిత, వ్యాకులిత ఊహాగానాలు జరిగాయి. ఆ సందర్భంలో నేను సర్ డేవిడ్ బట్లర్‌తో ఒక తేనీటి విందులో పాల్గొన్నాను. సర్ డేవిడ్ సెఫాలజీ (ఓటింగ్ విధానంపై జరిపే విశ్లేషణ)కి మౌలిక గురుగా పేరు పొందారు. మన్మోహన్ సింగ్ ఆయనకు సుపరిచితుడు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఇరువురూ సమకాలికులు. 'రాజ్‌దీప్, నీకు తెలుసా? ప్రధానమంత్రి ఎవరు అవుతారన్న ప్రశ్నకు నా వద్ద సమాధానమున్నది. సంకీర్ణ ప్రభుత్వానికి సారథ్యం వహించేందుకు అన్ని విధాల యోగ్యుడైన వ్యక్తి ఒకరు నాకు తెలుసు' మన్మోహన్ సింగ్ పేరును సర్ డేవిడ్ ప్రస్తావించగా ఎందుకు ఆయన్ని ప్రతిపాదిస్తున్నారని ప్రశ్నించాను. 'భారత్‌కు అత్యున్నత స్థాయిలో ఒక మంచి మనిషి నాయకత్వం వహించాల్సిన అవసరం ఉన్నది. స్వప్రయోజనాలు, సొంత పార్టీ ప్రయోజనాల కంటే జాతి శ్రేయస్సుకు ప్రాధాన్యమిచ్చే మన్మోహన్ సింగ్ అటువంటి ఉత్తమ నాయకుడు' అని సెఫాలజీ గురు సమాధానమిచ్చాడు. అవును, మంచి నడవడి అనేది ఘోరంగా నిరాదరణకు గురవుతున్న నాయకత్వ విలువ అయిపోయింది. సత్ప్రవర్తనను తక్కువ అంచనా వేస్తే ఎలా? డాక్టర్ మన్మోహన్ సింగ్ నిజాయితీ ఉన్న నాయకుడు. ప్రజా జీవితంలో మూర్తీభవించిన సభ్యత, మంచితనంకు ఆయన ఒక ఉత్కృష్ట ప్రతీక. ప్రజా జీవితంలో ఉండవలసిన, ఉండదగిన నాయకుడుగా మన్మోహన్‌ను ముందుగా చెప్పి తీరాలి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

కన్నభిరాన్ సార్‌ను మరచిపోగలమా!

సమాజంలో సంక్లిష్ట పరిస్థితి, సంక్షోభం నెలకొన్నప్పుడు, ప్రభుత్వం బాధ్యతారహితంగా నడుచుకుంటున్నప్పుడు, అయ్యో ఇట్లా అవుతోందే అని మనం అనుకున్న ప్రతి సందర్భంలోనూ ప్రముఖ పౌర హక్కుల నేత, న్యాయవాది కె.జి. కన్నభిరాన్ ఉంటే బాగుండు అని తలచుకుంటూనే ఉన్నాం. సామాజిక హితవు కోరి, అధికారంలో ఉన్న ప్రభుత్వాలు, పార్టీలు తమ మాట విన్నా, వినకపోయినా, దేశంలో సంక్లిష్ట పరిస్థితి తలెత్తినప్పుడు తమ బాధ్యతగా పరిస్థితి చక్కబెట్టడానికి జోక్యం చేసుకున్న ప్రజాస్వామిక వాదులైన లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్, జస్టిస్ వి.ఎం. తార్కుండేల తర్వాత కన్నభిరాన్‌ను పేర్కొనడంలో అతిశయోక్తి లేదేమో.

ప్రజల హక్కుల కోసం గళమెత్తుతూ ప్రభుత్వం అమలుపరుస్తున్న విచ్చలవిడి హింసా విధానాలను, చట్ట వ్యతిరేక పాలనను వ్యతిరేకించడమే కాకుండా, ప్రభుత్వానికి సూచనల రూపంలో ఆయన హితవు పలికిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. 1987లో తూర్పుగోదావరి జిల్లా గుర్తేడు అటవీ ప్రాంతంలో పీపుల్స్‌వార్ నక్సలైట్లు జైళ్లలో ఉన్న తమ పార్టీ సభ్యుల విడుదలకై సాంఘిక సంక్షేమ ప్రధాన కార్యదర్శి ఎస్.ఆర్. శంకరన్‌తో పాటు 25 మంది అధికారులను కిడ్నాప్ చేశారు. అప్పుడు పౌర హక్కుల సంఘం అధ్యక్షుడిగా ఉన్న కన్నభిరాన్‌ను జోక్యం చేసుకోమని ప్రభుత్వం కోరింది. అప్పట్లో ప్రయివేటుగా జరుగుతున్న సంఘటనల్లో హక్కుల సంఘం జోక్యం చేసుకోరాదనే అవగాహన ఉండేది. అయినా పేద ప్రజల అవసరాలు చూసే అధికారి, ఆయన బృందాన్ని కాపాడడం ధర్మంగా సార్ జోక్యం చేసుకున్నారు. కార్యవర్గంలో చర్చ లేకుండా ఎలా జోక్యం చేసుకుంటారని కొందరు సభ్యులు ప్రశ్నించారు. అయినా సార్ ఆ విమర్శకు జవాబు చెప్పి, కొన్ని సందర్భాలలో హక్కుల సంఘం మానవాళి సంక్షేమం కోసం తన పరిధులను దాటి పని చేయవలసి ఉంటుంది అన్నారు. 1993లో కొయ్యూరు కిడ్నాప్ సంఘటనలో ఆదివాసీ ప్రజాప్రతినిధి బాలరాజుతో పాటు, అధికారులు కిడ్నాప్‌కు గురైనప్పుడు, తర్వాత వరంగల్, కరీంనగర్‌లలో జరిగిన కొన్ని కిడ్నాప్ సంఘటనల్లో పౌరహక్కుల సంఘం బాధ్యులు జోక్యం చేసుకుని ఉద్రిక్తతలు తగ్గడానికి కృషి చేశారు. ఇటువంటి పనులు కూడా పౌర హక్కుల సంఘాలు చేపట్టాలనే ఒక సూత్రాన్ని కన్నభిరాన్ సార్ ఏర్పరిచారు. తర్వాత కాలంలో విప్లవ గ్రూప్‌ల సభ్యులు ఒకరినొకరు హతమార్చుకునే విషయంలో జోక్యం చేసుకోవడం సులభతరం అయింది.



1992లో నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పీపుల్స్‌వార్ పార్టీని, నాటి ప్రజాసంఘాలను నిషేధించింది. 1994లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ఆ నిషేధాన్ని ఎత్తివేయాలనే ప్రతిపాదనతో స్వామి అగ్నివేశ్, కాళోజీ నారాయణరావు, పొత్తూరి వెంకటేశ్వరరావు, కన్నభిరాన్‌ల బృందం ఎన్టీఆర్ దగ్గరకు వెళ్లింది. నిషేధం ఎత్తివేసే విషయం చర్చిస్తూ 'ముఖ్యమంత్రిగారూ మీరు మాంసం అమ్మే వ్యాపారిలా ప్రజాపాలన సాగిస్తున్నారు. దీన్ని చట్టబద్ధ పాలన అంటారా' అని ప్రశ్నించారట. అంతేకాకుండా 'ప్రజల కోసం రాజకీయాల్లోకి వచ్చానని చెప్తున్నారు, ప్రజలలో ఉండి ప్రజల సమస్యలపై పనిచేస్తున్న నక్సలైట్ పార్టీ నిషేధానికి గురై ఉంది, పాలన అంటే ఇదేనా' అని నిలదీశారట. పక్కనే రూంలో ఉన్న నిఘా డీజీ దొరను కూడా సంప్రదించకుండా 'కోపం వద్దు కన్నభిరాన్ గారు, మా ప్రభుత్వం పీపుల్స్‌వార్‌పై నిషేధం ఎత్తివేస్తుంది' అని ఎన్టీఆర్ ప్రకటించారట. కన్నభిరాన్ ఎప్పుడూ ఒక న్యాయ ఆగ్రహాన్ని ప్రదర్శించేవారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక ప్రపంచ బ్యాంకు ఆయనకు అప్పులు ఇస్తూ చాలా సంస్కరణలతో కూడిన పరిపాలనా పద్ధతులు అమలుపరచాలని సూచించింది. అక్టోబర్ 2003లో అలిపిరి వద్ద పీపుల్స్‌వార్ పార్టీ చంద్రబాబు నాయుడుపై హత్యాయత్నం చేసింది. ఈ నేపథ్యంలో బాలగోపాల్, కన్నభిరాన్... ప్రపంచ బ్యాంకు చైర్మన్‌కు ఒక లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సలహాతో పరిపాలనా సంస్కరణలు ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని ఒక ప్రయోగశాలగా మార్చిందని, దాని ఫలితంగా ప్రజల వైవిధ్యమైన జీవితాలు, వాళ్ల జీవనోపాధులు ఎలా విధ్వంసానికి గురౌతున్నాయో ఆ లేఖలో రాశారు. అలాగే సామాజిక ఆందోళనలను, నక్సలైట్ ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలన్న బ్యాంకు సలహా గురించి, ఫలితంగా 1629 మంది నక్సలైట్లను బూటకపు ఎన్‌కౌంటర్లలో హత్య చేయడం, దీనికి ప్రతిగా చంద్రబాబుపై అలిపిరిలో నక్సలైట్ల దాడి తదితర అంశాలు ఆ లేఖలో వివరంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ప్రపంచ బ్యాంకు అప్పు అందించకపోతేనే ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ఉంటారని రాశారు.

హింస–ప్రతిహింసల వలయంలో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, నక్సలైట్ పార్టీలు శాంతి ఏర్పరచడానికి చర్చలు పరిష్కారం అని పౌరస్పందన వేదిక చేసిన ప్రయత్నం మనకు తెలిసిందే. ఈ ప్రయత్నంలో సంస్థ కన్వీనర్‌గా వ్యవహరించిన ఎస్.ఆర్ శంకరన్, ఇతర 12 మంది సభ్యులతో పాటు కన్నభిరాన్ నిర్వహించిన పాత్ర ముఖ్యమైనది.


బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేయడం, సుప్రీం తీర్పులు రాజ్యాంగం పొందుపరచిన న్యాయం, చట్టాల వెలుగులో వెలువడక, విశ్వాసాల ప్రాతిపదికన వెలువడడం మనల్ని కలవరపెడుతోంది. ఈ అన్ని సందర్భాలలోనూ కన్నభిరాన్‌ను మళ్లీ మళ్లీ గుర్తుకు తెచ్చుకుంటూనే ఉంటాం. ఆయనకు మానవహక్కుల సెల్యూట్.

• ఎస్. జీవన్‌కుమార్
మానవ హక్కుల వేదిక

(30 డిసెంబర్ : కన్నభిరాన్ వర్ధంతి)

పూర్వవైభవం దిశగా కాంగ్రెస్


రెండు వందల ఏళ్ళ ఆంగ్లేయుల పాలన నుంచి భారతీయులకు విముక్తి కలిగించిన, ఆధునిక భావాలు కలిగిన పురాతనమైన కాంగ్రెస్ పార్టీ 140వ ఆవిర్భావ దినోత్సవం నేడు. ముంబాయిలో 1885 డిసెంబర్ 28న గోకుల్ దాస్ తేజ్‌పాల్ సంస్కృత కళాశాలలో ఉమేష్ చందర్ బెనర్జీ అధ్యక్షుడిగా విశ్రాంత బ్రిటిష్ ఇండియన్ సివిల్ సర్వీసెస్ అధికారి అలన్ అక్టేవియస్ హ్యూమ్ (ఏఓ హ్యూమ్) ప్రధాన కార్యదర్శిగా, దేశం నలుమూలల నుంచి వచ్చిన 72 మంది ప్రతినిధులతో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించబడింది. 1920లో మహాత్మాగాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్య పోరాటాన్ని అహింస మార్గంలో ఉధృతం చేసింది. తద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. అధికారంలో ఉన్నా లేకున్నా జాతీయవాద, సామ్యవాద, లౌకికవాద, ప్రజాస్వామ్య భావజాలంతో దేశ సంపదను అందరికీ పంచాలనే లక్ష్యంతో ఇప్పటికీ పనిచేస్తున్న ఏకైక స్వాతంత్ర్యోద్యమ పార్టీ కాంగ్రెస్.



తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, ఆ తర్వాత లాల్ బహదూర్ శాస్త్రి ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్‌ల వరకు సుస్థిర పాలన చేసింది. ఈ సమయంలో పంచవర్ష ప్రణాళికల ద్వారా హరిత విప్లవం పేరుతో వ్యవసాయ రంగాన్ని, పారిశ్రామిక విప్లవం పేరుతో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేశారు. విజ్ఞాన సమాచార సాంకేతిక విప్లవం పేరుతో దేశ శాస్త్ర విజ్ఞానాన్ని టెలికాం, కంప్యూటర్ పరిజ్ఞానంతో సమాచార సాంకేతిక రంగాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వాలు దోహదపడ్డాయి. దేశంలో గ్రామీణ పేద ప్రజల ఆకలిని తీర్చే 'పనికి ఆహార పథకం' వంటివి ఇప్పటికీ కొనసాగుతున్నాయి. బ్యాంకుల జాతీయకరణ, సమాచార హక్కు చట్టం, ఆహార భద్రతా చట్టం, భూసేకరణ చట్టాలు తెచ్చి పాలనలో అనేక విప్లవాత్మక సంస్కరణలకు నాంది పలికింది కాంగ్రెస్ ప్రభుత్వాలే అన్నది జగమెరిగిన సత్యం.

సామాజిక న్యాయం చేయడంలో దేశంలోని అన్ని పార్టీలకు ఆదర్శంగా నిలిచింది కాంగ్రెస్ పార్టీ. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి తొలిసారి దళితుడైన దామోదరం సంజీవయ్యను ముఖ్యమంత్రిని, అనంతరం అఖిల భారత పార్టీ అధ్యక్షునిగా రెండు పర్యాయాలు అవకాశమిచ్చింది. ఆనాటి నుంచి నేటి వరకు అదే సామాజిక స్పృహతో వ్యవహరిస్తూ నేడు దళితుడైన మల్లికార్జున్ ఖర్గేను అధ్యక్షుడిని చేసి రాజకీయాలపై అణగారిన వర్గాలకు ఆత్మవిశ్వాసం కల్పించింది. 140 ఏళ్ళ కాంగ్రెస్ పార్టీకి 71 మంది అధ్యక్షులుగా పనిచేశారు. వీరిలో తెలంగాణ రాష్ట్ర ప్రదాత శ్రీమతి సోనియాగాంధీ 19 ఏళ్ళు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం రాహుల్‌గాంధీతో పాటు ప్రియాంకాగాంధీ కూడా లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించడంతో కాంగ్రెస్ పార్టీకి నూతన జవసత్వాలు వచ్చాయి.

– కోటూరి మానవతారాయ్, టీపీసీసీ అధికార ప్రతినిధి



పీడీఎస్ బియ్యం మాయం కేసులో పోలీసులు, పౌరసరఫరాల శాఖ అధికారులు మాజీమంత్రి పేర్ని నానికి సహకరిస్తున్నారా..? కావాలనే కేసు విచారణను నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారా?.. జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే అవుననే సమాధానం వస్తుంది. బియ్యం ఎంత మాయమైందో తేల్చడానికే నెల రోజుల సమయం పట్టడం, నిందితులను ఇంతవరకు పట్టుకోకపోవడం, బియ్యాన్ని స్వాహాచేసి కాకినాడ పోర్టుకు తరలించడం, కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును దిగమింగినా కేసును సిట్‌కు ఇవ్వకుండా స్థానిక పోలీసులే దర్యాప్తు చేస్తుండటం వెనుక కొన్ని అజ్ఞాత శక్తులు ఉన్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి.

లెక్కలేదా..?



బియ్యం మాయం కేసులో అనుమానాలెన్నో..

పోలీసుల నుంచి పౌరసరఫరాల వరకు పేర్ని నానికి సహకారం

- కేవలం బియ్యం లెక్క తేల్చడానికే నెల సమయం
- అధికారుల లెక్క 185 టన్నులు
- మంత్రి నాదెండ్ల లెక్క 243 టన్నులు
- చివరికి తేలింది 378 టన్నులు
- పూర్తిగా తేల్చకుండా 185 టన్నులకు నోటీసులు
- రూ.1.68 కోట్లు జరిమానా కట్టేసిన పేర్ని
- మిగిలిన 193 టన్నులకు కట్టకుండా జంప్
- కేసు నీరుగార్చడానికే అధికారుల తప్పుడు లెక్కలు
- గత జనవరిలో గోడౌన్ అగ్రిమెంట్ రెన్యువల్
- స్టాక్, వేబ్రిడ్జి సరిగ్గా ఉందని అధికారుల నివేదిక
- వేబ్రిడ్జిలో లోపాలున్నాయని పేర్ని బుకాయింపు

(విజయవాడ/మచిలీపట్నం-ఆంధ్రజ్యోతి) : మాజీమంత్రి పేర్ని నానికి చెందిన గోడౌన్‌లో బియ్యం కుంభకోణం వెలుగుచూసి నెల అవుతున్నా.. అటు అధికారులు కానీ, ఇటు పోలీసులు కానీ సరైన వివరాలు సేకరించలేకపోయారు. నిందితురాలు పేర్ని నాని భార్య జయసుధతో పాటు గోడౌన్ మేనేజర్, నిందితుడు మానస్ తేజ్‌ను కూడా పట్టుకోలేక పోయారంటే పరిస్థితి ఎలా ఉందో తెలుస్తుంది. సాధారణ ఉద్యోగిని పట్టుకోవడానికి నెల సమయం తీసుకున్నారంటే అది ఉద్దేశపూర్వకంగానే జరిపే జాప్యమేననిపిస్తోంది.



పొట్లపాలెంలో పేర్ని నానికి చెందిన గోడౌన్

లెక్క తేల్చడానికి నెల రోజులా?

మచిలీపట్నం మండలం పొట్లపాలెంలో పేర్ని జయసుధ పేరున ఉన్న గోడౌన్‌లో తొలుత 185 టన్నుల బియ్యం మాయమైనట్లు అధికారులు లెక్కతేల్చారు. ఇదే విషయాన్ని జయసుధ జేసీకి నవంబరు 26న లేఖ రాశారు. ఆ లేఖలో పేర్కొన్న దాన్నే అధికారులూ నిర్ధారించేశారు. అంత మేరకు జరిమానా కట్టాలంటూ డిమాండ్ నోటీసులు కూడా ఇచ్చేశారు. ఆ తర్వాత పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కల్పించుకుని.. స్వాహా చేసిన బియ్యం 243 టన్నులని ప్రకటించారు. తీరుబడిగా లెక్కలు తేల్చిన అధికారులు తాజాగా 378 టన్నులు బియ్యం మాయమైనట్లు ప్రకటించారు. రోజుకో లెక్క చెప్పడం ద్వారా అధికారులే కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మొదట్లో మాయమైన బియ్యం కిలోకు రూ.44.58 చొప్పున ధర నిర్ణయించారు. ఈ లెక్కల ప్రకారం 185 టన్నులకు రెట్టింపు సొమ్మును కట్టాలంటూ అధికారులు జారీచేసిన నోటీసుకు పేర్ని నాని సుమారు రూ.1.68 కోట్లను కట్టేశారు. అయితే, తాజా లెక్కల ప్రకారం మరో 193 టన్నులకు ఆయన జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. అంటే.. మరో రూ.1.72 కోట్లు చెల్లించాలి. ఈ మొత్తాన్ని కట్టేసినా గోడౌన్ యజమాని అయిన పేర్ని జయసుధపై క్రిమినల్ కేసు కొనసాగుతుంది. నిందితులకు శిక్ష పడేలా చేయాలంటే పౌరసరఫరాల శాఖ అధికారులు, పోలీసులు పకడ్బందీగా ఆధారాలు సేకరించి కోర్టు ముందుంచాల్సి ఉంది. కానీ, ఆ దిశగా అడుగులు వేయడం లేదు.

పోలీసుల సహకారం ఉందా?

బియ్యం మాయమైన ఘటనలో ఈ నెల 10న పౌరసరఫరాల శాఖ అధికారులు మచిలీపట్నం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గోడౌన్ యజమాని పేర్ని జయసుధ, మేనేజర్ మానస్ తేజ్‌పై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పేర్ని నాని కుటుంబసభ్యులు, గోడౌన్ మేనేజర్ అదృశ్యమయ్యారు. పేర్ని నాని ఒకటి రెండు రోజులు ఇంటివద్దే ఉన్నా, ఆ తర్వాత నుంచి కనిపించలేదు. దీంతో పేర్ని జయసుధ పేరుతో లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. జయసుధ కనిపించని నేపథ్యంలో పేర్ని నాని ఇంటికెళ్లిన పోలీసులు ఈ కేసులో వివరాలు తెలియజేసేందుకు ఆర్‌పేట పోలీస్ స్టేషన్‌కు రావాలని నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులు జారీ చేసినప్పటి నుంచి పేర్ని నాని కూడా కనిపించలేదు. బియ్యం మాయం కేసును నమోదుచేసే సమయంలోనే ముందస్తుగా పోలీసుల నుంచి పూర్తిస్థాయి సమాచారం నానీకి చేరిపోయిందనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఆయన కుటుంబం తప్పించుకోవడానికి ఆస్కారం లభించిందనే వాదన వినిపిస్తోంది. ఈ కేసును రాబర్ట్‌సన్ పేట (ఆర్‌పేట) పోలీసులు విచారణ చేస్తున్నారు. సీఐగా ప్రస్తుతం పనిచేస్తున్న ఏసుబాబు గతంలో గుడివాడలో దీర్ఘకాలం పనిచేశారు. ఈ సీఐ గుడివాడలో పనిచేసే సమయంలో అప్పటి పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని చెప్పినట్టే మసలుకునేవారు. ఈ పరిచయాన్ని పేర్ని నాని బాగా ఉపయోగించుకుంటున్నారు. గోడౌన్ నుంచి స్వాధీనం చేసుకున్న రికార్డులు, కంప్యూటర్లు పోలీసులకు అప్పగించామని పౌరసరఫరాల శాఖ అధికారులు అంటున్నారు. తమ పని పూర్తయిందని, పోలీసులే ఈ కేసులో తగు చర్యలు తీసుకోవాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ కేసు విచారణలో పోలీసులు ఇంత వరకు ఎలాంటి ముందడుగు వేయలేకపోతున్నారు.

మిగతా 6లో..



చింతా రవిబాలకృష్ణ శిష్య బృంద కూచిపూడి అభినయం

భళా.. కూచిపూడి కళ

ఘనంగా కూచిపూడి స్వర్ణోత్సవాలు ప్రారంభం

దేశ, విదేశాల నుంచి వచ్చిన కళాకారులు

అలరించిన కూచిపూడి నాట్య ప్రదర్శనలు

కూచిపూడి హెరిటేజ్ సొసైటీ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కేంద్ర సాంస్కృతిక శాఖ, రాష్ట్ర క్రియేటివ్ అండ్ కల్చర్ మిషన్ సహకారంతో కూచిపూడి శ్రీసిద్ధేంద్ర కళాపీఠంలో కూచిపూడి స్వర్ణోత్సవాల పేరిట ఏర్పాటుచేసిన నాట్యోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులతో పాటు ప్రవాస భారతీయులు తమ నాట్య ప్రదర్శనలతో సిద్ధేంద్రయోగికి నీరాజనాలు అర్పించారు.

8లో



అక్షరాల పండుగ

నేటి నుంచి ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు

- కేబీఎన్ కళాశాలలో రెండు రోజుల పాటు..
- సభా ప్రాంగణానికి పొట్టి శ్రీరాములు పేరు
- 100 మందికి పైగా అతిథులకు ఆహ్వానం

పలు దేశాల నుంచి 1,500 మంది ప్రతినిధుల రాక

6లో



ప్రమాదాలకు దారి చూపేలా

- వాహనాలకు హైబీమ్ ఎల్ఈడీ లైట్లు
- లైట్ల కాంతి తీవ్రత అధికం
- ఎదురు వాహనదారులకు మసకబారుతున్న కళ్లు
- మోటార్ వెహికల్ యాక్టు ఉల్లంఘన
- పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు

8లో

సవరించిన అంచనాలకు ఆమోదం నేడు

- నేడు జేసీలతో సబ్‌రిజిస్ట్రార్ల భేటీ
- జిల్లాస్థాయి కమిటీల్లో సవరించిన భూముల ధరలకు ఆమోదం

6లో

బుసక అక్రమాలు

దేవరపల్లి సొసైటీ భూముల తవ్వకాల్లో రాజకీయ రచ్చ

- దరఖాస్తుదారుడి వెనుక వైసీపీ క్రిమినల్ నేత
- ఓ మంత్రి అనుచరుడినని దరఖాస్తుదారుడి ప్రచారం
- వైసీపీకి చెంది, టీడీపీతో అంటకాగుతున్న మరో నేత సహకారం
- నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చే ప్రయత్నాలు
- వ్యతిరేకంగా దేవరపల్లి సొసైటీ సభ్యులు



దేవరపల్లి సొసైటీకి తూర్పువైపు, నదీప్రాంతం పక్కన విస్తారమైన బుసక భూములు

తోట్లవల్లూరు మండలంలో ఇసుక, బుసక తవ్వకాల కోసం విచిత్రమైన రాజకీయ పొత్తులు చోటుచేసుకుంటున్నాయి. 2022లో వైసీపీ ప్రభుత్వ అండతో ఇద్దరు నాయకులు దేవరపల్లి సొసైటీ పక్క భూముల్లో బుసకను దళితులను బెదిరించి మరీ ఇష్టానుసారంగా తవ్వేశారు. వారిలో ఒకరు ప్రస్తుత ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాకు దగ్గరై స్థానిక టీడీపీ నేతలతో జట్టుకట్టగా, గతంలో టీడీపీ నేతను హత్య చేసిన మరో క్రిమినల్ వైసీపీ నేతతో కలిసి తాజాగా దేవరపల్లి సొసైటీ భూములపై కన్నేశారు. బుసక తవ్వకాల పేరిట మచిలీపట్నానికి చెందిన వ్యక్తిని తెరపైకి తీసుకురాగా, అతనేమో ఓ మంత్రి అనుచరుడినని చెప్పుకొంటూ తవ్వకాలు జరిపేందుకు సిద్ధమైపోతున్నాడు.

తోట్లవల్లూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు మండలం దేవరపల్లి ఎస్సీ ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్స్ సొసైటీ సర్వే నెంబర్ 190లోని భూముల్లో బుసక తవ్వకాలకు మచిలీపట్నానికి చెందిన వెంకటస్వామి అనే వ్యక్తి కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ విషయాన్ని తహసీల్దార్ కుసుమకుమారి గతంలోనే చెప్పారు. అయితే, దరఖాస్తుదారుడు వెంకటస్వామికి దేవరపల్లి సొసైటీ భూముల్లో బుసక ఉందని ఎలా తెలిసింది..? అనే ప్రశ్నలు వస్తున్నాయి. బుసక తవ్వకాలకు ఆయన దరఖాస్తు చేయగా, స్థానికంగా మాత్రం ఇద్దరు వైసీపీ నేతలు అతనికి జత కలవటం రాజకీయంగా దుమారం రేపుతోంది.

ఇష్టానుసారంగా..

ఈ నెల 17న దేవరపల్లి సొసైటీ భూముల వద్ద అధికారుల బృందం సర్వే నిర్వహించి జెండాలను హద్దులుగా పాతారు. జీవో నెం 59 ప్రకారం సొసైటీ సీ క్లాస్ భూముల్లో తవ్వకాలకు అనుమతివ్వటం కుదరదని చెప్పిన అధికారులు అందుకు విరుద్ధంగా సర్వే చేశారు. అధికారుల తీరుని, సొసైటీ సభ్యుల ఆవేదనను 'ఆంధ్రజ్యోతి' పలుమార్లు వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో అధికారులు అనుమతి ఇచ్చేందుకు వెనుకాడారు. అయినప్పటికీ ఇసుక, బుసకను తవ్వేందుకు దరఖాస్తుదారుడు, వైసీపీ నాయకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. వైసీపీ క్రిమినల్ నేతకు మద్దతుగా ఓ గ్రామానికి చెందిన టీడీపీ అధ్యక్షుడు రంగంలోకి దిగి సొసైటీ సభ్యులను అడ్డురావొద్దని కోరినట్టు తెలిసింది. ఈ విచిత్ర రాజకీయ పొత్తులు అసలైన టీడీపీ కార్యకర్తలను గందరగోళానికి గురిచేస్తున్నాయి. దేవరపల్లి సొసైటీ చుట్టూ ప్రభుత్వ భూముల్లో రూ.కోట్ల విలువైన ఇసుక, బుసక ఉండటంతో అందరూ కలిసిపోయారనే విమర్శలు వస్తున్నాయి.

మిగతా 6లో..

సమాచారం ఇవ్వరేం..

- జెడ్పీ నిధులతో చేసే అభివృద్ధి పనులకు పిలవరా?
- జెడ్పీ సమావేశంలో చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ఫైర్
- పింఛన్లు, ఇళ్ల నిర్మాణంపై అధికారులకు ప్రశ్నలు
- ఈనెల 31నే పింఛన్లు ఇస్తామన్న అధికారులు



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక. చిత్రంలో సీఈవో కన్నమనాయుడు

మచిలీపట్నం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించే సమయంలో జడ్పీటీసీ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వట్లేదని, ఈ అంశంపై అధికారులకు పలుమార్లు తానే స్వయంగా చెప్పానని, ఇక నుంచి ఈ అంశంపై తాను జడ్పీ సమావేశాల్లో మాట్లాడనని, నేరుగా పంచాయతీరాజ్ కమిషనర్‌కు లేఖ రాస్తానని జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మండిపడ్డారు. జడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు హాల్లో శుక్రవారం జిల్లాపరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా హారిక మాట్లాడుతూ మండలస్థాయిలో జరిగే అభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన కనీస సమాచారం అధికారులు జడ్పీటీసీ సభ్యులకు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు.

అందరికీ పింఛన్లు

గ్రామీణాభివృద్ధి శాఖపై జరిగిన సమీక్షలో చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో పాటు పలువురు సభ్యులు మాట్లాడుతూ అనర్హుల పింఛన్లను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని.. జిల్లాలో ఎంతమందివి తొలగిస్తున్నారో వివరాలు చెప్పాలన్నారు. అధికారులు స్పందిస్తూ పాత పింఛన్ల తొలగింపు ప్రక్రియపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదన్నారు. ఈ నెల 31వ తేదీనే పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిందని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నూతన పింఛన్ల మంజూరుపై జనవరిలో ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

పాత పద్ధతిలోనే ఇళ్ల నిర్మాణం

జిల్లాలో నూతనంగా నిర్మించే ఇళ్లకు ప్రభుత్వం రూ.4 లక్షలు ఇస్తుందనే ప్రచారం జరుగుతోందని, దీంతో జగనన్న కాలనీల్లో ఇంకా గృహ నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులు ఆ పథకంలో చేరి ఇళ్లు నిర్మించుకునే ఆలోచనలో ఉన్నారని, ప్రభుత్వం ఇందుకు అనుమతులు ఇచ్చిందా.. అని పలువురు సభ్యులు అధికారులను వివరణ కోరారు. గృహ నిర్మాణశాఖ అధికారులు మాట్లాడుతూ పాత పద్ధతిలోనే ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు ఇస్తామని, రూ.4 లక్షల ప్రతిపాదన ఏమీ లేదని తెలిపారు. ఇళ్లు నిర్మించుకుంటున్న

మిగతా 6లో..

నీరసంగా నిరసనలు

ఉమ్మడి కృష్ణాలో పేలవంగా వైసీపీ విద్యుత్ పోరుబాట

- కనిపించని పేర్ని నాని, కొడాలి నాని, వల్లభనేని వంశీ
- మిగిలిన చోట్లా నామమాత్రంగానే..

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీల బాదుడంటూ వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా జరిగిన నిరసనలు తుస్సు.మన్నాయి. పామర్రు నియోజకవర్గం మినహా మిగిలిన చోట్ల నిరసన కార్యక్రమానికి సొంత పార్టీ నాయకులతో పాటు ప్రజల నుంచి స్పందన రాలేదు. ఇక విజయవాడ, జగ్గయ్యపేట, నందిగామ మినహా మిగిలిన నియోజకవర్గాల్లోనూ అదే పరిస్థితి.

ముఖ్య నాయకులు ఎక్కడ?

మచిలీపట్నం నియోజకవర్గంలో పేరున్న నాయకులెవరూ నిరసనలో కనిపించలేదు. బియ్యం స్వాహా కేసులో ఆ పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు పేర్ని నాని, ఆయన తనయుడు పేర్ని కిట్టు అజ్ఞాతంలో ఉన్నారు. దీంతో వారు ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. మచిలీపట్నం కార్పొరేషన్ మేయర్ వైసీపీకి చెందినవారే అయినా.. ఆమె ఈ కార్యక్రమంలో పాల్గొనలేదు. ఆమె తరఫున ఆమె భర్త పాల్గొన్నారు. పేర్ని నానీపై ఉన్న అసంతృప్తితో చాలామంది నాయకులు కార్యక్రమానికి దూరంగా ఉండిపోయారు. గుడివాడ నియోజకవర్గంలోనూ పెద్ద నాయకులు కనిపించలేదు. కొడాలి నాని అసలు ఊర్లోనే లేరు. గన్నవరం నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు వల్లభనేని వంశీ ఎన్నికల అనంతరం

మిగతా 6లో..



నగరంలో విద్యుత్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న వైసీపీ నేత దేవినేని అవినాశ్

కలం సందడి



- నేటి నుంచి ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు
- కేబీఎన్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహణ
- సభా ప్రాంగణానికి పొట్టి శ్రీరాములుగా నామకరణం
- ప్రపంచ దేశాల నుంచి ప్రతినిధులు రాక

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సాహిత్యవాడలో కలం ప్రియుల సందడి కనిపించనుంది. సాహిత్యప్రియుల ఆత్మీయ కలయికకు నగరంలోని కేబీఎన్ కళాశాల వేదిక కానుంది. కృష్ణాజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మహాసభలను కొత్తపేటలోని కేబీఎన్ కళాశాలలో నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై ఆదివారం సాయంత్రం వరకు జరుగుతాయి. మహాసభలకు ఇప్పటి వరకు 1500మంది ప్రతినిధులు పేర్లను నమోదు చేయించుకున్నారు. అమెరికా, దుబాయ్, యూఏఈతో పాటు మరికొన్ని దేశాల నుంచి ప్రతినిధులు ఇప్పటికే విజయవాడకు చేరుకున్నారు. 100 మందికి పైగా అతిథులు హాజరవుతున్నారు. మహాసభలకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. సభా ప్రాంగణానికి అమరజీవి పొట్టి శ్రీరాములుగా నామకరణం చేశారు. మొత్తం మూడు వేదికలపై కార్యక్రమాలు నిర్వహిస్తారు. చెరుకూరి రామోజీరావు, దాశరథి, ఆశావాది ప్రకాశరావుగా వేదికలకు పేర్లు పెట్టారు. 300మంది విద్యార్థులు మహాసభల్లో పాల్గొననుండగా వారికి కవిత, సాహిత్యం, రచనలపై శిక్షణా తరగతులు నిర్వహించాలని భాషాభిమానులు నిర్ణయించారు. ప్రారంభోత్సవ సభకు ముఖ్యఅతిథులుగా సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ, అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు హాజరుకానున్నారు. యువకవి సమ్మేళనాలు నిర్వహించనున్నారు. మొత్తం ఐదు కవి సమ్మేళనాలు నిర్వహిస్తారు. సభాప్రాంగణంలో తెలుగుతల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు నిర్వహించిన మహాసభల నేపథ్యంలో 'మార్పు' పేరుతో పరిశోధనా గ్రంథాన్ని రూపొందించారు. ఈ పుస్తకాన్ని పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ ఆవిష్కరిస్తారు.

నేటి కార్యక్రమాలు...

చెరుకూరి రామోజీరావు సభావేదిక

ఉ. 8.30 గంటలకు కూచిపూడి నాట్య ప్రదర్శన
ఉ. 9.30 గంటలకు ప్రారంభోత్సవ సభ
మ. 12 గంటలకు తెలుగు వెలుగుల సభ
మ. 1.30లకు శాస్త్ర సాంకేతికరంగ ప్రతినిధుల సదస్సు
మ. 3 గంటలకు పత్రికలు, ప్రచురణలు, ప్రసార రంగాల సదస్సు
సా. 4.30లకు మహిళా ప్రతినిధుల సదస్సు
సా. 6 : సాంస్కృతిక రంగ ప్రతినిధుల సదస్సు

దాశరథి సభావేదిక

మ. 12 గంటలకు కవితా సదస్సు
మ. 1.30లకు విద్యారంగ ప్రతినిధుల సదస్సు
సా. 3.30లకు సాహిత్య సదస్సు
సా. 5.30లకు యువకలాల సమ్మేళనం-1

ఆశావాది ప్రకాశరావు సభావేదిక

మ. 12 గంటలకు ఒకటో కవి సమ్మేళనం
మ. 2.30లకు రెండో కవి సమ్మేళనం
సా. 5 గంటలకు మూడో కవి సమ్మేళనం

సవరించిన అంచనాలు.. ఆమోదం నేడు

- నేడు ఉమ్మడి జిల్లా జేసీలతో సబ్‌రిజిస్ట్రార్ల భేటీ
- జిల్లా స్థాయి కమిటీలలో సవరించిన భూముల ధరలకు ఆమోదం
- గ్రామీణ ప్రాంతాల్లో 10 శాతం, పట్టణ ప్రాంతాల్లో 12 శాతం మేర విలువ పెంపు ప్రతిపాదన
- ఎల్‌పీఎం నెంబర్లపై ప్రత్యేక ఆదేశాలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : భూముల రిజిస్ట్రేషన్ల ధరల పెంపుదల వాయిదా పడినప్పటికీ.. ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా నిర్దేశించిన ధరలను జిల్లా కమిటీల ఆమోదం పొందేందుకు సబ్‌రిజిస్ట్రార్లు శనివారం జాయింట్ కలెక్టర్లతో సమావేశం కానున్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో సబ్‌రిజిస్ట్రార్లు 10 శాతం మేర భూముల ధరల పెంపుదలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. విజయవాడ నగరం, గ్రేటర్ విలీన గ్రామాల పరిధిలో మాత్రం 12 శాతం వరకు భూముల ధరల పెంపుదలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ నగరం, విజయవాడ గ్రేటర్ విలీన ప్రతిపాదిత గ్రామాలలో 30 శాతం మేర పెంపుదల చేశారు. పట్టణ ప్రాంతాలన్నింటిలోనూ 30శాతం మేర ధరలను పెంచారు. పట్టణ ప్రాంతాల్లో చెత్తపన్నును దృష్టిలో ఉంచుకుని వైసీపీ ప్రభుత్వం ఒక్కసారిగా మార్కెట్ ధరలను పెంచింది. చెత్తపన్ను విధింపు మార్కెట్ విలువల ప్రకారం పెంచాలన్న నిబంధన కూడా వైసీపీ ప్రభుత్వమే పొందుపరిచింది. మార్కెట్ విలువ ఎంత పెరిగితే అంతగా చెత్త పన్ను పెరుగుతుంది. ఇలాంటి వ్యవహారాల కారణంగా భూముల ధరలను విపరీతంగా పెంచటతో.. రియల్ ఎస్టేట్ భారీగా కుదుపునకు గురైంది. ఒక వైపు భూముల ధరలు విపరీతంగా పెరిగిపోతే.. మరోవైపు ప్రజల్లో కొనుగోలు శక్తి దారుణంగా పడిపోయింది. దీంతో రియల్ ఎస్టేట్ కుదేలైంది. దీనిని దృష్టిలో ఉంచుకుని 10 శాతం మేర మాత్రమే భూముల ధర పెంపుదలకు ప్రభుత్వం నిర్దేశించింది. ఆ మేరకే పెంపుదల చేశారు. పెంచిన ధరలను తాత్కాలికంగా వాయిదా వేసినట్టు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావటంతో అమలు చేయరని తెలుస్తోంది. తాత్కాలికంగా చేయకపోయినా రానున్న రోజుల్లో అమలుకు వీలుగా పెంచిన ధరలను జిల్లా కమిటీల వద్ద ఆమోదానికి పెట్టాలని నిర్దేశించటం జరిగింది. శనివారం ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల జాయింట్ కలెక్టర్ల నుంచి పెంచిన ధరలకు సంబంధించి సబ్‌రిజిస్ట్రార్లు ఆమోదం తీసుకోనున్నారు.

ఎల్‌పీఎం నెంబర్లపై మార్గదర్శకాలు

గత వైసీపీ ప్రభుత్వంలో జరిపిన రీ సర్వే కారణంగా సర్వే నెంబర్ల స్థానంలో ఏర్పాటు చేసిన ఎల్‌పీఎం నెంబర్ల కారణంగా భూముల ధరలను సవరించే క్రమంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని సబ్‌రిజిస్ట్రార్లు గగ్గోలు పెడుతున్న సంగతి తెలిసిందే. ఒక ఎల్‌పీఎంలో భూ యజమానికి ఎన్నిచోట్ల భూములు ఉంటే అవన్నీ వస్తున్నాయి. ఎల్‌పీఎం ప్రాతిపదికన భూములు పెంచితే మిగిలిన చోట్ల కూడా పెరిగిపోతున్నాయి. దీనికారణంగా ఒక గ్రామంలో ఎల్‌పీఎం నెంబర్లు ఉన్నచోట భూముల ధరలు ఎక్కువగానూ, సర్వే నెంబర్లు ఉన్నచోట భూముల ధరలు తక్కువగానూ ఉంటాయి. ఈ గందరగోళం కారణంగా ఎల్‌పీఎం నెంబర్లకు సంబంధించి ఎలా సవరింపులా చేయాలన్న దానిపై సబ్‌రిజిస్ట్రార్లు తలలు పట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రిజిస్ట్రేషన్ శాఖ నుంచి ఈ అంశానికి సంబంధించి మౌఖిక ఆదేశాలు వచ్చాయి.



చెత్త సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోండి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు, ఆర్థిక స్వావలంబనకు ఉపయోగపడుతున్న ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. శుక్రవారం అధికారులతో కలిసి ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లిలో పీఎం సూర్యఘర్ పథకంతో లబ్ధిపొందుతున్న విశ్రాంత ఆర్‌అండ్‌బీ ఇంజనీర్ ఏఆర్‌ఎస్‌పీ ప్రసాద్ ఇంటిని సందర్శించారు. ఈ వ్యవస్థ ఏర్పాటు చేసుకోకముందు, ప్రస్తుతం వస్తున్న బిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటి పైకప్పుపై రాయితీతో, అతి తక్కువ ఖర్చుతో సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకొని కరెంటు బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని మిగిలిన వారు కూడా సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం తనిఖీ

గుంటుపల్లిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడి కార్యకలాపాలను కలెక్టర్ పరిశీలించారు. వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ ఎ.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మిళిత వృద్ధి సాధనలో బ్యాంకులు కీలక పాత్ర పోషించాలి

కృష్ణలంక : స్వర్ణాంధ్ర 2047 సాకారం దిశగా అమలుచేస్తున్న ప్రణాళికలు మంచి ఫలితాలు ఇవ్వడంలో, అన్ని రంగాల్లోనూ 15 శాతం సుస్థిర, సమ్మిళిత వృద్ధి సాధనలో బ్యాంకులు కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో లీడ్ జిల్లా కార్యాలయం అధ్వర్యంలో జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లాస్థాయి సమీక్షా కమిటీ సమావేశం (డీఎల్‌ఆర్‌సీ) జరిగింది. సమావేశంలో వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాల సాధన, పురోగతిపై చర్చించారు. బ్యాంకులు వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను చేరుకొనేందుకు కృషి చేయాలని తెలిపారు. పీఎంఈజీపీ, స్టాండప్ ఇండియా, ప్రధానమంత్రి ముద్రా యోజన, ఆత్మ నిర్భర్-పీఎం స్వానిధి, ఏపీ టిడ్కో-పీఎంఏవై (అర్బన్) తదితరాలపైనా సమావేశంలో చర్చించారు. డీసీసీ కన్వీనర్ ఎం.శ్రీధర్, ఆర్‌బీఐ మేనేజర్ నాగప్రవీణ్, నాబార్డు డీడీఎం మిలింద్ చౌసాల్కర్, ఎల్డీఎం కె.ప్రియాంక, ఆర్‌ఎస్ఈటీఐ డైరక్టర్ మల్లిఖార్జునరెడ్డి, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, పశుసంవర్థక అధికారి ఎం.హనుమంతరావు, ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, వివిధ బ్యాంకుల కంట్రోలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిని విడుదల చేయించండి

- ఈఎన్‌సీకి ఎన్‌ఎస్‌ఆర్ ప్రాజెక్టు కమిటీ వీసీ ఆళ్ల వినతి

విజయవాడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ ఎడమకాలువ మూడో జోన్‌లో ఉన్న ఆరుతడి పంటలను రక్షించుకునేందుకు ఎన్ఎస్ఆర్ నుంచి నీటిని విడుదల చేయించాలని ఎడమ కాల్వ ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణ జలవనరుల శాఖ ఈఎన్‌సీ వెంకటేశ్వరరావును కోరారు. విజయవాడలోని ఈఎన్‌సీ కార్యాలయంలో ఆయనకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లా నాగార్జునసాగర్ ఎడమకాలువ పరిధిలో గన్నవరం, నూజివీడు, దెందులూరు, తిరువూరు, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో 2.36లక్షల ఎకరాల్లో మామిడి, పొగాకు, మిర్చి, పత్తి, జొన్న, మొక్కజొన్న, వేరుశనగ, మినుము తదితర ఆరుతడి పంటలను ఆయకట్టుదారులు సాగు చేశారన్నారు. ప్రభుత్వం నవంబరులో చేసిన విజ్ఞప్తి మేరకు నాగార్జునసాగర్ ఎడమకాలువకు డిసెంబరు, జనవరిలో 12 టీఎంసీలు నీరు ఇవ్వాలని కృష్ణానది యాజమాన్య బోర్డు ఈనెల ఐదున ఆదేశాలు ఇచ్చిందన్నారు. తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు 20 నుంచి కాలయాపన చేస్తూ సాగునీరు ఇవ్వడం లేదని ఈఎన్‌సీ దృష్టికి తీసుకెళ్లారు. ఎడమ కాల్వ నుంచి సత్వరం నీటిని విడుదల చేయించడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బందరులో నకిలీ నోట్ల కలకలం!

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో నకిలీ కరెన్సీ ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకోవడం స్థానికంగా సంచలనం రేకెత్తించింది. గురువారం రాత్రి బస్టాండ్ సెంటర్‌లోని ఒక మద్యం దుకాణంలో ఓ వ్యక్తి దొంగ నోట్లు మార్చుతుండగా సిబ్బంది గుర్తించారు. చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చాకచక్యంగా నకిలీ నోట్లు చలామణి చేసేందుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు, అతని స్నేహితులు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నలుగురూ దొంగనోట్ల మార్పిడికి మచిలీపట్నం, పెడన ప్రాంతాల నుంచి తీసుకువస్తున్నట్టు పోలీసు విచారణలో తేలింది. ఈ ముఠాపై పోలీసులు సమగ్ర విచారణ చేస్తున్నారు. దీని వెనుక 37వ డివిజన్‌కు చెందిన ఒక రాజకీయ పార్టీ నేత పాత్ర ఉన్నట్టు సమాచారం. చిలకలపూడి సీఐ నబీ కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల వివరాలను వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు.

కారు మెకానిజం, ప్లంబింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఉంగుటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్ ప్రాంగణంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం నైపుణ్యాభివృద్ధి శిక్షణాకేంద్రంలో జనవరి 6 నుంచి కారు మెకానిజం, ప్లంబింగ్ అండ్ శానిటరీ కోర్సుల్లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్టు స్వర్ణభారత్‌ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కార్ల తయారీ సంస్థ హ్యూందాయ్ కుశలవ సాంకేతిక సహకారంతో కారు మెకానిజం కోర్సులో శిక్షణ, జాక్వార్ కంపెనీ సాంకేతిక సహకారంతో ప్లంబింగ్ కోర్సులో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కోర్సుల కాలపరిమితి మూడునెలలుంటుందని, శిక్షణా కాలంలో అభ్యర్థులకు భోజనం, హాస్టల్ వసతి సదుపాయాలు పూర్తిగా ఉచితమని పేర్కొన్నారు. 10వ తరగతి/ఐటీఐ (ఫిట్టర్, ఎలక్ట్రీషియన్) చదివి, 18నుంచి 35సం.ల వయసుగల నిరుద్యోగులు ఆయా కోర్సుల్లో శిక్షణ పొందేందుకు అర్హులన్నారు. శిక్షణానంతరం సర్టిఫికెట్లు, టూల్‌కిట్లతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు అవసరమైన సహాయ, సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. ఆయా కోర్సుల్లో నైపుణ్యాలు మెరుగుపరచుకోవటంద్వారా కారు మెకానిక్, ప్లంబర్‌గా స్వయం ఉపాధిని పొందాలనుకునే నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హతగల యువకులు సంబంధిత ధ్రువీకరణపత్రాలతో నేరుగా శిక్షణాకేంద్రానికి విచ్చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు బి.రామకృష్ణ(ఇన్‌స్ట్రక్టర్)-9440925583 నెంబర్‌లో సంప్రదించాలని దీపా వెంకట్ పేర్కొన్నారు.

నిర్లక్ష్యపు నీడలో కాకతీయ శాసనాలు

- రొంపిచర్ల చారిత్రక ఆనవాళ్లను కాపాడాలి
- పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి



శాసనాలు, శిల్పాలను పరిశీలిస్తున్న ఈమని శివనాగిరెడ్డి

విజయవాడ కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా రొంపిచర్ల శివారులోని వేణుగోపాలస్వామి దేవాలయానికి వెళ్లే దారిలో నిర్లక్ష్యానికి గురైన క్రీ.శ. 10-13 శతాబ్దాల నాటి శిల్పాలు, శాసనాలను భద్రపరిచి, కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. వారసత్వ సంపదను గుర్తించి, పరిరక్షించడానికి చేపట్టిన అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం రొంపిచర్లలో పర్యటించి పలు చారిత్రక ఆనవాళ్లను గుర్తించారు. గ్రామ వెలుపల, వినాయక ఆలయం ముందు రోడ్డుపై, మదన గోపాల దేవాలయానికి వెళ్లే దారిలో, క్రీ.శ 10వ శతాబ్దానికి చెందిన మహిషాసురమర్దిని, బ్రహ్మ, కుమారస్వామి, భైరవ, నంది విగ్రహాలు, ఇంకా కాకతీయ గణపతి దేవుడు, ప్రతాపరుద్రుడు విడుదల చేసిన రాతి శాసనాలు ఆలనా పాలనా లేక గడ్డి, గాదం మధ్య పడివున్నాయన్నారు. గణపతి దేవుని శాసనంలో స్థానిక కేశవ దేవునికి, క్రీ.శ.1320 నాటి ప్రతాపరుద్రుని శాసనంలో స్థానిక అనంత గోపీనాథ దేవుని అమావాస్య కొలువులకు రెడ్ల చెరువు వెనక కొంత భూమిని దానం చేసిన వివరాలు, అలాగే క్రీ.శ. 1245 నాటి కోట భీమరాజు మంత్రి వల్లభుడు, రొంపిచర్లలో కట్టించిన గోపీనాథ ఆలయానికి కొంత భూమిని దానం చేసిన వివరాలు వున్నాయని ఆయన చెప్పారు. రొంపిచర్ల చరిత్రకు సాక్ష్యాలైన ఈ శిల్పాలు, శాసనాలను కాపాడి, భవిష్యత్ తరాలకు అందించాలని శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గట్టుప్పల్ శ్రీనివాస్ పద్మ వంశీ, స్థపతి బి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ పెంచాలి

- వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ బాబు.ఎ

కృష్ణలంక, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ లీకేజీలను అరికట్టాలని, కొత్త రిజిస్ట్రేషన్లను నమోదు చేయించాలని వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ బాబు.ఎ తెలిపారు. విజయవాడలోని ఆయోధ్యనగర్, ఆటోనగర్‌లోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులతో మాట్లాడుతూ డివిజన్ రెవెన్యూ పెంపొందించడానికి ప్రతి ఉద్యోగి తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని నిర్దేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా ఆడిట్లు, ఇన్‌స్పెక్షన్స్, రిటర్న్ స్క్రూటినీలను త్వరితగతిన పూర్తిచేయాలని, పాత బకాయిల వసూళ్లను ముమ్మరం చేయాలని ఆదేశించారు.

సంగీత సరస్వతికి కష్టాలు!

- ఒంటరి జీవనం.. ప్రభుత్వ పింఛనే ఆధారం
- అనారోగ్యం.. కాళ్లు చచ్చుబడిపోయి నడవలేని పరిస్థితి
- దాతలు ఆదుకోవాలని వృద్ధురాలి వేడుకోలు



నడవలేని స్థితిలో శ్రీదేవి

వన్‌టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆమె ఉన్నత విద్యావంతురాలు.. సంగీతంలో ఎంఏ పట్టా పొందింది.. అయితే చిన్నతనం నుంచి ఆమెను కష్టాలు వెన్నాడుతూనే ఉన్నాయి. బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన ఆమెను సమీప బంధువు చేరదీసి ఉన్నత చదువులు చదివించారు. తోడుంటానన్న భర్త మొహం చాటేయడం.. చేరదీసిన బంధువు మృతి చెందడంతో ఆమె జీవితం ఒంటరిగానే సాగింది. పిల్లలకు ట్యూషన్లు చెప్పుకుంటూ కాలం గడిపింది. చివరకు వృద్ధాప్యంలో చూసేవారు లేక ప్రభుత్వ పింఛన్‌తో కాలం వెళ్లదీస్తోంది. ఇటీవల అనారోగ్యంతో రెండు కాళ్లూ చచ్చుబడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో దాతలు ఆదుకోవాలని అర్థిస్తోంది.

విద్యాధరపురం కొట్టేటి కోటయ్యవీధిలో అద్దె ఇంట్లో ఉంటున్న వృద్ధురాలు శ్రీపాద శ్రీదేవి (60) ఒంటరిగా జీవిస్తోంది. ప్రభుత్వం ఇచ్చే సామాజిక పెన్షన్ రూ.4 వేలే ఆమెకు ఆధారం. ఆరోగ్యం సహకరించక, చూసే వారులేక సాయం చేసే దాతల కోసం ఎదురు చూస్తోంది. రెండేళ్ల వయస్సులో తల్లి, 12 ఏళ్ల వయస్సులో తండ్రి మృతి చెందడంతో ఆమె బంధువు చదివించి పెంచి పెద్ద చేశారు. ఆమె విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ చదివింది. విజయవాడ ఘంటసాల సంగీత కళాశాలలో గ్రాతంలో ఎంఏ పట్టా పొందింది. సమీప బంధువే ఆమె ఆలనా పాలనా చూశారు. అనంతరం ఆయన కూడా అనారోగ్య కారణాలతో మృతి చెందారు. వివాహమాడిన భర్త విడిచిపెట్టి వెళ్లిపోవడంతో ట్యూషన్లు చెప్పుకుంటూ జీవించింది. చివరకు అద్దె ఇంట్లో ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌తోనే జీవనం సాగిస్తోంది. అనారోగ్యంతో రెండు కాళ్లు చచ్చుబడిపోవడంతో ఆపరేషన్‌కు రూ.2 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారని, దాతలు ఆదుకోవాలని ఆమె అభ్యర్థిస్తోంది. సహాయం చేయదలచినవారు 8978810135 నెంబరులో సంప్రదించవచ్చు.

లెక్కలేదా..?

(5వ పేజీ తరువాయి)

పౌరసరఫరాల శాఖ అధికారుల తీరుపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది జనవరిలో గోడౌన్‌ను రెన్యువల్ చేశారు. ఆ సమయంలో స్టాక్‌ను తనిఖీ చేసి, అంతా సరిగ్గా ఉంటేనే రెన్యువల్ చేయాలి. ఎలాంటి తనిఖీలు చేయకుండానే, అంతా సక్రమంగా ఉందంటూ గోడౌన్ అగ్రిమెంట్‌ను మరో ఏడాది రెన్యువల్ చేశారు. వేబ్రిడ్జిని కూడా తనిఖీ చేసి బాగా ఉందని సర్టిపై చేశారు. అయితే, అప్పటికే బియ్యం పక్కదారి పట్టిందా? లేక ఎన్నికల ముందు పక్కదారి పట్టిందా? అనే విషయాన్ని నిగ్గుతేల్చడంలో అధికారులు విఫలమయ్యారు. మరోవైపు పేర్ని నాని.. వేబ్రిడ్జిలో లోపాల కారణంగానే బియ్యం షార్టేజీ వచ్చిందని బుకాయిస్తున్నారు. వేబ్రిడ్జిలో లోపం ఉంటే వందల కేజీల్లో తేడా వస్తుంది కానీ, వందల టన్నుల్లో తేడా ఎలా వస్తుందనే ప్రశ్నకు సమాధానం లేదు. గోడౌన్‌కు పూర్తి బాధ్యత యజమానిదే. గోడౌన్‌లోని బియ్యం నిల్వల్లో అక్రమాలు జరిగితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఒప్పంద పత్రంలో స్పష్టంగా పేర్కొన్నారు. అధికారులు, పోలీసులు ఈ కేసుపై పూర్తిస్థాయిలో దృష్టిపెడితే నిందితులకు కచ్చితంగా శిక్షపడే అవకాశాలు ఉన్నాయి.

బెయిల్ పిటీషన్‌పై 30న తుదితీర్పు


ఈ కేసులో జయసుధ దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం 9వ అదనపు జిల్లా కోర్టులో వాదోపవాదాలు జరిగాయి. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును ఈ నెల 30కి వాయిదా వేశారు.

బుసక అక్రమాలు

(5వ పేజీ తరువాయి)

మంత్రి పేరును వాడుకుంటూ ఎలాగైనా అనుమతులు సాధించేందుకు వెంకటస్వామి ప్రయత్నిస్తున్నాడని తెలిసింది. దీంతో అధికారులు కూడా సానుకూలంగా పనిచేస్తూ రిపోర్టులు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.


నన్ను సొసైటీ సభ్యుడు కాదంటున్నారు



- పెదపూడి కోటేశ్వరరావు, సొసైటీ రైతు

నేను సొసైటీ సభ్యుడను. ప్రస్తుతం మొక్కజొన్న వేశాను. గతంలో రైతు భరోసా వచ్చింది. సొసైటీ రిజిస్టర్‌లో నా పేరుంది. బుసక తవ్వకాలను వ్యతిరేకిస్తుంటే తనను సొసైటీ సభ్యుడు కాదని అధికారులు చెప్పటం దారుణం. బుసక తవ్వకాలు జరిపితే సొసైటీ భూములు మిగలవనేదే నా తపన.

వైసీపీ హయాంలో బుసక తవ్వినవారే..



- దేవరపల్లి బాబూరావు, సొసైటీ రైతు

మా సొసైటీకి పడమర వైపున, సర్వే నెంబర్ 190లోని ప్రభుత్వ భూముల్లో 2022లో తవ్వకాలు జరిపారు. జగనన్న ఇళ్ల స్థలాల మెరక పేరుతో ఇద్దరు వైసీపీ నేతలు అందరినీ భయపెట్టి సుమారు 50 ఎకరాల్లో భారీగా బుసకను తవ్వేశారు. ఆ భూమి గుండంగా మారి ఇసుకలో కలిసిపోయింది. సొసైటీ భూములను కూడా ఇలాగే మార్చాలనుకుంటున్నారు. ఆ ఇద్దరు బుసక తవ్వకాల కోసం వస్తున్నారు. నేను సొంత ఖర్చుతో బోరు నిర్మించుకుని మొక్కజొన్న వేశాను. బుసక తవ్వకాలు జరిపితే ఆ భూమి కోతకు గురై నదిలో కలిసిపోయే ప్రమాదం ఉంది.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- సీపీ ఎస్వీ రాజశేఖర్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ రాజశేఖర్

మైలవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ సూచించారు. ఎల్బీఆర్సీఈలో శుక్రవారం సైబర్ క్రైమ్, డిజిటల్ అరెస్టు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ, సైబర్ నేరాల నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంత ముఖ్యమో, సైబర్ నేరాలు జరగకుండా అవగాహన కల్పించడం కూడా అంతే ముఖ్యమని, అప్పుడే సైబర్ సురక్షిత సమాజ నిర్మాణంకు మార్గం వేసిన వారం అవుతామన్నారు. టెక్నాలజీతో విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేసి సైబర్ నేరాలను అరికట్టడానికి యాప్‌లు, డిజిటల్ సాధనాలు రూపొందిచ వచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ మనిషా, ఏడీసీపీ టాస్క్‌ఫోర్స్ శ్రీనివాసరావు, మైలవరం ఏసీపీ ప్రసాదరావు, ఎస్సైలు గిరిబాబు, చంద్రశేఖర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.అప్పారావు, కళాశాల ప్రెసిడెంట్ శ్రీనివాస రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ కంపెనీ ఉద్యోగికి రిమాండ్

జగ్గయ్యపేట రూరల్, డిశంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తాను పనిచేస్తున్న సిమెంట్ కంపెనీలో రూ.86 లక్షలకు టోకరా వేసి తప్పించుకు తిరుగుతున్న ఉద్యోగి పాల్వంచ శ్రీనివాసరావును కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తోట సూర్యశ్రీనివాస్ తెలిపారు. కాకతీయ సిమెంట్స్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావు వేతనంలో అక్రమంగా రూ. 86.50 లక్షలు తీసుకున్నాడని కంపెనీ ప్రతినిధి గోపాలకృష్ణంరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు తెలిపారు. శుక్రవారం ఉదయం షేర్‌మహ్మద్‌పేట క్రాస్ రోడ్డు వద్ద హైదరాబాద్ వెళ్లేందుకు యత్నిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు.

బాలికపై లైంగిక దాడి.. పాస్టర్‌పై కేసు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరుసకు మేనమామ అయిన ఓ పాస్టర్ అభం శుభం తెలియని 14 ఏళ్ల బాలికపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడటంతో అతడిపై ఇబ్రహీంపట్నం పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం కొండపల్లికి చెందిన బాలికపై పాల్వంచకు చెందిన పాస్టర్ ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడేవాడు. బాలిక అనారోగ్యానికి గురికావడంతో కుటుంబసభ్యులు విషయం తెలుసుకుని చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పాస్టర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నీరసంగా నిరసనలు

(5వ పేజీ తరువాయి)

ఇప్పటి వరకు ఏ పార్టీ కార్యక్రమంలోనూ పాల్గొనలేదు. పెడన నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీచేసిన ఉప్పాల రాము ఆధ్వర్యంలో నిరసన జరిగింది. పెనమలూరు నియోజకవర్గంలో వైసీపీ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి, వైసీపీ సీనియర్ నాయకుడు అన్నే చిట్టిబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అవనిగడ్డలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్, పామర్రులో మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన జరిగింది. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాశ్ ఆధ్వర్యంలో నిరసన జరగ్గా, మైలవరంలో జోగి రమేశ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. నందిగామలో ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో, జగ్గయ్యపేటలో నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. తిరువూరులో చోటా నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టి 10 నిమిషాల్లోనే ముగించేశారు.

సమాచారం ఇవ్వరేం..

(5వ పేజీ తరువాయి)

లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్‌లో లేకుండా చూస్తున్నామని వివరణ ఇచ్చారు. జగనన్న కాలనీల్లో గతంలో లబ్ధిదారులకు ఇచ్చిన స్థలాలను వెనక్కు తీసుకునే ప్రతిపాదన కూడా లేదన్నారు. జనవరి 3న రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు లక్ష ఇళ్లను అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని గృహనిర్మాణ శాఖ అధికారి వెంకట్రావు తెలిపారు.

15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల

ఉమ్మడి జిల్లాలోని అన్ని పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయని జడ్పీ సీఈవో కన్నమనాయుడు తెలిపారు. ఈ నిధులతో జిల్లా వ్యాప్తంగా 1,100 పనులు చేసేందుకు అనుమతులు ఇచ్చామన్నారు. ఎంపీటీసీలకు, జెడ్పీటీసీలకు ఆరు నెలలకు సంబంధించిన గౌరవ వేతనాన్ని కూడా ప్రభుత్వం విడుదల చేసిందని ఆయన తెలిపారు. గతంలో ఏడాదికి సంబంధించిన గౌరవ వేతనం బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్ ఉన్నట్లు తెలిపారు. స్వర్ణ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటి సర్వే జరుగుతోందన్నారు.

3.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

తేమశాతం పేరుతో దళారులు, మిల్లర్లు ధాన్యం మద్దతు ధరలో కోతపెట్టి రైతులను మోసం చేస్తున్నారని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ధాన్యంలో తేమశాతం 21 పాయింట్లు ఉన్నా, పూర్తిస్థాయి మద్దతు ధరను ఇస్తామని ప్రభుత్వం చెప్పినా, ఎక్కడ అమలు కావడంలేదని సభ్యులు అధికారులను నిలదీశారు. నిబంధనల మేరకే జిల్లాలో ధాన్యం కొనుగోలు జరుగుతోందని, ఇప్పటివరకు 3.50 లక్షల టన్నుల ధాన్యాన్ని కొన్నామని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. అనంతరం విద్య, వైద్యం, స్త్రీ, శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమ శాఖలపై సమీక్ష జరిగింది. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల అధికారులు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	113,121, 132
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

సాగునీటి కాలువల నిర్వహణకు సహకరించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : సాగునీటి కాలువల చివరి భూముల కు సాగు నీరందించే విధంగా ప్రధాన కాలువలతో పాటు చిన్నపాటి కాలువ నిర్వహణకు ప్రభుత్వం సహకరించాలని డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, దేవినేని సత్యన్నారాయణ సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహనరావును కోరారు. కాకులపాడు ఛానల్ డీసీ కొమ్మారెడ్డి రాజేష్, మడిచర్ల డీసీ దేవినేని సత్యనారాయణ, రైతులు విజయవాడలోని సాగునీటి కార్యాలయంలో ఈఈ కొడాలి బాబుతో కలిసి సూపరింటెండెంట్‌కు సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, డీసీ చైర్మన్ పామర్తి శ్రీనివాసరావు, లింగం నవీన్, మొవ్వా వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎం నేడు

ఉయ్యూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనల స్వీకరణ నిమిత్తం శనివారం ఉదయం 11 నుంచి 12 గంటలవరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ కెఎస్ఆర్‌కె ప్రసాద్ తెలిపారు. 9959 224796 సెల్ నంబరుకు ఫోన్ చేసి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

గన్నవరంలో..

గన్నవరం : స్థానిక ఆర్టీసీ డిపో నందు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు డీఎం పి.శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. 8790996090 నెంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలివ్వాలని కోరారు.



సీఎస్సీ ఇండియా నుంచి ఒప్పందపత్రం అందుకుంటున్న ప్రిన్సిపాల్

సీఎస్సీ ఇండియాతో ఎస్ఆర్‌కే నైపుణ్య శిక్షణ ఒప్పందం

ప్రసాదంపాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలో కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్ (సీఎస్సీ ఇండియా) ఉపాధి నైపుణ్య శిక్షణ అవగాహన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎస్సీ ఇండియా సలహాదారు వై.రామ్మోహన్‌రావుతో ప్రిన్సిపాల్ ఎం.ఏకాంబరం నాయుడు అవగాహన ఒప్పంద పత్రాలను పరస్పరం అందుకున్నారు.

ప్రమాదకరంగా వంతెన!

- శిథిలావస్థలో సింగన్నగూడెం - మల్లవల్లి రహదారిలో ఎట్టివాగుపై నిర్మించిన లో లెవెల్ వంతెన
- హనుమాన్ జంక్షన్ నుంచి ఆగిరిపల్లికి వెళ్లే ప్రధాన రహదారి ఇదే..
- నిత్యం వందలాది మంది ప్రయాణం
- పట్టించుకోని అధికారులు

(హనుమాన్‌జంక్షన్‌రూరల్ - ఆంధ్రజ్యోతి)

సింగన్నగూడెం-మల్లవల్లి ప్రధాన రహదారిలో ఎట్టివాగుపై నిర్మించిన లో లెవల్ వంతెన ప్రమాదకరంగా తయారైంది. వీరవల్లి-వట్టిగుడిపాడు ఆర్ అండ్ బీ రహదారిపై 6వ కిలోమీటరు వద్ద ఉన్న



కోతకు గురైన వంతెన.. మధ్యలో పడిన రంధ్రం



ఎట్టివాగుపై శిథిలమైన లో లెవల్ వంతెన

ఎట్టివాగు లో లెవెల్ వంతెన కూలి పోయేందుకు సిద్ధంగా ఉంది. ఆగిరిపల్లి వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి కాగా, సింగన్నగూడెం, మల్లవల్లి రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులు ఫ్యాక్టరీలకు తరలించేందుకు కూడా ఇదే ప్రధాన రహదారి. గత అక్టోబరులో వచ్చిన తుఫాను కారణంగా వంతెన కోతకు గురై, మధ్యలో పెద్దగొయ్యి ఏర్పడింది. హనుమాన్ జంక్షన్ నుంచి రంగన్నగూడెం, సింగన్నగూడెం మీదుగా ఆగిరిపల్లి వెళ్లే బస్సు ఇదే వంతెనపై ప్రయాణిస్తుంది. అనుకోని దుర్ఘటన ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన మధ్యలో ఏర్పడిన గొయ్యి వల్ల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతూండటంతో స్థానికులే తప్పని పరిస్థితుల్లో ప్రమాద హెచ్చరికగా ఎండిపోయిన చెట్టును అడ్డుగా నిలబెట్టారు. ఎట్టివాగుపై వంతెన కూలిపోతే రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను తరలించేందుకు సుమారు 17కిలో మీటర్లు అదనంగా ప్రయాణించాల్సి ఉంటుంది. ప్రభుత్వం రహదారుల మరమ్మతుల కోసం మంజూరు చేసిన తుఫాను నిధులను ఖర్చు చేసేసిన అధికారులకు ప్రమాదకంగా తయారైన వంతెన మాత్రం కనిపించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎట్టివాగుపై వంతెన పునర్నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రేపు కానూరులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

పెనమలూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కానూరు శ్రీరాంనగర్ కాలనీలో 29న ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేయనున్నట్లు విగ్రహ కమిటీ బాధ్యులు, టీడీపీ నాయకులు చలసాని హిమకిరణ్ తెలిపారు. ఆదివారం ఉదయం జరగనున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొని విగ్రహావిష్కరణ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కానూరులో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పార్టీ అభిమానులు హాజరై విజయవంతం చేయాలని చలసాని హిమకిరణ్ కోరారు.



కానూరులో ఆదివారం ఆవిష్కరించనున్న ఎన్టీఆర్ విగ్రహం

నేడు మల్లవల్లిలో మామిడిపై అవగాహన సదస్సు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన దిగుబడి కోసం మామిడి రైతులు తీసుకోవాలిసిన సస్యరక్షణ చర్యలు, తెగుళ్ల నివారణ తదితర విషయాలతో పాటు ఎగుమతి గురించి అవగాహన కల్పించేందుకు శనివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవనశాఖ అధికారి హరిశ్చంద్ శుక్రవారం కోరారు. మల్లవల్లి పారిశ్రామికవాడలోని (అశోక్ లేలాండ్ పరిశ్రమ ప్రక్కన) శనివారం నిర్వహించే సదస్సుకు మామిడి పరిశోధన కేంద్రం, నూజివీడుకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ కనకమహాలక్ష్మి, ఎంటమాలజిస్ట్ డాక్టర్ శాలిరాజులతో పాటు ఎగుమతిదారులు కూడా పాల్గొంటారని తెలిపారు.



మునిసిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

● మునిసిపల్ అధికారులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదేశం

పెనమలూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మునిసిపల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పోరంకిలోని తన కార్యాలయంలో ఆయన మునిసిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. మునిసిపాలిటీలో కొత్తగా వేయవలసిన పన్నులను సంక్రాంతిలోపు పూర్తి చేయాలని, కానూరు మాస్టర్ ప్లాన్ రోడ్డును రంజాన్‌లోగా పూర్తి చేయడానికి తగు చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న సీసీరోడ్లను సంక్రాంతి లోపు పూర్తి చేసి ప్రజలకు అందు బాటులోకి తేవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, అనంతనేని ఆజాద్, మునిసిపల్ కమిషనరు భవానీప్రసాద్, ఈఈ భూషణం, టీపీఓ శ్రీనివాస్, డీఈ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

యాక్షన్ ప్లాన్‌తో పదిలో ఉత్తమ ఫలితాలు

హనుమాన్‌జంక్షన్, డిసెంబ రు 27 (ఆంధ్రజ్యోతి): రానున్న పదవ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా వంద రోజుల యాక్షన్ ప్లాన్‌తో కృషి చేస్తున్నట్లు బాపులపాడు ఎంఈవో రాంబాలసింగ్ తెలిపారు. బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి వంద రోజుల పునశ్చరణ తరగతులు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన స్టడీ క్లాసులను ఎంఈవో పరిశీలించారు. హెచ్‌ఎం టీవీ.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకిస్తూ కరపత్రాల పంపిణీ

ఉంగుటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల బిగింపు, కరెంట్ సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై పడుతున్న భారంపై పార్టీలకతీతంగా అందరూ ఏకత్రాటిపైకి వచ్చి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల తీరును నిలదీయాలని సీపీఎం మండల కార్యదర్శి అజ్మీర్ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకిస్తూ, సర్దుబాటు ఛార్జీలను నిరసిస్తూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం మండల కేంద్రమైన ఉంగుటూరులో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాటూరి ప్రకాష్, బొడ్డు బాల, జుజ్జువరపు మోషే, జంగం జ్వానేష్, పోగుల ఏసు, బొకినాల రామకృష్ణ, కొడాలి జోజిబాబు తదితరులు పాల్గొన్నారు.



నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణను సత్కరిస్తున్న సింగన్నగూడెం నీటి సంఘ ఉపాధ్యక్షుడు బత్తుల సాంబశివరావు

ఆరుతడి పంటలకు సాగర్ జలాలు అందించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : బాపులపాడు మేజర్ ఆయకట్టులోని మల్లవల్లి, సింగన్నగూడెం, రేమల్లె, మీర్జాపురం మర్రిబందం తదితర గ్రామాల్లో మిర్చి, పొగాకు, తదితర ఆరుతడి పంటలకు సాగర్ జలాలు అందేలా చూడాలని నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణను రైతులు కోరారు. రంగన్నగూడెంలో శుక్రవారం ఆళ్ల గోపాలకృష్ణను కలిసిన రైతులు పుష్పగుచ్ఛం, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సింగన్న గూడెం నీటి సంఘ ఉపాధ్యక్షుడు బత్తుల సాంబశివరావు, ప్రాదేశిక సభ్యుడు కొట్టే శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ బెజవాడ వెంకట కృష్ణారావు, మరీదు తిరుపతిరావు, పలగాని వెంకట నాగేశ్వరరావు, బత్తిన గంగాధరరావు, తదితరులు పాల్గొన్నారు.

కాంటాక్ట్ లెన్స్‌ల వాడకంపై అవగాహన

పెనమలూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్ట్ లెన్స్‌ల వాడకంపై తాడిగడప ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రిలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు, కాంటాక్ట్ లెన్స్ స్పెషలిస్టు మనీష్ భగత్ మాట్లాడుతూ, కాంటాక్ట్ లెన్స్ గురించి చాలామందికి అనేక భయాలు, అపోహలు ఉన్నాయని, కాంటాక్ట్ లెన్సులనేవి వక్రీభవన లేదా చికిత్స కోసం అమర్చే వైద్య పరికరం మాత్రమేనని తెలిపారు. కళ్లజోడుతో పోలిస్తే ఇవి చక్కని కంటిచూపునిస్తాయని తెలిపారు. కంటి ఇబ్బందులు ఉన్నవారు కాంటాక్ట్ లెన్సు నిపుణుడిని సంప్రదించి కార్నియా వక్రతను ప్రాథమిక స్కాన్‌ల ద్వారా సూచించిన లెన్సు వాడాలని తెలిపారు. కాంటాక్ట్ లెన్సులను ఈత, స్నానం చేసే సమయాల్లో తీసివేయాలని, పెట్టుకునేప్పుడు చేతులను సబ్బునీటితో శుభ్రపరచుకోవాలని సూచించారు.



సదస్సులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న తహసీల్దార్ సురేశ్‌కుమార్

గండిగుంటలో రెవెన్యూ సదస్సు

ఉయ్యూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సుల్లో భూమి, ఇతర సమస్యల పరిష్కారానికి అర్జీలు అందచేసి సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.సురేశ్‌కుమార్ అన్నారు. గండిగుంట గ్రామపంచాయతీ కార్యాల యం వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించి ప్రజల నుంచి వివిధ సమస్యల పరిష్కారం కోసం 5 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సుల ఉద్దేశాన్ని ప్రజలకు తెలియచేసి సద్విని యోగం చేసుకోవాలన్నారు. ఆర్ఐ యతేంద్రియులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి

ఉయ్యూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటని ఎంపీడీవో జీఎస్‌వీ శేషగి రిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యా లయ ఆవరణలో శుక్రవారం ఆయన చిత్రపటా నికి పూలమాలవేసి రెండు నిముషాలపాటు మౌనం పాటించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : రేమల్లె, మడిచర్ల స్కూళ్లలో శుక్రవారం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి హెచ్‌ఎంలు లూథర్‌పాల్, శ్రీహరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి తెచ్చిన సంస్కరణలను విద్యార్థులకు వివరించారు.

పెద్ద మనిషి అని నమ్మితే.. భూమికే ఎసరుపెట్టాడు..!

తహసీల్దార్‌కు వృద్ధురాలు కనకదుర్గ ఫిర్యాదు

గన్నవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పెద్ద మనిషి అని నమ్మి ఖాళీ స్టాంప్ పత్రాలపై సంతకాలు చేసి ఇస్తే తమను వేధిస్తున్నాడని 70 ఏళ్ల వృద్ధురాలు తహసీల్దార్ కేవీ శివయ్య ఎదుట కన్నీరు పెట్టుకుంది. మండలంలోని సావరగూడెం గ్రామానికి చెందిన అంగజాల కనకదుర్గకు ముగ్గురు కొడుకులు. ఉమ్మడి ఆస్తి 1.09 ఎకరాలు జక్కులనెక్కలం పరిధిలో పల్లపు భూమి ఉంది. 2010లో పెద్ద కుమారుడు శ్రీనివాసరావు భార్య శ్రీలక్ష్మీ అకాల మరణం చెందింది. ఆమెకు ఇరువురు ఆడపిల్లలు వారి భవిష్యత్ కోసం తాత, అమ్మమ్మలు ఆనాడు ఆందోళన వ్యక్తం చేయడంతో కనకదుర్గతో పాటు ముగ్గురు కొడుకులు కలసి మూడవ వంతు 35 సెంట్లు భూమిని ఆ ఇద్దరి ఆడపిల్లలకు రాశారు. దాని కోసం హామీగా రూ.వంద ఖాళీ స్టాంపు పత్రంపై తనతో పాటు ముగ్గురు కొడుకులు సంతకాలు చేశారు. ఆనాటి గ్రామ సర్పంచ్ భర్త, ప్రస్తుత వైసీపీ సర్పంచ్ అయిన అట్ల నాగేశ్వరరావు సాక్షి సంతకం పెట్టారు. పెద్ద మనిషిగా మా సంతకాలు ఉన్న ఖాళీ స్టాంపు పత్రాన్ని అట్ల నాగేశ్వరరావు దగ్గర ఉంచి కోడలి ఖర్మ కాండలు పూర్తి చేసినట్లు కనకదుర్గ తహసీల్దారుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.





కూచిపూడి సిద్దేంద్ర కళాపీఠం విద్యార్థుల అభినయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాకారులు

సిద్ధేంద్రయోగికి నాట్య నీరాజనం

అట్టహాసంగా కూచిపూడి నాట్యోత్సవాలు ప్రారంభం

కూచిపూడి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కూచిపూడి హెరిటేజ్ సొసైటీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కేంద్ర సాంస్కృతిక శాఖ, రాష్ట్ర క్రియేటివ్ అండ్ కల్చర్ మిషన్ సహకారంతో సిద్ధేంద్ర కళాపీఠంలో కూచిపూడి స్వర్ణోత్సవాల పేరిట ఏర్పాటు చేసిన కూచిపూడి నాట్యోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులతో పాటు ప్రవాస భారతీయులు నాట్యప్రదర్శనలతో సిద్ధేంద్రయోగికి నాట్య నీరాజనా లు అర్పించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కూచిపూడి నాట్య కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్ చింతా రవిబాలకృష్ణ నృత్య దర్శకత్వంలో అం బాపరాకు, దేవి పరాకు, గణపతి నర్తనం అంశాలతోపాటు మోహిని భస్మాసుర నృత్యరూపకం ప్రదర్శించి ప్రేక్షకులను రంజింపచేశారు. మృణాళిని సలాది శిష్యబృందం బాలార్క కోటి అంశాన్ని కల్యాణరాగం, ఆదితాళంలో ప్రదర్శించి మెప్పించారు. పసుమర్తి మృత్యుంజయశర్మ సూర్య స్తుతి అంశాన్ని శౌరాష్ట్ర రాజ్యం, రూపకతాళంలో చూపిన హావభావాలు ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని గావించాయి. పద్మరాగిని పుట్టు బృందం పరిపాహి గణదిపా, జగదానంద కారక అంశాలను, నాగజ్యోతి శివతరంగం అంశాన్ని, జయజయదుర్గే, నారాయణ తీర్థుల తరంగం అంశాలను సుధీర్‌రావు ప్రదర్శించారు. మహాగణపతిం, ఆడరో, పాడరో అన్నమాచార్య కీర్తనను జ్వాలశ్రీ కళ ప్రదర్శించారు. పసుమర్తి రామలింగశాస్త్రి శిష్య బృందం యామినీరెడ్డి, కేపీ విశ్వనాథ్ అర్ధనారీశ్వర స్తోత్రం, అఖిలాండేశ్వరి అంశాలను ప్రదర్శించి మెప్పించారు. మాడబూసి రమణసిద్ధి శిష్యబృందం అముక్తమాల్యద నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ వేదాంతం నాగ వెంకటచలపతి కళాకారులను సత్కరించారు. సర్పంచ్ కొండవీటి విజయలక్ష్మి, కళాకారులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలు ప్రారంభించారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికారణంగా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరు కాలేకపోయారు.



మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

చిరస్మరణీయుడు మన్మోహన్‌సింగ్

- మాజీ ప్రధాని పార్థివదేహానికి ఎంపీ కేశినేని చిన్ని నివాళి

వన్‌టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): 'ఆర్థిక సంస్కరణలకు పెద్దపీట వేయడంతో పాటు, పలు రంగాల్లో కీలకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దిగ్భ్రాంతి కలిగించింది. దేశం గొప్ప దార్శనికుడిని కోల్పోయింది. ప్రధాన మంత్రిగా, కేంద్ర ఆర్థికశాఖ మంత్రిగా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) గవర్నర్‌గా, ఆర్థికవేత్తగా దేశానికి మన్మోహన్‌సింగ్ అందించిన సేవలు చిరస్మరణీయం. ఆయన మరణం దేశానికి తీరనిలోటు.' అని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. శుక్రవారం ఢిల్లీలో మన్మోహన్‌సింగ్ పార్థివదేహానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సహచర ఎంపీలతో కలిసి కేశినేని చిన్ని నివాళులర్పించారు. మన్మోహన్ సతీమణి గురుశరణ్ కౌర్‌తో పాటు కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

క్రీడలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట

- సౌత్‌జోన్ ఆక్వాటిక్స్ పోటీల ప్రారంభోత్సవంలో శాప్ చైర్మన్ రవినాయుడు



మాట్లాడుతున్న రవినాయుడు

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): క్రీడలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని, అందుకు అనుగుణంగా అంకితభావంతో పనిచేస్తున్నామని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు స్పష్టం చేశారు. నగరంలోని గాంధీనగర్ సర్‌విజ్జీ వీఎంసీ స్విమ్మింగ్‌పూల్‌లో 35వ సౌత్‌జోన్ ఆక్వాటిక్స్ చాంపియన్‌పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లా అమెచ్యూర్ ఆక్వాటిక్స్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో ఆరు రాష్ట్రాల స్విమ్మర్లు పాల్గొన్నారు. నేషనల్ ఆక్వాటిక్స్‌లో సత్తా చాటి పతకాలు సాధించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలను రవినాయుడు అందజేశారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ పోటీల్లో 600 మంది స్విమ్మర్లు పాల్గొంటు న్నారని కార్యనిర్వాహక కార్యదర్శి ఐ.రమేష్ తెలిపారు. డీఎస్‌డీవో ఎస్ ఏ అజీజ్, ఆక్వాటిక్స్ రాష్ట్ర అధ్యక్షుడు పి.గోవిందరాజు, కార్యదర్శి ఎ.మోహన్ వెంకటరామ్, కృష్ణాజిల్లా ఆక్వాటిక్స్ చైర్మన్ యలమంచిలి వెంకటసురేష్, స్విమ్మింగ్ అసోసియేషన్ చైర్మన్ రమేష్ జైన్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ కొంగర రవికాంత్, వీఎంసీ స్పోర్ట్సు అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



అంతరాలయంలో భక్తులు

దుర్గగుడిలో భక్తుల రద్దీ

వన్‌టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు కుటుంబాలతో సహా తరలివచ్చారు. అమ్మవారికి తలనీలాలు సమర్పించుకుని, కృష్ణానదిలో పవిత్రస్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి కొండపైకి చేరుకున్నారు. పొంగళ్లు సమర్పించారు. నిత్య ఆర్జిత సేవలైన అమ్మవారి ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, చండీహోమం, శాంతి కల్యాణం కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం శీఘ్రంగా అయ్యేందుకు ఈవో రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజులు, సిబ్బంది ప్రణాళిక ప్రకారం క్యూలైన్లలో భక్తులను పంపారు.

విజయవాడ రైల్వే డివిజన్‌లో రూ.79.60 కోట్ల స్క్రాప్ విక్రయాలు

వన్‌టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ రూ.79.60 కోట్ల స్క్రాప్ విక్రయించిందని, లక్ష్యాన్ని అధిగమించిందని డివిజన్ రైల్వే కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. '2024- 25 ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు 25 నాటికి 14,272 మెట్రిక్ టన్నుల స్క్రాప్ మెటీరియల్‌ను విక్రయించింది. రూ.79.60 కోట్లు ఆర్జించింది. రైలు స్క్రాప్, ఎస్, టీ, ఇంజనీరింగ్ వ్యర్థాలు, ఇనుము, ఉక్కు, ఇతర లోహాల స్క్రాప్‌ను విక్రయించటం ద్వారా ఆర్థిక సంవత్సరం ముగియడానికి మూడు నెలల ముందుగానే నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాం.' అని కార్యాలయం పేర్కొంది. సీనియర్ డివిజనల్ మెటీరియల్స్ మేనేజర్ కె.బి.తిరుపతయ్యను డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అభినందించారని, డివిజన్‌ను స్క్రాప్‌రహితంగా తీర్చిదిద్దాలని సూచించారని తెలిపింది.

నగరంలో కార్లు, ద్విచక్రవాహనాలు అనే తేడా లేకుండా ఎల్ఈడీ లైట్ల వినియోగం పెరిగిపోతోంది. వాహనాల రీమోడలింగ్‌లో భాగంగా హెడ్ లైట్ల కోసం ఎల్ఈడీ బల్బులను వినియోగిస్తున్నారు. ఎల్ఈడీ లైట్ల వినియోగాన్ని అధికారులు నియంత్రించలేకపోవడంతో రీమోడలింగ్ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఎక్కువ కాంతినిచ్చే ఎల్ఈడీ లైట్ల వినియోగంలో నియంత్రణ ఉంది. కానీ అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో అధిక సంఖ్యలో వాహనదారులు కంపెనీ అమర్చిన లైట్లు కాకుండా రెండు హెడ్‌లైట్లకు మధ్య ఎక్కువ కాంతినిచ్చే ఎల్ఈడీ లైట్లు అమరుస్తున్నారు. ఇలా అమర్చడం మోటార్ వెహికల్ యాక్టు ఉల్లంఘన అవుతుంది.



కారుకు ఏర్పాటు చేసిన ఎల్ఈడీ లైట్, వాహనాన్ని రీమోడలింగ్ చేస్తున్న మెకానిక్‌లు



ప్రమాదాలకు దారిచూపేలా..

వాహనాల్లో హైబీమ్ ఎల్ఈడీ లైట్ల వినియోగం

- లైట్ల నుంచి వస్తున్న కాంతి తీవ్రతకు ఎదురుగా వస్తున్న వాహనదారులకు మసకబారుతున్న కళ్లు
- మోటార్ వెహికల్ యాక్టు ఉల్లంఘిస్తున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి-ఆటోనగర్): నగరంలో కొందరు వాహనయజమానులు కొత్తగా తీసుకున్న కార్లకు, ద్విచక్ర వాహనాలకు ఇష్టారీతిన రీమోడలింగ్ చేసేస్తున్నారు. బీఎస్-6 వాహనాలకు హెడ్‌లైట్లు మార్చే అవకాశం లేదు. దీంతో కొందరు అదనపు లైట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. కంపెనీలు తయారు చేసి ఇచ్చే ఎల్ఈడీ లైట్ల వల్ల ఎలాంటి సమస్య ఉండదని, రీమోడలింగ్ పేరుతోనో, లైటింగ్ సరిగా లేదనో మార్చుకునే అధిక కాంతినిచ్చే లైట్ల వల్లేనే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఇన్సూరెన్స్ క్లయిమ్‌లో ఇబ్బందులు

ఎల్ఈడీ లైట్ల వల్ల ఇన్సూరెన్స్ క్లయిమ్‌లోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు నియమ నిబంధనలు ప్రకారం క్లయిమ్‌లు తిరస్కరణకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని ఇన్సూరెన్స్ కంపెనీలు చెబుతున్నాయి. సాధారణ ఎల్ఈడీ లైట్ల అమరికలో వాహనదారులు, తయారీ సంస్థలకూ ఎలాంటి ఆంక్షలు లేవు.

ఎల్ఈడీల వాడకం పెరగడానికి కారణాలు

ఎల్ఈడీ హెడ్‌లైట్లను వినియోగించడం వల్ల దూరంగా ఉన్నవి స్పష్టంగా కనిపిస్తాయని, బ్యాటరీ పవర్ ఆదా అవుతోందని ఎల్ఈడీ లైట్ల వోల్ట్స్‌ని బట్టి బ్యాటరీ వినియోగం మారుతుందని వాహనదారులు చెబుతున్నారు. కానీ, ఎక్కువ వోల్ట్స్ పవర్ ఉన్న లైట్లను వినియోగిస్తే బ్యాటరీల మన్నిక తగ్గుతుందని మెకానిక్‌లు చెబుతున్నారు. కొంత మంది తమ వాహనాలు ఆకర్షణీయంగా కనిపించేందుకు ఈ లైటింగ్ సిస్టమ్‌ను వాడుతున్నారు. కార్ల లోపల రీమోడలింగ్ చేయిస్తున్నారు. వాహనంలో గీతాలు వినేటప్పుడు శబ్దానికి అనుగుణంగా లైట్లు వెలిగేలా మార్పులు చేయిస్తున్నారు. కార్ల కంపెనీలు అందించే ఫాగ్ ఎల్ఈడీ ల్యాంపులు సైతం మార్చేస్తున్నారు. తమ వాహనాలు ఆకర్షణీయంగా కనిపించాలని హంగులు ఆర్భాటాలతో ఇతరుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నారు.

హైబీమ్ ఎల్ఈడీ లైట్లతో ప్రమాదమే..

రాత్రి వేళల్లో సింగిల్ రహదారిలో ఎక్కువ కాంతినిచ్చే ఎల్ఈడీ లైట్లున్న వాహనాలు వచ్చినప్పుడు కళ్లు మసకబారి ఎదురుగా వచ్చే డ్రైవర్లు ఇబ్బంది పడుతుంటారు. వేగంగా వెళ్లేటప్పుడు వాహనాన్ని నియంత్రించడం కష్టమవుతుంది. దీంతో కొంతమంది వాహనదారులు ఆకస్మాత్తుగా బ్రేకులు వేయడం, మరికొంత మంది వేగాన్ని నియంత్రిచడానికి రహదారి పక్కకు వెళ్లడం జరుగుతోంది. ఇలాంటి సందర్భాల్లోనే ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాహనదారులు లోబీమ్ లైట్లను వినియోగిస్తే ప్రమాదాలు నియంత్రించవచ్చని చెబుతున్నారు.

లైటింగ్ సిస్టం బాగున్నా..కావాలనే పెట్టుకుంటున్నారు

కొత్త రకం కార్లకు లైటింగ్ సిస్టం బాగానే ఉంటుంది. కానీ కొంతమంది ఎక్కువ కాంతినిచ్చే లైట్లు కావాలని మార్చుకుంటారు. ఇప్పుడు వస్తున్న వాహనాలకు హెడ్‌లైట్లు మార్చడం కుదరదు. కానీ ఎక్కువ కాంతినిచ్చే లైట్లను విడిగా అమర్చవచ్చు. దీనిపైన మాకు ఎలాంటి నియంత్రణ ఉండదు. ఎల్ఈడీ బల్బుల్లో మోడల్, వోల్ట్స్‌ని బట్టి వాటి ధర రూ.8 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుంది. లగ్జరీ కార్లకు ఇంటీరియల్ లైటింగ్ సిస్టమ్ కూడా పెట్టుకుంటున్నారు.

-సంతోష్, మెకానిక్

ప్రమాదమే.. అయినా వినియోగదారులు పట్టించుకోరు

ఎల్ఈడీ బల్బులు కేవలం కాంతి కోసమే వినియోగించడం లేదు. బయట బిగించే లైటింగ్ ఆకర్షణీయంగా ఉండాలని, వాహనం కదిలినప్పుడు ఓ రకంగా, పాటలు వినేటప్పుడు మరో రకంగా వెలిగేలా ఉండాలని, ఇతరులు తమ వాహనం వెళ్తుంటే చూడాలని వినియోగదారుడు కోరుకుంటున్నాడు. అందు కోసమే ఎల్ఈడీ బల్బులు పెట్టుకుంటున్నారు. వినియోగదారులను సంతృప్తి పరచడమే మా ప్రాధాన్యం. ఎల్ఈడీ లైటింగ్ వల్ల ఇతరుల ప్రాణాలకు ప్రమాదమే. కానీ వినియోగదారులు అది ఆలోచించరు.

-మహేశ్వరరావు, మెకానిక్

లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీని ప్రైవేట్ పరం చేయొద్దు

- సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ డిమాండ్



ఆటో మోటారు కార్మికుల సమస్యలపై లెనిన్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ నేతలు, కార్మికులు

గవర్నర్‌పేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీని ప్రైవేట్‌పరం చేయడం వల్ల మోటారు రంగ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు కె.దుర్గారావు అన్నారు. లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడాన్ని నిరసిస్తూ ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం లెనిన్ సెంటర్‌లో ఆటో కార్మికులు ధర్నా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా ఆటో మోటారు రంగ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం వల్ల మోటారు కార్మికులపై మరింత భారం పడుతుందని, ప్రజలకు రక్షణ లేకుండా పోతుందని ఆయన అన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేయాలని, ప్రభుత్వ అధీనంలోనే వీటి జారీ విధానం ఉండాలని కోరారు. ఆటో కార్మికుల కుటుంబాలు సరైన కిరాయిలు లేక పూట గడవడమే కష్టంగా మారిందని, ఎన్నికల ముందు టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకుని ఆటో, మోటారు కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తూర్పు సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.రూబెన్‌కుమార్, సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, సిటీ వర్కర్స్ యూనియన్ నాయకులు కోటయ్య, నాగబ్రహ్మం, సూర్యనారాయణ పాల్గొన్నారు.

వీఆర్‌లోకి ఎస్ఎన్‌పురం ఇన్‌స్పెక్టర్

- కొత్త ఇన్‌స్పెక్టర్‌గా లక్ష్మీనారాయణ

విజయవాడ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సత్యనారాయణపురం ఇన్‌స్పెక్టర్ వై.బాలరాజాజీని వీఆర్‌లోకి పంపుతూ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాలరాజాజీ తరచుగా సెలవులు పెడుతుండడంతో సీపీ ఈ నిర్ణయం తీసుకున్నారు. విజయవాడలో ఉన్న ముఖ్యమైన పోలీసు స్టేషన్లలో సత్యనారాయణపురం ఒకటి. కీలకమైన ఈ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా ఉన్న అధికారి తరచుగా సెలవుల్లో వెళ్లడం వల్ల ఇబ్బందిగా ఉంటోందని అధికారులు సీపీకి వివరించారు. ఇంతకుముందు రాజాజీ సెలవులో వెళ్లారు. తాజాగా ఈనెల 23 నుంచి నెల రోజులపాటు మెడికల్ లీవ్ పెట్టారు. అప్పటి వరకు ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌ను నియమించడం కంటే కొత్త ఇన్‌స్పెక్టర్‌ను నియమించడం మంచిదన్న నిర్ణయానికి పోలీసు కమిషనర్ వచ్చి రాజాజీని వీఆర్‌లోకి పంపారు. ఖాళీ అయిన ఈ స్థానంలోకి సీసీఎస్‌లో ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఎస్వీవీ లక్ష్మీనారాయణను నియమించారు. లోగడ ఈయన అజిత్‌సింగ్ పీఎస్, పోలీసు కంట్రోల్ రూంలో పనిచేశారు. దీనితోపాటు మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ప్రస్తుతం సైబర్ సెల్‌లో ఉన్న వి.జానకిరామయ్యకు ట్రాఫిక్ -2 ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. నందిగామ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న కె.సతీష్‌ను సీసీఎస్‌లో నియమించారు.

ప్రజలపై విద్యుత్ భారం.. జగన్ కమీషన్ల పాపమే

- తప్పుడు పనులు చేసింది చాలక చార్జీలు పెంచారంటూ ఆందోళనలా
- వైసీపీపై టీడీపీ నేత లుక్కా సాయిరాం ప్రసాద్‌గౌడ్ ఆగ్రహం

వన్‌టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగన్మోహన్‌రెడ్డి కమీషన్ల కోసం చేసిన తప్పుడు పనుల కారణంగానే ప్రజలపై ట్రూ అప్ చార్జీల భారం పడుతోంది. కూటమి ప్రభుత్వం విద్యుత్‌చార్జీలు పెంచలేదు. విద్యుత్ చార్జీలు పెంచారంటూ వైసీపీ నాయకులు ఆందోళనలు చేయడం సిగ్గుచేటు.' అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. విజయవాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ హయాంలో తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెరిగాయన్నారు. సెకీ ద్వారా విద్యుత్ కొనుగోలు ధరల్లో వ్యత్యాసాలను వివరించారు. జగన్‌రెడ్డి కమీషన్లకు కక్కుర్తిపడి రూ.1,750 కోట్లు లంచం తీసుకున్నట్లు అమెరికా ఎఫ్‌బీఐ కేసు నమోదు చేసి అధికారికంగా ప్రకటించిందని లుక్కా సాయిరాం ప్రసాద్‌గౌడ్ ఆరోపించారు.

హైందవ శంఖారావం జయప్రదం చేయండి

- బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ పిలుపు



హైందవ శంఖారావం కార్యక్రమ కరపత్రాలను విడుదల చేస్తున్న బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, వీహెచ్‌పీ నేతలు

వన్‌టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలన్న డిమాండ్‌తో జనవరి 5న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడకు సమీపంలోని కేసరపల్లిలో నిర్వహిస్తున్న హైందవ శంఖారావం సభను జయప్రదం చేయాలని బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ పిలుపునిచ్చారు. భవానీపురంలోని ఎన్డీయే కార్యాలయంలో శుక్రవారం ప్రచార వాహనాలకు ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కరపత్రాలను విడుదల చేశారు. ప్రతి హిందువు హైందవ శంఖారావం సభకు హాజరుకావాలని, ఆలయాల వ్యవస్థను రక్షించుకునేందుకు ఏకం కావాలని పిలుపునిచ్చారు. వైసీపీ పాలనలో హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ అమానుషంగా ప్రవర్తించారన్నారు. దేవాలయాలపై ప్రభుత్వ అజమాయిషీని పూర్తిగా తొలగించాలని వీహెచ్‌పీ సహాయ కార్యదర్శి కొంపల్లి శ్రీనివాసరావు డిమాండ్‌చేశారు.

గనుల శాఖలో

తిమింగలం తిష్ఠ

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వంలో ఇసుకతో పాటు కీలకమైన మినరల్స్ విషయంలో ఆయన అడ్డగోలుగా వ్యవహరించారు. గనుల శాఖ వ్యవహారాల్లో తెర మీద వెంకటరెడ్డి కనిపిస్తే, తెరవెనుక నడిపించిందంతా ఈ అధికారే. ఇటు గనుల శాఖ, అటు ఏపీఎండీసీ వ్యవహారాల్లో వేలు పెట్టారు. నాటి ముఖ్యమంత్రి జగన్ కార్యాలయంలో ఉన్న వసూల్‌రాజాతో ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయి. నాటి గనుల శాఖ మంత్రికి అత్యంత ప్రియశిష్యుడు. ఇసుక, క్వార్ట్జ్, ఇతర మినరల్స్ లీజులు, వాటిపై విజిలెన్స్ దాడులు వంటి అనేకానేక అంశాల్లో ఆయన పాత్ర కీలకమని ఆ శాఖ వర్గాలే కోడైకూశాయి. పెద్దిరెడ్డికి, వెంకటరెడ్డికి మధ్య కోల్డ్‌వార్‌కు ఆయన చర్యలే కారణమని అప్పట్లో చర్చ జరిగింది.

సర్కారు ఆదేశాలూ బేఖాతర్

ప్రభుత్వ ఆదేశాలను కూడా ఆ అధికారి ధిక్కరించారు. శ్రీకాకుళం జిల్లాలో ఓ లీజుదారుడు తప్పులు చేశారని, ఆయనకు రూ.240 కోట్ల మేర డిమాండ్ నోటీసు ఇవ్వాలని నాటి జగన్ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అయితే ఆ అధికారి డిమాండ్ నోటీసు ఇవ్వకుండా 45 రోజుల పైనే ఉత్తర్వును దాచిపెట్టారు. ఈ లోగా ఆ కంపెనీ ప్రతినిధి హైకోర్టుకు వెళ్లారు. అంతేగాక ఆ కంపెనీ ప్రతినిధి తరచుగా ఆ అధికారి ఆఫీసుకు రావడం, ఇంటికి వెళ్లడం, రహస్య సమావేశాలు నిర్వహించడం వంటివి జరిగాయి. గత ప్రభుత్వం నిఘా విభాగం ద్వారా ఈ విషయం గుర్తించింది. సీసీటీవీ డేటా తెప్పించుకొని పరిశీలించింది. ఆ తర్వాత ఆ అధికారిపై చర్యలు తీసుకుంది.

ఎన్నో అక్రమాలు

గత ప్రభుత్వంలో జేపీ వెంచర్స్‌కు ఇసుక కాంట్రాక్ట్ ఇవ్వడానికి ముందు గనుల శాఖే స్వీయ పర్యవేక్షణ చేసేది. ఆ సమయంలో ఆ అధికారి ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారు. లీజులు ఇవ్వడం, మాట వినని వారిపై సైలెంట్‌గా విజిలెన్స్ దాడులు చేయించి భయభ్రాంతులకు గురి చేయడం, ఆ తర్వాత వారిని ఇంటికి పిలిపించుకొని సెటిల్ చేయడం.. ఇదీ ఆయన వ్యవహారం.

సార్‌ను కలవలేదని...

కూటమి సర్కారు వచ్చాక అన్ని రకాల మినరల్స్ పర్మిట్లను నిలిపి వేసింది. ఇందుకు కారణం గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు, అవకతవకలే. వాటిని సమీక్షించి పరిష్కరించడానికి తాత్కాలికంగా పర్మిట్లు నిలిపివేసింది. గత ప్రభుత్వం నాటి గనుల అక్రమాలపై స్పష్టత వచ్చాక కీలకమైన ఖనిజాల పర్మిట్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఒక్క నెల్లూరు జిల్లా మినహా రాష్ట్రమంతా క్వార్ట్జ్‌కు పర్మిట్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇది జరిగి చాలా రోజులు అవుతోంది. అయితే ఇంతవరకు ప్రభుత్వ ఆదేశం కార్యరూపం దాల్చలేదు. కారణం ఏంటంటే.. లీజుదారులు వచ్చి సార్‌ను కలవలేదట. విషయం తెలియని లీజుదారులు ప్రభుత్వం తమకు తీవ్ర అన్యాయం చేస్తోందని గగ్గోలు పెడుతున్నారు. పర్మిట్లు ఇవ్వకపోవడం వల్ల అటు లీజుదారులకు, ఇటు ప్రభుత్వానికి కూడా తీరని నష్టమే. పర్మిట్లు ఇస్తే ప్రభుత్వానికి, లీజుదారులకు ఆదాయం వస్తుంది. మరి తనకేం వస్తుంది? ఏదో ఒకటి రావాలి కదా? అన్నట్టు ఆయన వ్యవహరిస్తున్నారు.


పెద్దిరెడ్డి అండతో...

గత ప్రభుత్వంలో మంత్రి పెద్దిరెడ్డి అండతో గనుల శాఖలో ఆ అధికారి చేయని అరాచకమంటూ లేదని చెబుతున్నారు. లీజుదారులను వేధించడంలో ఆయన ఘనాపాటి అని విజిలెన్స్ అధికారులు చెబుతున్నారు. ఒంగోలుకు చెందిన ఓ గ్రానైట్ మైనింగ్ కంపెనీ నుంచి ఆయన గట్టిగా పిండుకున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై విచారణ జరగకుండా నాటి మంత్రి మోకాలడ్డారన్న ఆరోపణలున్నాయి.

కూటమి పాలనలోనూ అండ

కూటమి సర్కారు వచ్చాక కూడా ఈ అధికారి పాత్ర, జోరు తగ్గడం లేదు. పైరవీలు చేయించుకుంటూ ఇంకా గనుల శాఖలోనే కొనసాగుతున్నారు. గత ప్రభుత్వంలో తీవ్ర ఆరోపణలున్న అధికారులను కూటమి ప్రభుత్వం తప్పనిసరి సెలవుపై పంపిస్తోంది. జూలైలోనే ఆయన్ను బయటకు పంపాలని చూడగా ఆ జాబితాలో తన పేరు లేకుండా చూసుకున్నారు. ఆ తర్వాత ఆగస్టులో రూపొందించిన 26 మంది అధికారుల జాబితాలో ఆయన పేరుంది. అప్పుడు ఓ మంత్రితో ప్రభుత్వ పెద్దలకు చెప్పించుకొని బయటపడ్డారు. ఇప్పుడు మూడో దఫా 17 మందిని సెలవుపై పంపించాలని సర్కారు నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన జాబితాలో ఈయనదే తొలిపేరు. ఈ విషయం తెలుసుకున్న ఆయన ఓ ఇద్దరు అమాత్యులు, అనకాపల్లికి చెందిన మరో కీలక నేతను ఆశ్రయించారు. నేరుగా ప్రభుత్వ పెద్దల వద్ద పైరవీలు చేయించుకున్నారు. 'ఆ అధికారి మనకు కావాల్సినవాడు. చాలా మంచివాడు, సౌమ్యుడు' అంటూ వారితో సర్టిఫికెట్ ఇప్పించుకున్నారు. ఆయనతో తమకు పనులున్నాయని, కదిలించడానికి వీల్లేదంటూ పెద్దలు శాయశక్తులా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయనపై ఏ విచారణ వేయవద్దని, ఏ కోణంలోనూ టచ్ చేయవద్దని ఇద్దరు మంత్రులు, మరో ప్రజాప్రతినిధి ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో ఆయన్ను బయటకు పంపించే కార్యక్రమం ప్రస్తుతానికి వాయిదా పడింది. కేవలం ఈ అధికారి కారణంగానే, మిగిలిన అధికారులపై చర్యలు తీసుకోలేకపోతున్నట్లు తెలిసింది. 17 మంది అధికారులతో కూడిన జాబితాలో నుంచి ఆయన పేరు తప్పించి విగిలినవారిని సెలవుపై పంపిస్తారా? లేక మొత్తం ప్రక్రియనే నిలిపి వేస్తారా? అన్న చర్చ జరుగుతోంది.

రాజకీయాలకు సెలవు: ఇంతియాజ్



విజయవాడ (పటమట), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): 'నేను రాజకీయాల నుంచి వైదొలుగుతున్నా. ప్రజాసేవే పరమావధిగా ముందుకు సాగుతా' అని మాజీ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ అహ్మద్ ప్రకటించారు. విజయవాడలోని తన నివాసంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఐఏఎస్ సర్వీస్ నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ చేసి రాజకీయాల్లోకి వచ్చాను. కర్నూల్ నుంచి వైసీపీ ఎమ్మెల్యేగా పోటీ చేశా. ఫలితాలు అందరికీ తెలుసు. గత కొంత కాలంగా బంధుమిత్రులు, శ్రేయోభిలాషులతో చర్చించి రాజకీయాలకు దూరంగా ఉంటున్నా. రాబోయే రోజుల్లో సామాజిక అసమానతలను, రుగ్మతలను రూపుమాపేందుకు, పర్యావరణ కాలుష్యం తగ్గించేందుకు పనిచేసే స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నా' అని ఇంతియాజ్ అహ్మద్ తెలిపారు.

తెలంగాణలో 'కిక్కు' తగ్గింది!



- ఏపీ బోర్డర్ జిల్లాల్లో తగ్గిన మద్యం ఆదాయం
- ఆరు జిల్లాల్లో విక్రయాలపై తీవ్ర ప్రభావం
- డిసెంబరులో రూ.40 కోట్లు తగ్గిన రాబడి
- ఆర్థిక సంవత్సర టార్గెట్‌పైనా ప్రభావం?
- రూ.300 కోట్ల ఆదాయం తగ్గే అవకాశం?
- ఏపీలో కొత్త మద్యం విధానం రావడంతోనే!

హైదరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌తో సరిహద్దులో ఉన్న జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ చౌరస్తాలో మూడు మద్యం దుకాణాలు నిత్యం కిటకిటలాడుతూ ఉండేవి. ఏపీ నుంచి మద్యం ప్రియులు పెద్దఎత్తున ఇక్కడికి వచ్చేవారు. రద్దీని తట్టుకోలేక, ఉన్న స్టాక్ అందరికీ సర్దాలన్న లక్ష్యంతో రేషన్‌కార్డులు తేవాలన్న నిబంధన కూడా అమలు చేశారు! ఒక్క కార్డుపై ఒక్క బాటిల్ మాత్రమే ఇచ్చేవారు! ఆదివారం, సెలవు రోజుల్లో అయితే రద్దీని నియంత్రించేందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసేవారు! పక్క రాష్ట్రం నుంచి వచ్చే వారికోసం ఇక్కడి వైన్ షాపుల చుట్టుపక్కల పదుల సంఖ్యలో దాబాలు వెలిశాయంటేనే రద్దీని అంచనా వేయొచ్చు. తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ సరిహద్దు జిల్లాల్లో రెండు నెలల కిందటి పరిస్థితి ఇది! కానీ, ఇప్పుడు సీన్ రివర్స్ అయింది! సరిహద్దుల్లోని మద్యం షాపులు ఇప్పుడు మందుబాబుల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ఆయా దుకాణాల్లో విక్రయాలు పెంచుకునేందుకు ఎక్సైజ్ శాఖ చెమటోడ్చాల్సి వస్తోంది. ఇలా నాగర్‌కర్నూలు, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లోని అన్ని సరిహద్దు మండలాల్లో ఇలాంటి పరిస్థితే ఉంది. ఈ ఆరు జిల్లాల్లో ఈ నెల (డిసెంబరు) 23 రోజుల్లోనే రూ.40 కోట్ల ఆదాయం తగ్గిందని ఆబ్కారీ శాఖ గణాంకాలు పేర్కొంటున్నాయి.

తెలంగాణ బ్రాండ్లన్నీ ఏపీలో..: గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో నాణ్యమైన మద్యం కోసం మందుబాబులు నానా ఇబ్బందులు పడ్డారు. అక్కడ బ్రాండెడ్ మద్యం అందుబాటులో లేకపోవడంతో తెలంగాణ వైపు వచ్చేవారు. ముఖ్యంగా సరిహద్దు జిల్లాల్లో నిత్యం పెద్దఎత్తున ఏపీ నుంచి మద్యం కోసం ఇక్కడికి వచ్చేవారు. గద్వాల, నాగర్‌కర్నూలు, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల సరిహద్దు మండలాల్లోని మద్యం దుకాణాల్లో విక్రయాలు ఎక్కువగా జరిగేవి. రాష్ట్రంలో ఎక్కువ మద్యం విక్రయాలు జీహెచ్ఎంసీ పరిధిలోని మద్యం దుకాణాల్లో జరిగేవి. కానీ, సరిహద్దు జిల్లాల్లోని దుకాణాల్లో మాత్రం గతంలో హైదరాబాద్‌లోని దుకాణాలకు మించి అమ్మకాలు జరిగేవి. దీంతో అక్కడ స్టాక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించేది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ లక్ష్యాలను అందుకోవడం వెనక సరిహద్దు జిల్లాలు కీలక పాత్ర పోషించాయి. అయితే ఇప్పుడు పరిస్థితి మారింది. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడ్డ ఎన్డీయే ప్రభుత్వం కొత్త మద్యం విధానాన్ని ప్రకటించింది. ఇది అక్టోబరు-15 నుంచి అమల్లోకి వచ్చింది. ఇప్పుడు అక్కడ తెలంగాణలో లభించే అన్ని బ్రాండ్ల మందు అందుబాటులో ఉంది. నకిలీ మద్యాన్ని అరికట్టేందుకు బ్రాండెడ్ లిక్కర్ క్వార్టర్ రూ.99కే విక్రయిస్తున్నారు. దీంతో ఏపీ నుంచి మద్యం కోసం తెలంగాణ సరిహద్దుల్లోకి వచ్చే మందుబాబుల సంఖ్య ఒక్కసారిగా తగ్గిపోయింది. అక్టోబరు నుంచి తెలంగాణ సరిహద్దు మండలాలపై ఈ ప్రభావం కనిపిస్తోంది. నవంబరులో విక్రయాలు తగ్గగా.. డిసెంబరులో తేడా స్పష్టంగా కనిపిస్తోంది.

ఖజానాకు రూ.300 కోట్లు గండి..

ఈ నెల 23 వరకు ఆరు సరిహద్దు జిల్లాల పరిధిలో దాదాపు రూ.40 కోట్ల మేర ఆదాయం తగ్గింది. ముఖ్యంగా ఆబ్కారీ శాఖకు ఆదాయం ఎక్కువగా దసరా, నూతన సంవత్సరం సందర్భంగా వస్తుంది. ఈసారి సరిహద్దుల్లో కొత్త సంవత్సర ఆదాయం కూడా గణనీయంగా తగ్గనుంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈసారి సరిహద్దు జిల్లాల్లో రూ.300 కోట్ల ఆదాయం తగ్గే అవకాశాలున్నాయని అంచనా. రాష్ట్ర ఖజానాకు ఎక్సైజ్ శాఖ వెన్నెముక లాంటిది. ఈ శాఖ నుంచి ఏటా ప్రభుత్వం ఆశించినదానికంటే ఎక్కువ ఆదాయం వస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మద్యం విక్రయాల ద్వారా రూ.25617 కోట్లు సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటి వరకు ప్రతినెలా వస్తున్న ఆదాయం ప్రకారం.. మార్చితో ముగియనున్న ఆర్థిక సంవత్సరం నాటికి అంచనా వేస్తే లక్ష్యానికి రూ.2 వేల కోట్ల దూరంగా ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. మద్యం ధరలు 5-10 శాతం పెంచాలని ధరల నిర్ణయ కమిటీ సూచించినా ప్రభుత్వం పెంచలేదు. ధరలు పెంచకుండా ఈ లక్ష్యాన్ని సాధించడం కష్టమన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో సరిహద్దు జిల్లాల్లో మద్యం విక్రయాలు తగ్గడం ప్రభుత్వాన్ని మరింత ఆందోళనకు గురిచేస్తున్న అంశం. దీన్ని అధిగమించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకునే అవకాశాలున్నట్లు సమాచారం.

మధిర.. రెండో స్థానం నుంచి చివరికి..

ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతమైన ఖమ్మం జిల్లా మధిరలో ఈ ఏడాది డిసెంబరులో మద్యం అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. మధిర ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాల్లో 20 మద్యం దుకాణాలు ఉన్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది 59 శాతం మద్యం విక్రయాలు తగ్గాయి. గత ఏడాది డిసెంబరులో రూ.20.49 కోట్ల మద్యం అమ్మకాలతో మధిర ఎక్సైజ్ స్టేషన్ జిల్లాలోనే రెండో స్థానంలో నిల్చింది. అలాంటిది ఈ ఏడాది డిసెంబరులో (25వ తేదీ వరకు) రూ.8.45 కోట్ల వ్యాపారం మాత్రమే జరిగినట్లు ఎక్సైజ్ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఏపీలో మద్యం నాణ్యత లేకపోవడం, అన్ని రకాల మద్యం కంపెనీలు అందుబాటులో లేకపోవడం, అధిక ధరలు ఉండడంతో ఏపీ ప్రజలు ఎక్కువగా తెలంగాణ మద్యం తాగేవారు. తాజాగా ఏపీలో ప్రభుత్వం మారడంతోపాటు మద్యం విధానం కూడా మారింది. అక్కడా నాణ్యమైన మద్యం దొరుకుతోంది. దీంతో ఏపీ నుంచి మందుబాబుల రాక బాగా తగ్గిపోయింది. రెండేళ్ల కిందట మద్యం విక్రయాల్లో ఖమ్మం జిల్లాలోనే రెండో స్థానంలో నిలిచిన మధిర.. ఇప్పుడు చివరి స్థానానికి పడిపోయింది. గతంలో మద్యం అమ్మకాల్లో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచిన ఖమ్మం జిల్లా ఈ ఏడాది 28వ స్థానానికి పడిపోయినట్లు సమాచారం.




గతంలో ఏపీ నుంచి వచ్చిన జనంతో కిటకిటలాడుతున్న అలంపూర్ చౌరస్తాలోని ఓ వైన్ షాప్ (ఫైల్)

చిత్రజ్యోతి

SINCE 1965

అల్లు అర్జున్‌తో పోల్చొద్దు

అమితాబ్ బచ్చన్



అమితాబ్ బచ్చన్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తోన్న షో 'కౌన్ బనేగా కరోడ్‌పతి'. ప్రస్తుతం దీని 16వ సీజన్ ప్రసారమవుతోంది. తాజా ఎపిసోడ్‌లో కంటెస్టెంట్‌గా పాల్గొన్న ఓ గృహిణి మాట్లాడుతూ 'తనకు అమితాబ్, అల్లు అర్జున్ అంటే ఎంతో ఇష్టమని అన్నారు. దీనికి వెంటనే అమితాబ్ స్పందిస్తూ ' అల్లు అర్జున్ తనకు వచ్చిన గుర్తింపులన్నింటికీ అర్హుడు. నేను కూడా అతనికి వీరాభిమానినే. ఇటీవల బన్నీ నటించిన పుష్ప-2 సినిమా మంచి విజయం సాధించింది. మీరు ఇంకా ఆ సినిమా చూడకుంటే వెంటనే చూడండి. అతడు గొప్ప ప్రతిభావంతుడు. అతనితో నన్ను పోల్చొద్దు' అని అన్నారు. ఈ వీడియో క్లిప్‌ను సోనీ టీవీ తన అధికారిక వెబ్ పేజీలో షేర్ చేయగా వైరల్ అయ్యింది.



అజిత్ ఫాస్ట్ బీట్ సాంగ్

అజిత్‌కుమార్ హీరోగా మగిళ్ తిరుమేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'విడాముయర్చి'. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై జి.కె.ఎం.తమిళ్ కుమరన్ నేతృత్వంలో సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. అర్జున్, త్రిష కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలవుతోంది. రీసెంట్‌గా విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. దాంతో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. తాజాగా ఈ మూవీ నుంచి 'సవదీకా' అనే ఫాస్ట్ బీట్ ఎనర్జిటిక్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఆంథోని దాసన్ పాడిన పాటకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు.

రాజుగారి పెళ్లి



నవీన్ పొలిశెట్టి హీరోగా నూతన దర్శకుడు మారి రూపొందిస్తున్న సినిమా 'అనగనగా ఒక రాజు'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బేనర్లపై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. నవీన్ పొలిశెట్టి పుట్టిన రోజు సందర్భంగా సినిమా నుంచి ప్రీ వెడ్డింగ్ వీడియో టీజర్‌ను నిర్మాతలు ఆవిష్కరించారు. ఈ వీడియో ఎంతో ప్రత్యేకంగా, వినోదాత్మకంగా ఉంది. నవీన్ పొలిశెట్టి పోషించిన రాజు పాత్ర వివాహానికి సిద్ధమవుతున్నట్లు వీడియోలో చూపించారు. రాజుగారి పెళ్లి అంటే ఎలా ఉండాలి? అంటూ భోజనాల వద్ద చమ్మక్ చంద్ర చేసిన హడావుడి నవ్వులు పూయించింది. అనంత్ అంబానీ వివాహానికి హాజరైన హాలీవుడ్ ప్రముఖుల ఫోన్ నెంబర్ల కోసం, నవీన్ ఏకంగా ముఖేశ్ అంబానీకి ఫోన్ చేసి మాట్లాడినట్లు చూపించడం కడుపుబ్బా నవ్వించింది. ప్రీ వెడ్డింగ్ ఫొటో షూట్‌లో వధువుగా నటి మీనాక్షి చౌదరి కనిపించారు. ఇక్కడ కూడా నవీన్ పోషించిన రాజు పాత్ర నవ్వులు పంచింది. 2025లో ఈ చిత్రం ప్రేక్షకులను అలరించనుంది. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు.

సరికొత్త సైకలాజికల్ థ్రిల్లర్



ప్రశాంత్ కృష్ణ, అనీషా ధామ, శ్రీనివాస్ రామిరెడ్డి, ఐశ్వర్య హోలక్కల్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'డ్రీమ్ క్యాచర్'. సీయోల్ మోషన్ పిక్చర్స్ బేనర్‌పై దర్శకుడు సందీప్ కాకుల రూపొందిస్తున్నారు. జనవరి 3న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. హీరో ప్రశాంత్ కృష్ణ మాట్లాడుతూ 'సైకలాజికల్ థ్రిల్లర్‌గా సరికొత్త ఎక్స్‌పీరియన్స్‌ని ఈ చిత్రం ఇస్తుంది. ట్రైలర్ చూశాక నేను అడివి శేష్, రానా లా ఉన్నానంటూ కామెంట్స్ వస్తున్నాయి' అని అన్నారు. డైరెక్టర్ సందీప్ కాకుల మాట్లాడుతూ 'సినిమా చేయాలనేది నా డ్రీమ్. కలల మీద సినిమా చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచనతో ఈ 'డ్రీమ్ క్యాచర్' మూవీ మొదలుపెట్టాను. మొత్తం షూటింగ్ అంతా హైదరాబాద్‌లోనే చేశాం. ఒక మంచి మూవీ చేస్తే ఎక్కడైనా ఆదరిస్తారని నమ్మాను' అని తెలిపారు. నటుడు శ్రీనివాస్ రామిరెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాలో కార్తిక్ అనే క్యారెక్టర్ చేశాను. మనం జీవితంలో ఏదో ఒక సందర్భంలో జరిగిన సంఘటనలో చిక్కుకు పోతాం. ఆ ఘటన జరిగినప్పుడు మనసులో ఒక సంఘర్షణ మొదలవుతుంది. అలా తన జీవితంలో జరిగిన ఓ ఘటన ప్రభావం నుంచి బయటపడేందుకు హీరో ఎలా ప్రయత్నించాడు అనేది ఈ సినిమా కథ' అని వివరించారు.

హృదయాలను హత్తుకునే ప్రేమకథ



సువిక్షిత్ బొజ్జ, గీతిక రతన్ జంటగా నటిస్తున్న చిత్రం 'దూరదర్శిని'. 'కలిపింది ఇద్దరినీ' అనేది ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకత్వంలో బి.సాయిప్రతాప్ రెడ్డి, జయశంకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. 1990ల నేపథ్యంలో అందరి హృదయాలను హత్తుకునే ప్రేమకథగా తెరకెక్కుతున్న ఈ చిత్ర టీజర్‌ను సంగీత దర్శకుడు ఆర్.పీ.పట్నాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ సినిమా 90వ దశకంలోకి తీసుకెళ్లి మీ జ్ఞాపకాలని గుర్తుతెస్తుంది" అని చెప్పారు. "ఇది అందరికీ కనెక్ట్ అయ్యే చిత్రం. దర్శకుడు ఈ చిత్రాన్ని సహజంగా తెరకెక్కించారు" అని హీరో సువిక్షిత్ అన్నారు.

తెలుగు ప్రేక్షకులు పల్లె కథలకు పట్టం కట్టారు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన చిత్రాలను ఆదరించారు. పల్లెటూరు నేపథ్యం, మంచి కథ, బెస్ట్ విజువలైజేషన్ ఉంటే చాలు... అవి చిన్న సినిమాలైనా పెద్ద విజయాలనే నమోదు చేశాయి. మొన్నటి సాయి దుర్గాతేజ్ 'విరూపాక్ష' మొదలు... నేటి కిరణ్ అబ్బవరం 'క' సినిమా వరకు ప్రేక్షకుల మెప్పు పొందాయి. అయితే కొన్ని చిత్రాలు మాత్రం ఆడియన్స్‌ను మెప్పించలేకపోయాయి. విలేజ్ బ్యాక్‌డ్రాప్ జానర్‌లో ఈ ఏడాది వచ్చిన అలాంటి ఓ ఐదు సినిమాలు ఏవో చూద్దాం!

పల్లె కథకు ప్రాధాన్యం



జాతర, ఎన్నికల చుట్టూ..

సెప్టెంబరులో రిలీజ్ అయిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రాన్ని నాగబాబు కూతురు నిహారిక నిర్మించారు. గోదావరి జిల్లాలోని పురుషోత్తమపల్లె అనే గ్రామానికి సంబంధించిన కథ. ఆ గ్రామంలో 12 ఏళ్లకు ఒక సారి భరింకాళమ్మ జాతర జరుగుతుంది. ఈసారి ఉప సర్పంచ్ ఎన్నికలకు పదిరోజుల ముందు జాతర జరగాల్సి ఉంటుంది. ఈ ఎన్నికల్లో ఆ ఊరికి చెందిన యువకుడు శివ... ప్రస్తుత సర్పంచ్ పొలిశెట్టి బుజ్జిపై పోటీకి నిలబడేందుకు ముందుకు వస్తాడు. గత జాతర సమయంలో కమిటీ కుర్రోళ్ల(11 మంది) కారణంగా ఊర్లో జరిగిన గొడవలను దృష్టిలో పెట్టుకుని, ఈసారి జాతర జరిగేంత వరకూ ఎన్నికల ప్రచారం చెయ్యొద్దని ఆ ఊరి పెద్దలు నిర్ణయం తీసుకుంటారు. ఆ తర్వాత ఏం జరిగింది? అనే దాని చుట్టూ కథ తిరుగుతుంది. ఈ సినిమా చూస్తున్నంత సేపూ 90వ దశకానికి చెందిన వారంతా తమ బాల్యాన్ని నెమరు వేసుకుంటారు. ఆ రోజులు మళ్లీ వస్తే బాగుండునని ఆశపడతారు. ప్రేక్షకుల్ని బాల్యంలోకి తీసుకెళ్లడంలో డైరెక్టర్ యదు వంశీ ప్రేక్షకులను మెప్పించగలిగారు.



పెళ్లి నేపథ్యం



అక్టోబరులో విడుదలైన 'లగ్గం' సినిమాకు దర్శకుడు రమేశ్ చెప్పాల. తెలంగాణాలో జరిగే పెళ్లి నేపథ్యంలో కథ సాగుతుంది. ఇక్కడి పెళ్లిలో జరిగే ఆచారాలు, సంప్రదాయాలను తెరకెక్కించారు. కథ విషయానికి వస్తే...తెలంగాణ ప్రాంతంలోని ఓ గ్రామంలో సదానందం, అతని కూతురు మానస నివసిస్తుంటారు. మేనల్లుడు చైతన్య. అల్లుడికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఉందని లగ్గం ఖాయం చేస్తాడు సదానందం. అనుకోని పరిస్థితుల్లో చైతన్య ఉద్యోగం పోతుంది. ఈ పరిస్థితుల్లో వారి పెళ్లి జరిగిందా? లేదా? అన్నదే కథ. ముఖ్యంగా ఈ సినిమాకు పాటలు ప్లస్ పాయింట్ అయ్యాయి. ఈ పాటలన్నీ గ్రామీణ నేపథ్యాన్ని అల్లుకునే ఉన్నాయి. క్లయిమాక్స్‌లో పెళ్లి కూతురు అప్పగింత ఎపిసోడ్ సినిమాలో హైలెట్‌గా నిలిచింది.



పల్లె కథ

1980లో తెలంగాణలోని ఒక పల్లెకు సంబంధించిన కథ 'పొట్టేల్'. వంశపారంపర్యంగా ఆ ఊరి పటేళ్లకి అమ్మవారు పూనుతూ ఉంటుంది. ఆ సమయంలో పటేళ్లు ఏది చెబితే అదే వేదం. కొత్త పటేల్ నిమ్న వర్గాల వారిని బడికి వెళ్లకూడదని ఆ పూనకంలో ఆదేశిస్తాడు. కాని గంగాధర్ తన కూతురు సరస్వతిని చదివించాలనుకుంటాడు. ఈ నేపథ్యంలో కథ సాగుతుంది. ఇది పూర్తిగా ఒక గ్రామానికి సంబంధించిన స్టోరీ.

1977 నాటి కథ



కిరణ్ అబ్బవరం నటించిన 'క' సినిమా కథ అంతా 1977 బ్యాక్‌డ్రాప్‌లో జరుగుతుంది. అనాథ అయిన హీరోకు చిన్నప్పటి నుంచి పక్కవాళ్ల ఉత్తరాలు చదివే అలవాటు ఉంటుంది. పోస్ట్ మ్యాన్ అయితే అందరి ఉత్తరాలు చదవొచ్చు అనే ఆలోచనతో కృష్ణగిరి అనే గ్రామంలో పోస్ట్ మ్యాన్ అసిస్టెంట్‌గా జాయిన్ అవుతాడు. అయితే ఆ గ్రామంలో వరుసగా అమ్మాయిలు మిస్ అవుతూ ఉంటారు. వారిని కిడ్నాప్ చేసిందెవరు? కృష్ణగిరి గ్రామానికి చెందిన అమ్మాయిలే ఎందుకు మిస్ అవుతున్నారు? ఉత్తరాలు చదివే అలవాటు ఉన్న హీరోకు తెలిసిన విషయాలేమిటి? అనే అంశాల చుట్టూ కథ అల్లారు దర్శకులు. ఈ సినిమా కిరణ్‌కు మంచి బ్రేక్ ఇచ్చింది.



పల్లెటూరి బ్యాక్‌డ్రాప్

పల్లెటూరి బ్యాక్‌డ్రాప్ స్టోరీతో తెరకెక్కిన చిత్రం 'ఈసారైనా'. విప్లవ్ ఇందులో హీరోగా నటించడమే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగా, మాటల రచయితగా కూడా వ్యవహరించారు. ఈ మూవీలో హీరో నాలుగేళ్లుగా గవర్నమెంట్ జాబ్ కోసం ఎదురు చూస్తుంటాడు. అదే సమయంలో ఆ ఊరిలో పనిచేస్తున్న టీచర్‌తో ప్రేమలో పడతాడు. ఆమె తండ్రి మాత్రం గవర్నమెంట్ జాబ్ వస్తేనే పెళ్లిచేస్తానని హీరోకు కండీషన్ పెడతాడు. హీరో జాబ్ కొట్టాడా లేదా? చివరకు ఏమైందనేది స్టోరీ. పూర్తిగా గ్రామీణ నేపథ్యంలో సాగిన ఈ చిత్రం మొత్తం షూటింగ్‌ను ఒక పల్లెటూరిలోని అద్భుతమైన లోకేషన్లలో చిత్రీకరించారు. పచ్చని పల్లెటూరిలో ప్రశాంతంగా సాగే యూత్‌ఫుల్ లవ్‌స్టోరీ ఇది.

లిస్టింగ్ మెరుపులు

147% లాభంతో మమతా మెషినరీ షేరు లిస్టింగ్

అదేబాటలో ట్రాన్స్‌రైల్ లైటింగ్, దామ్ క్యాపిటల్

ముంబై: ప్రైమరీ మార్కెట్లో మళ్లీ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)లు కళకళలాడుతున్నాయి. కొద్దికాలంగా ఉన్న స్తబ్దుగా ఉంటూ వస్తున్న ఐపీఓ మార్కెట్ లిస్టింగ్ రోజునే మరోసారి ఇన్వెస్టర్లకు మంచి లాభాలను అందిస్తోంది. తాజాగా పబ్లిక్ ఇష్యూకు వచ్చిన మమతా మెషినరీ, దామ్ క్యాపిటల్ అడ్వైజర్స్, ట్రాన్స్‌రైల్ లైటింగ్, కంకార్డ్ ఎన్విరో, సనాతన్ టెక్స్‌టైల్స్. లిస్టింగ్ రోజే అదరగొట్టాయి. ప్యాకేజింగ్ మెషినరీ సంస్థ మమతా మెషినరీ శుక్రవారం ఏకంగా 146.91% లాభంతో రూ.600 వద్ద లిస్ట్ అయ్యింది. ఐపీఓలో భాగంగా ఈ కంపెనీ ఒక్కో షేరును రూ.243 ధరతో జారీ చేసింది. చివరకు 159.23% లాభంతో అప్పర్ సర్క్యూట్ లిమిట్‌ను తాకి రూ.629.95 వద్ద క్లోజైంది. ఎన్ఎస్ఈలోనూ 159.25 శాతం లాభంతో రూ.630 వద్ద ముగిసింది.

ట్రాన్స్‌రైల్ లైటింగ్: ఐపీఓలో భాగంగా ఈ కంపెనీ ఒక్కో షేరును రూ.432కి జారీ చేయగా శుక్రవారం మార్కెట్లో 35.45% లాభంతో రూ.585.15 వద్ద లిస్ట్ అయ్యింది. ఒక దశలో బీఎస్ఈలో 39.81% లాభపడిన ఈ షేరు చివరకు 28.07% లాభంతో రూ.553.30 వద్ద స్థిరపడింది.

దామ్ క్యాపిటల్: బీఎస్ఈలో శుక్రవారం ఈ షేరు రూ.283 ధరతో పోల్చితే 38.83% ప్రీమియంతో రూ.392.90 వద్ద నమోదైంది, ఇంట్రాడేలో ఒక దశలో ఈ షేరు ఏకంగా 61.44% దూసుకుపోయి రూ.456.90 స్థాయిని తాకింది. చివరకు 46.66% ప్రీమియంతో రూ.415.05 వద్ద క్లోజైంది.

కంకార్డ్ ఎన్విరో: ఈ కంపెనీ రూ.701 ధరతో ఐపీఓకి రాగా శుక్రవారం బీఎస్ఈలో 18.68% లాభంతో రూ.832 వద్ద లిస్ట్ అయ్యింది. ఇంట్రాడేలో 22.67% లాభంతో రూ.859.95 స్థాయిని తాకిన ఈ షేరు చివరకు 18.18% లాభంతో రూ.828.45 వద్ద స్థిరపడింది.

సనాతన్ టెక్స్‌టైల్స్: శుక్రవారం ఈ షేరు ఇష్యూ ధర రూ.321తో పోల్చితే 30.56% లాభంతో రూ.419.10 వద్ద మార్కెట్లో నమోదైంది. ఒక దశలో 31.66% లాభపడిన ఈ షేరు ట్రేడింగ్ ముగిసే సమయానికి 21.18% లాభంతో రూ.422.65 వద్ద క్లోజైంది.

'బేర్' మంటున్న రూపాయి



మరో ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయి 85.48కి పతనం..

త్వరలో 86 స్థాయికి పడిపోయే చాన్స్

ముంబై: ఫారెక్స్ మార్కెట్లో రూపాయి పతనం కొనసాగుతోంది. శుక్రవారం డాలర్‌తో 21 పైసలు నష్టపోయి మరో ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయి రూ.85.48 వద్ద ముగిసింది. 2023 ఫిబ్రవరి 2వ తేదీ తర్వాత డాలర్‌తో రూపాయి మారకం రేటు ఒకే రోజు ఇంత భారీగా పడిపోవడం ఇదే మొదటిసారి. ఆ రోజు డాలర్‌తో భారత కరెన్సీ మారకం రేటు 68 పైసలు నష్టపోయింది. శుక్రవారం ఉదయం డాలర్‌తో 85.31 వద్ద ప్రారంభమైన రూపాయి మారకం రేటు ఇంట్రాడేలో ఒక దశలో 53 పైసలు నష్టపోయి 85.80 స్థాయిని తాకింది. ఆ దశలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) పెద్ద ఎత్తున డాలర్లను అమ్మకానికి పెట్టడంతో కొద్దిగా కోలుకుని 21 పైసల నష్టంతో 85.48 వద్ద ముగిసింది.

రెండు వారాలుగా ఇదే ట్రెండ్: గడిచిన రెండు వారాలుగా అమెరికా డాలర్‌తో రూపాయి మారకం రేటు ఆపసోపాలు పడుతోంది. గురువారం కూడా డాలర్‌తో రూపాయి 12 పైసలు నష్టపోయి 85.27 వద్ద ముగిసింది. అంతకు ముందు రెండు రోజుల్లోనూ 13 పైసలు నష్టపోయింది. పరిస్థితులు ఇలానే కొనసాగితే వచ్చే కొద్ది రోజుల్లోనే డాలర్‌తో రూపాయి మారకం రేటు 86కు పతనమయ్యే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. రూపాయి మారకం రేటు పతనానికి ఈ కింది అంశాలు దోహదం చేస్తున్నాయి.

డాలర్లకు డిమాండ్: డిసెంబరు 31 సమీపిస్తుండడంతో దిగుమతిదారులు.. తమ చెల్లింపుల కోసం డాలర్ల కోసం ఎగబడుతున్నారు. అయితే డిమాండ్‌కు తగ్గట్టు మార్కెట్లో డాలర్ల సరఫరా లేదు. దీంతో గత రెండు వారాలుగా ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి గింగిరాలు పోతోంది.

ఎఫ్‌పీఐల అమ్మకాలు: దేశీయ స్టాక్ మార్కెట్ మళ్లీ తీవ్ర ఆటుపోట్లు ఎదుర్కొంటోంది. ఈ నెల ప్రారంభంలో అమ్మకాల హోరు కొద్దిగా తగ్గించిన ఎఫ్‌పీఐలు మళ్లీ అమ్మకాలకు దిగాయి. గురువారం ఈ సంస్థలు రూ.2,376.67 కోట్ల విలువైన నికర పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. ఇది కూడా డాలర్‌తో రూపాయి మారకం రేటును దెబ్బతీస్తోంది.

అమెరికా వడ్డీ రేట్లు: అమెరికాలో వడ్డీ రేట్లు మళ్లీ పైచూపులు చూస్తున్నాయి. పదేళ్ల కాల పరిమితి ఉండే అమెరికా ప్రభుత్వ రుణ పత్రాలపై వడ్డీ రేటు 0.76 శాతం పెరిగి ఏడు నెలల గరిష్ఠ స్థాయి 4.61 శాతానికి చేరింది. దీంతో భారత డెట్ ఫండ్స్‌లో మదుపు చేసిన ఎఫ్‌పీఐలు తమ పెట్టుబడులను మరింత సురక్షితంగా భావించే అమెరికా రుణ పత్రాలకు తరలిస్తున్నాయి. ఇది కూడా రూపాయిపై ఒత్తిడి పెంచుతోంది.

బలపడుతున్న డాలర్: డొనాల్డ్ ట్రంప్ మరోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఆరు ప్రధాన కరెన్సీలతో డాలర్ మారకం రేటు మరింత పుంజుకుంది. గురువారం మరో 0.04 శాతం పెరిగి 107.94కు చేరింది. ఈ ప్రభావం రూపాయి మీదా కనిపిస్తోంది.

చమురు సెగ: అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర మళ్లీ పైచూపులు చూస్తోంది. శుక్రవారం బ్యారల్ బ్రెంట్ రకం చమురు ధర 73.37 డాలర్లకు చేరింది. త్వరలోనే ఇది మరింత పెరిగి 80 డాలర్లకు చేరువవుతుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే మన ద్రవ్య లోటు పెరిగి రూపాయి మరింత పతనమయ్యే ప్రమాదం ఉందని భావిస్తున్నారు.

ఫారెక్స్ నిల్వలూ ఢమాల్

రూపాయి మారకం రేటుతో పాటు భారత విదేశీ మారక ద్రవ్య (ఫారెక్స్) నిల్వలు తగ్గిపోతున్నాయి. ఈ నెల 20తో ముగిసిన వారాంతానికి ఫారెక్స్ నిల్వలు 64,439 కోట్ల డాలర్లకు (సుమారు రూ.55.08 లక్షల కోట్లు) పడిపోయాయి. గత ఏడు నెలల్లో ఫారెక్స్ నిల్వలు ఎన్నడూ ఇంత కనిష్ఠ స్థాయికి చేరలేదు. అంతకు ముందు వారంతో పోలిస్తే ఇది 850 కోట్ల డాలర్లు తక్కువని ఆర్‌బీఐ తెలిపింది. గత నెల రోజుల్లో ఫారెక్స్ నిల్వలు ఎన్నడూ ఒక వారంలో ఇంత భారీగా పడిపోలేదు. డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనం, విదేశీ చెల్లింపుల భారం పెరగడం, రూపాయి మారకం రేటును ఒక స్థాయిలో నిలబెట్టేందుకు ఆర్‌బీఐ ఓపెన్ మార్కెట్ ద్వారా డాలర్లను విక్రయించడం ఇందుకు ప్రధాన కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

సుజుకీ అధినేత ఒసాము సుజుకీ కన్నుమూత

మారుతి సుజుకీ ఏర్పాటులో కీలక పాత్ర



న్యూఢిల్లీ: జపాన్ ఆటోమొబైల్ దిగ్గజం సుజుకీ మోటార్ కార్పొరేషన్ (ఎస్ఎంసీ) డైరెక్టర్, గౌరవ చైర్మన్ ఒసాము సుజుకీ (94) మరిక లేరు. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన బుధవారం కన్నుమూసినట్టు ఎస్ఎంసీ ప్రకటించింది. భారత ఆటోమొబైల్ పరిశ్రమ అభివృద్ధిలోనూ ఆయనది కీలక పాత్ర. లైసెన్స్ రాజ్ హయాంలో ఏ విదేశీ ఆటోమొబైల్ కంపెనీ మన దేశంలో తన కార్ల తయారీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు సాహసించేది కాదు. అలాంటి సమయంలో ఒసాము సుజుకీ.. కేంద్ర ప్రభుత్వంతో కలిసి 1981లో మారుతి ఉద్యోగ్ లిమిటెడ్ పేరుతో ప్రత్యేక జాయింట్ వెంచర్ కంపెనీ ఏర్పాటు చేశారు. భారత్‌లో కార్ల మార్కెట్‌కు ఉన్న అవకాశాలను ముందే ఊహించి సుజుకీ ఈ నిర్ణయం తీసుకున్నారని చెబుతారు. 2007లో ప్రభుత్వ వాటాను పూర్తిగా కొనుగోలు చేయడం ద్వారా మారుతి ఉద్యోగ్ పూర్తిగా సుజుకీ మోటార్ కార్పొరేషన్ పరమైంది. దాంతో కంపెనీ పేరూ మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్)గా మారింది. ఈ కంపెనీకి ఆయన చాలా కాలం పాటు డైరెక్టర్‌గా, గౌరవ చైర్మన్‌గా సేవలు అందించారు.

ముందు చూపున్న నేత: ఒసాము సుజుకీ మృతి పట్ల మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ చైర్మన్ ఆర్‌సీ భార్గవ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. 'ముందు చూపుతో ఆయన రిస్క్ తీసుకుని ఉండకపోతే భారత ఆటోమొబైల్ రంగం ఈ రోజు ఈ స్థాయికి ఎదిగి ఉండేది కాదు' అని నివాళులు అర్పించారు. మన దేశమంటే ఆయనకు ఎంతో ప్రేమ అన్నారు. భారత-జపాన్ సంబంధాల అభివృద్ధికి సుజుకీ ఎంతో కృషి చేశారన్నారు. ఇందుకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆయన్ని పద్మ భూషణ్ అవార్డుతో సత్కరించింది.

విప్లవాత్మక మార్పులు

1981 వరకు మన దేశ కార్ల మార్కెట్లో సీకే బిర్లా గ్రూప్ కంపెనీ హిందూస్థాన్ మోటార్స్ కంపెనీ తయారు చేసే అంబాసిడర్ కార్లదే హవా. మారుతి ఉద్యోగ్ విడుదల చేసిన 'మారుతి 800' కార్లతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆర్థిక సంస్కరణల తర్వాత అనేక దేశ, విదేశీ కంపెనీలు రంగంలోకి వచ్చినా, ఇప్పటికీ మార్కెట్లో అగ్రస్థానం మారుతి సుజుకీదే. మారుతున్న టెక్నాలజీతో ఎప్పటికప్పుడు కొత్త మోడల్స్ విడుదల చేస్తూ కంపెనీ మార్కెట్లో తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటోంది. ఇప్పుడు కొత్త ట్రెండ్ అయిన విద్యుత్ వాహనాల ఉత్పత్తిపైనా ప్రత్యేక దృష్టి పెట్టి ముందుకు సాగుతోంది. నాటి ప్రధాని ఇందిరతో పాటు నేటి ప్రధాని మోదీతోనూ ఒసాము సుజుకీ సత్సంబంధాలు నడిపారు. ఆయన మృతి పట్ల భారత ఆటోమొబైల్ పరిశ్రమ దిగ్గజాలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. భారత్‌లో ఆటోమొబైల్ పరిశ్రమ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు.

బ్యాంకింగ్, ఆటో షేర్ల దన్ను

బెంచ్‌మార్క్ ఇండెక్స్‌లైన బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ.. శుక్రవారం బ్యాంకింగ్, ఆటోమొబైల్ షేర్ల దన్నుతో లాభాల్లో ముగిసాయి. సెన్సెక్స్ 226.59 పాయింట్ల లాభంతో 78,699.07 పాయింట్ల వద్ద ముగియగా నిఫ్టీ 63.20 పాయింట్లు లాభపడి 23,813.40 పాయింట్ల వద్ద క్లోజైంది. వారం మొత్తానికి చూస్తే సెన్సెక్స్ 657.48 పాయింట్లు, నిఫ్టీ 225.90 పాయింట్ల మేరకు లాభపడింది.

డీహెచ్ఎల్ ఎక్స్‌ప్రెస్.. రిటైల్ కస్టమర్ల కోసం ప్రత్యేక ఆఫర్లు, డిస్కౌంట్స్‌ను తీసుకువచ్చింది. ఈ ఆఫర్స్ కింద ప్రపంచవ్యాప్తంగా మూడు నుంచి 25 కిలోల వరకు గిఫ్ట్ షిప్‌మెంట్స్‌ను పంపించవచ్చు. దేశవ్యాప్తంగా ఉన్న 250 డీహెచ్ఎల్ రిటైల్ సర్వీస్ నెట్‌వర్క్‌లో ఈ ఆఫర్లు అందుబాటులో ఉంటాయి.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	103	విజయవాడ	109
వరంగల్	103	గుంటూరు	112
కరీంనగర్	103	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	100
కర్నూలు	103	నెల్లూరు	100
విశాఖపట్నం	108	అనంతపురం	100
గోదావరి	109		

ఆహారేతర ఖర్చులే అధికం

తగ్గుతున్న వినియోగ ఖర్చులు

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అదే ట్రెండ్

గృహ వినియోగ ఖర్చుల సర్వే వెల్లడి

న్యూఢిల్లీ: దేశీయంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వినియోగ ఖర్చుల వ్యత్యాసం రోజురోజుకు తగ్గుతోంది. శుక్రవారం కేంద్ర గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన 'గృహ వినియోగ ఖర్చుల సర్వే' ఈ విషయం తెలిపింది. 2022 ఆగస్టు-2023 జూలై కాలంతో పోల్చితే 2023 ఆగస్టు-2024 జూలై మధ్య కాలంలో ఈ వ్యత్యాసం మరింత తగ్గినట్టు వెల్లడించింది. సమాజంలో సంపద పంపిణీ, వినియోగ ఖర్చుల అసమానతలను తెలిపే జీనీ కోఎఫీషియెంట్ నమూనా కూడా ఈ విషయాన్ని బలపరుస్తోంది. దీని ప్రకారం 2023 ఆగస్టు- 2024 జూలై మధ్య కాలంలో వినియోగ ఖర్చుల అసమానత గ్రామీణ ప్రాంతాల్లో 0.266 నుంచి 0.237కు, పట్టణ ప్రాంతాల్లో 0.314 నుంచి 0.284కు తగ్గిందని సర్వే పేర్కొంది.

ఇదీ ప్రస్తుత పరిస్థితి: ప్రస్తుత ధరల ప్రకారం 2022-23 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో ఇంటి నెలవారీ సగటు ఖర్చు (ఎంపీసీఈ)లు రూ.3,773, పట్టణ ప్రాంతాల్లో రూ.6,459గా నమోదయ్యాయి. అదే 2023-24 కాలానికి వచ్చేసరికి గ్రామాల్లో రూ.4,122కు, పట్టణ ప్రాంతాల్లో రూ.6,996కు పెరిగినట్టు సర్వే తెలిపింది. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను మినహాయించినా, ప్రస్తుత ధరల ప్రకారం ఈ కాలంలో నెలవారీ గృహ వినియోగ ఖర్చులు గ్రామీణ ప్రాంతాల్లో రూ.4,247గా, పట్టణ ప్రాంతాల్లో రూ.7,078గా నమోదయ్యాయి. గత ఏడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది జూలై మధ్య కాలంలో దేశవ్యాప్తంగా 2,61,953 కుటుంబాల నెలవారీ వినియోగ ఖర్చుల ఆధారంగా ప్రభుత్వం ఈ సర్వే రూపొందించింది. దీని ప్రకారం చూసినా పట్టణ-గ్రామీణ ప్రాంతాల నెలవారీ వినియోగ ఖర్చుల వ్యత్యాసం 2022-23లో 84 శాతం నుంచి 71 శాతానికి, 2023-24లో 70 శాతానికి తగ్గింది.

మిగతా అవసరాలే ఎక్కువ: నెలవారీ గృహోపయోగ ఖర్చుల్లో ఆహారేతర ఖర్చులదే అగ్రస్థానమని కూడా సర్వే తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం గ్రామీణ నెలవారీ గృహ వినియోగ ఖర్చుల్లో 53 శాతం ఆహారేతర వస్తువులపై ఖర్చు చేశారు. పట్టణ జీవులకు వచ్చేసరికి ఇది మరింత పెరిగి 60 శాతంగా నమోదైంది. గ్రామీణ-పట్టణ ప్రాంత ఆహార ఖర్చుల్లో శీతల పానీయాలు, అల్పాహారాలు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల ఖర్చులు అగ్రస్థానంలో ఉన్నాయి. ఆహారేతర ఖర్చుల్లో ప్రయాణ ఖర్చులు, బట్టలు, పాదరక్షలు, వినోద, ఇతర చిల్లర ఖర్చులు ఎక్కువై పోయాయి. ఇంటి, గ్యారేజీ అద్దెలు, హోటల్ వసతుల కోసం చేసే ఖర్చులూ ఆహారేతర ఖర్చుల్లో ఏడు శాతం వరకు ఉన్నట్టు సర్వే తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ			
హైదరాబాద్	585	విజయవాడ	600
వరంగల్	587	గోదావరి	600
చిత్తూరు	603	విశాఖపట్నం	600
		దజను గుడ్లు రూ. 84	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,000 ▲	71,500 ▲	1,00,000 ▲
విజయవాడ	79,150 ▲	73,100 ▲	92,000 ▲
విశాఖపట్నం	77,010 ▲	70,590 ▲	89,590 ▼
రాజమండ్రి	78,000 ▲	71,500 ▲	90,900 ▲
ప్రొద్దుటూరు	78,750 ▲	72,930 ▲	90,500 ▲
ముంబై	76,436 ▲	70,015 ▲	87,831 ▲

ఆఖర్లో.. ఆ రనౌట్‌తో!

అంతా తారుమారు

భారత్ తొలి ఇన్నింగ్స్ 164/5

- జైస్వాల్ అర్ధసెంచరీ
- ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 474
- స్టీవ్ స్మిత్ శతకం




స్టీవ్ స్మిత్ (140)

1 భారత్‌పై ఎక్కువ టెస్టు సెంచరీలు (11) సాధించిన బ్యాటర్‌గా స్మిత్. ఈ క్రమంలో రూట్ (10)ను అధిగమించాడు.

మెల్‌బోర్న్: అంతా బాగుందనుకున్న వేళ.. బ్యాటర్ల అనూహ్య తడబాటు భారత్‌ను కష్టాల్లోకి నెట్టింది. ఓవైపు యశస్వీ జైస్వాల్ (82) సెంచరీ ఖాయమనిపించేలా క్రీజులో కుదురుకున్నాడు. మరోవైపు తన బలహీనతను అధిగమిస్తూ దీటుగా నిలబడిన విరాట్ కోహ్లీ (36). వీరిద్దరి ఆటతో బాక్సింగ్ డే టెస్టు రెండో రోజు టీమిండియా ఓ దశలో 153/2తో పటిష్ఠంగా కనిపించింది. కానీ జైస్వాల్ రనౌట్ అంతా మార్చివేసింది. ఒక్కసారిగా ఆసీస్ పోటీలోకి రావడంతో 6 పరుగుల తేడాతో భారత్ మూడు వికెట్లు కోల్పోవాల్సి వచ్చింది. ప్రస్తుతం టీమిండియా శుక్రవారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 164/5 స్కోరు చేసింది. ఇప్పటికే సగం జట్టు పెవిలియన్‌కు చేరగా, భారత్ ఫాలోఆన్ గండం దాటాలంటే మరో 111 పరుగులు చేయాల్సి ఉంది. ఇక భారమంతా క్రీజులో ఉన్న పంత్ (6 బ్యాటింగ్), జడేజా (4)పైనే ఉంది. ఆ తర్వాత నితీశ్, సుందర్ కూడా బ్యాటర్లే కావడం సానుకూలాంశం. అంతకుముందు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 474 పరుగులకు ఆలౌటైంది. స్టీవ్ స్మిత్ (140) వరుసగా రెండో శతకం సాధించగా, కమిన్స్ (49) సహకరించాడు. బుమ్రాకు నాలుగు, జడేజాకు మూడు, ఆకాశ్‌కు రెండు వికెట్లు దక్కాయి.

స్మిత్ శతకం: 311/6 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఆసీస్‌కు స్మిత్, కెప్టెన్ కమిన్స్ భారీ స్కోరుకు దోహదపడ్డారు. భారత బౌలర్లు ఏ మాత్రం ప్రభావం చూపలేకపోవడంతో ఇద్దరూ వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలతో స్కోరును పెంచారు. ఈ జోరుతో స్మిత్ కెరీర్‌లో 34వ శతకం పూర్తి చేశాడు. అనంతరం తను మరింత దూకుడుతో ఆడడంతో స్కోరు 400 దాటింది. అయితే ఏడో వికెట్‌కు 112 పరుగులు జోడించాక జడ్డూ ఓవర్‌లో కమిన్స్ వెనుదిరిగాడు. తొలి సెషన్‌లో ఆసీస్ 143 పరుగులు సాధించడం విశేషం. ఆ తర్వాత బ్రేక్ ముగిసిన తొలి రెండు ఓవర్లలోనే ఆసీస్ స్టార్క్ (15), స్మిత్ వికెట్లను కోల్పోయింది. కాసేపటికే చివరి వికెట్ లియోన్ (13)ను బుమ్రా అవుట్ చేయడంతో దాదాపు మూడున్నర గంటల ఆసీస్ పోరాటం ముగిసింది.

ఓపెనర్‌గా వచ్చినా..: జైస్వాల్‌కు జతగా రోహిత్ (3) ఓపెనర్‌గా బరిలోకి దిగాడు. కానీ అతడు ఈ టెస్టులోనూ నిరాశపర్చాడు. రెండో ఓవర్‌లోనే అతడిని కమిన్స్ వెనక్కి పంపాడు. వన్‌డౌన్‌లో వచ్చిన రాహుల్ (24) తిరిగి జైస్వాల్‌కు జత కలిశాడు. ఇద్దరూ ఆచితూచి ఆడారు. మూడు ఫోర్లతో చక్కగా కుదురుకున్న రాహుల్ టీబ్రేక్‌కు ముందు ఓవర్‌లో కమిన్స్‌కు చిక్కాడు. ఈ సెషన్‌లో 15 ఓవర్లు ఆడిన భారత్ 51/2తో నిలిచింది.

జైస్వాల్-విరాట్ అండగా..: ఆఖరి సెషన్‌లో అధిక భాగం భారత్ ఆధిపత్యం చూపింది. జైస్వాల్-విరాట్ జోడీ ఆసీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ భారత్‌కు ఆశలు కల్పించారు. అలాగే ఆఫ్‌సైడ్ బంతులను వదిలేస్తూ విరాట్ ఈసారి సరైనరీతిలో ఆడాడు. అటు జైస్వాల్ సహజశైలిలో ఆడేస్తూ బౌండరీలు రాబట్టాడు. ఈ జోడీని విడదీసేందుకు కమిన్స్ బౌలర్లను మార్చినా, ఫీల్డింగ్‌ను మోహరించినా ఫలితం లేకపోయింది.

ఆఖరి 20 నిమిషాల్లో..

జైస్వాల్-విరాట్ మధ్య మూడో వికెట్‌కు అప్పటికే వంద పరుగులు జత చేరాయి. ఇక ఆట ముగిసేందుకు 20 నిమిషాలే ఉంది. స్కోరు 153/2. వీరి ఆటనుచూస్తే మరో వికెట్ కోల్పోకుండా రోజును ముగిస్తారనిపించింది. కానీ ఇద్దరిమధ్య సమన్వయలోపంతో భారీమూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. 41వ ఓవర్ చివరిబంతికి జైస్వాల్ సింగిల్‌ను ఆశించాడు. ఈ క్రమంలో మిడాన్ వైపు బంతిని ఆడి వేగంగా నాన్‌స్ట్రయిక్ ఎండ్‌వైపు వచ్చాడు. అటు విరాట్ ఇదేమీ గమనించకుండా బంతిని చూస్తూ అక్కడే ఉండిపోయాడు. దీంతో ఇద్దరూ ఒకే వైపునకు చేరడంతో కీపర్ క్యారీ స్ట్రయిక్ ఎండ్ వికెట్లను గిరాటేయడంతో యశస్వీ రనౌటయ్యాడు. దీంతో మూడో వికెట్‌కు 100 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత ఏకాగ్రత కోల్పోయిన విరాట్ ఓవర్ వ్యవధిలో మళ్లీ ఆఫ్‌సైడ్ ఆవలి బంతిని ఆడి క్యారీకి క్యాచ్ ఇచ్చాడు. కాసేపటికే నైట్ వాచ్‌మన్ ఆకాశ్ డకౌట్ కావడంతో భారత్ తీవ్ర ఒత్తిడిలో రోజును ముగించింది.

కోహ్లీని గేలి చేసిన ఆసీస్ ఫ్యాన్స్

ఈ సిరీస్‌లో కోహ్లీకి కలిసి రావడంలేదు. ఆసీస్ అరంగేట్రం ఆటగాడు కాన్‌స్టాస్‌ను ఢీకొని విమర్శలపాలైన కోహ్లీని రెండోరోజు ఆటలో ఆసీస్ ఫ్యాన్స్ ఎగతాళి చేశారు. దీంతో అవుటై పెవిలియన్‌కు వెళ్తున్న కోహ్లీ (36 పరుగులు) వెనక్కివచ్చి మరీ తనను గేలిచేసిన వారున్న స్టాండ్‌వైపు ఆగ్రహంగా చూశాడు. దీంతో అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది విరాట్‌ను లోపలికి పంపించారు.

స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: కాన్‌స్టాస్ (ఎల్బీ) జడేజా 60; ఖవాజా (సి) రాహుల్ (బి) బుమ్రా 57; లబుషేన్ (సి) కోహ్లీ (బి) సుందర్ 72; స్మిత్ (బి) ఆకాశ్ 140; హెడ్ (బి) బుమ్రా 0; మార్ష్ (సి) పంత్ (బి) బుమ్రా 4; క్యారీ (సి) పంత్ (బి) ఆకాశ్ 31; కమిన్స్ (సి) నితీశ్ (బి) జడేజా 49; స్టార్క్ (బి) జడేజా 15; లియోన్ (ఎల్బీ) బుమ్రా 13; బోలాండ్ (నాటౌట్) 6; **ఎక్స్‌ట్రాలు: 27; మొత్తం: 122.4 ఓవర్లలో 474 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-89, 2-154, 3-237, 4-240, 5-246, 6-299, 7-411, 8-455, 9-455, 10-474. **బౌలింగ్:** బుమ్రా 28.4-9-99-4; సిరాజ్ 23-3-122-0; ఆకాశ్ 26-8-94-2; జడేజా 23-4-78-3; నితీశ్ 7-0-21-0; సుందర్ 15-2-49-1.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (రనౌట్) 82; రోహిత్ (సి) బోలాండ్ (బి) కమిన్స్ 3; రాహుల్ (బి) కమిన్స్ 24; విరాట్ (సి) క్యారీ (బి) బోలాండ్ 36; ఆకాశ్ (సి) లియోన్ (బి) బోలాండ్ 0; పంత్ (బ్యాటింగ్) 6; జడేజా (బ్యాటింగ్) 4; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 46 ఓవర్లలో 164/5. వికెట్ల పతనం:** 1-8, 2-51, 3-153, 4-154, 5-159; **బౌలింగ్:** స్టార్క్ 13-0-48-0; కమిన్స్ 13-2-57-2; బోలాండ్ 12-3-24-2; లియోన్ 5-1-18-0; మార్ష్ 3-0-15-0.

గ్రౌండ్‌లోకి ఆగంతకుడు



రెండోరోజు ఆటలో ఓ ఆగంతకుడు మైదానంలోకి రావడం కలకలం రేపింది. భద్రతా సిబ్బంది కళ్లుగప్పి అతడు ముందుగా రోహిత్ వైపు వెళ్లగా అతడు వెంటనే పక్కకు తప్పుకొన్నాడు. దీంతో విరాట్‌ను సమీపించి భుజంపై చేయి వేసి ప్రేక్షకుల వైపు అభివాదం చేస్తూ కనిపించాడు. ఈ సమయంలో విరాట్ ప్రశాంతంగానే ఉండి అతడిని సెక్యూరిటీకి అప్పగించాడు.

నమ్మకం లేనప్పుడు ఇద్దరు స్పిన్నర్లు ఎందుకు?

రెండో స్పిన్నర్‌గా వాషింగ్టన్ సుందర్‌ను తీసుకోవడాన్ని మాజీ కోచ్ రవిశాస్త్రి ప్రశ్నించాడు. ఆసీస్ ఇన్నింగ్స్ 52వ ఓవర్ వరకు అతడి చేతికి కెప్టెన్ రోహిత్ బంతి ఇవ్వనేలేదు. అప్పటికే జట్టు స్కోరు 171/2గా ఉంది. ఓవరాల్‌గా అతడు వేసింది 15 ఓవర్లే. శుక్రవారం లంచ్ విరామ సమయంలో శాస్త్రి మాట్లాడుతూ 'భారత్‌కు ప్రణాళిక లేకుండా పోయింది. అనుకున్నరీతిలో స్పిన్నర్లను ఉపయోగించుకోవడం లేదు. సుందర్‌ను అంత ఆలస్యంగా దించేట్టయితే ఇక ఇద్దరు స్పిన్నర్లతో ఆడడమెందుకు? స్పిన్నర్లపై నమ్మకం లేనప్పుడు ఇద్దర్ని తీసుకోవడం అవసరమా?' అని ఘాటుగా ప్రశ్నించాడు.



స్పోర్ట్స్

దీప్తి ఆల్‌రౌండ్ షో

భారత్‌దే చివరి వన్డే ● 3-0తో సిరీస్ కైవసం



వడోదర: వెస్టిండీస్‌తో ఆఖరి వన్డేలోనూ భారత మహిళల జట్టు సత్తా చాటింది. మొదట బౌలింగ్, ఆపై బ్యాటింగ్‌తో దీప్తి శర్మ (6/31, 48 బంతుల్లో 3 ఫోర్లు, సిక్సర్‌తో 39 నాటౌట్) ఆల్‌రౌండ్ షో కనబర్చడంతో చివరి వన్డేలో హర్మన్ సేన 5 వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తుచేసింది. తద్వారా సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకుంది. టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన కరీబియన్లను భారత బౌలర్లు దీప్తి శర్మ, రేణుకా సింగ్ (4/29) బెంబేలెత్తించారు. దీంతో విండీస్ 38.5 ఓవర్లలోనే 162 పరుగులకు కుప్పకూలింది. చినెల్లె హెన్రీ (61) అర్ధ సెంచరీ చేసింది. ఛేదనలో దీప్తి శర్మ (39 నాటౌట్) రిచా (23 నాటౌట్) చెలరేగడంతో 28.2 ఓవర్లలోనే 167/5 చేసి గెలిచింది. దీప్తి శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా, రేణుక 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచారు.

బాష్ ప్రపంచ రికార్డు

దక్షిణాఫ్రికాకు ఆధిక్యం ● పాక్‌తో తొలి టెస్టు



సెంచూరియన్: పాకిస్థాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో దక్షిణాఫ్రికా ఆటగాడు కార్బిన్ బాష్ ప్రపంచ రికార్డుతో అదరగొట్టాడు. అరంగేట్రం మ్యాచ్‌లో నాలుగు వికెట్లు తీయడంతో పాటు అర్ధ సెంచరీ చేసిన తొలి ఆటగాడిగా రికార్డు పుటల్లోకి ఎక్కాడు. అంతేకాదు..అరంగేట్రంలో తొమ్మిదో ఆటగాడిగా బ్యాటింగ్‌కు దిగి అత్యధిక స్కోరు (81 నాటౌట్) చేసిన దక్షిణాఫ్రికా ఆటగాడిగా కూడా రికార్డు నెలకొల్పాడు. కాగా క్రితంరోజు స్కోరు 82/3తో రెండో రోజు ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా 301 పరుగులకు ఆలౌటై 90 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్నందుకుంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన పాకిస్థాన్ ఆట ముగిసే సమయానికి 22 ఓవర్లలో 3 వికెట్లకు 88 పరుగులు చేసింది. పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 211 పరుగులు సాధించింది.

సెమీస్‌కు లక్ష్యసేన్

షెన్‌జెన్ (చైనా): ఆరంభ కింగ్ కప్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత ఆటగాడు లక్ష్యసేన్ సింగిల్స్‌లో సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో లక్ష్య 10-21, 21-13, 21-13తో ఆగ్నస్ లాంగ్(హాంకాంగ్) పై గెలిచాడు.

సెమీస్‌లో కేరళ, సర్వీసెస్

సంతోష్ ట్రోఫీ

హైదరాబాద్: కేరళ, సర్వీసెస్ జట్లు సంతోష్ ట్రోఫీ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. హైదరాబాద్‌లోని డెక్కన్ ఎరీనా మైదానంలో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో కేరళ 1-0తో జమ్మూ కశ్మీర్‌ను ఓడించింది. మరో క్వార్టర్స్‌లో సర్వీసెస్ 2-1తో మేఘాలయను ఓడించింది. ఆదివారం జరిగే సెమీఫైనల్స్‌లో కేరళతో మణిపూర్, సర్వీసెస్‌తో బెంగాల్ తలపడనున్నాయి.

ఫైనల్లో పట్నా X హరియాణా

పుణె: ప్రొకబడ్డీ లీగ్ టైటిల్ పోరుకు పట్నా పైరేట్స్, హరియాణా స్టీలర్స్ అర్హత సాధించాయి. ఆదివారం ఇరు జట్ల మధ్య ఫైనల్ జరుగుతుంది. శుక్రవారం జరిగిన తొలి సెమీస్‌లో హరియాణా 28-25 తేడాతో యూపీ యోధాస్‌ను ఓడించింది. రైడర్ శివమ్ పతారె ఏడు పాయింట్లు సాధించగా, యూపీ నుంచి గగన్ గౌడ 10 పాయింట్లతో ఆకట్టుకున్నా ఫలితం లేకపోయింది. అనంతరం మరో సెమీస్‌లో పట్నా జట్టు 32-28 తేడాతో దబాంగ్ ఢిల్లీపై నెగ్గింది. రైడర్ దేవాంక్, ఆయన్ ఎనిమిదేసి పాయింట్లతో కీలకంగా నిలిచారు. ఢిల్లీ రైడర్ అషు మాలిక్ 9 పాయింట్లతో పోరాడాడు.

నాలుగో స్థానంలో హారిక

- 12లో అర్జున్.. 38లో హంపి
- ప్రపంచ ర్యాపిడ్ చెస్

న్యూయార్క్: ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌ను తెలుగు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసి విజయంతో ప్రారంభించాడు. భారత కాలమా నం ప్రకారం గురువారం అర్ధరాత్రి మొదలైన ఈ మెగా టోర్నీలో ఓపెన్ విభాగంలో తొలి ఐదు రౌండ్లకుగాను నాలుగింటిలో అర్జున్ గెలిచాడు. మూడో రౌండ్ ఓటమిని మినహాయిస్తే మిగతా రౌండ్లన్నింటిలో ప్రత్యర్థులను ఓడించాడు. దీంతో ఐదురౌండ్లు ముగిసేసరికి అర్జున్ 4 పాయింట్లతో 12వ స్థానంలో కొనసాగుతున్నాడు. మరో భారత ఆటగాడు రౌనక్ సధ్వాని కూడా 4 పాయింట్లే సాధించినా.. తన ఖాతాలో ఓటమే లేకపోవడంతో ఐదో స్థానంలో నిలిచాడు. హర్ష భరత్‌కోటి 2.5 పాయింట్లతో 108వ స్థానంలో, ప్రజ్ఞానంద 3 పాయింట్లతో 56వ స్థానంలో ఉన్నారు. మహిళల ర్యాపిడ్ విభాగంలో తొలిరోజు నాలుగు రౌండ్లు జరిగాయి. 3 విజయాలు, ఓ డ్రా నమోదుచేసిన హారిక 3.5 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. హంపి 2.5 పాయింట్లతో 38వ, సాహితి వర్షిణి 2 పాయింట్లతో 57వ, ప్రియాంక 2 పాయింట్లతో 61వ స్థానాల్లో ఉన్నారు.

చిక్కిపోయేవారికి చక్కని కొబ్బరి పాయసం

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

"నారికేళం తనూకృత్య చిన్నం వయసిః గో క్షిపేత్
సితాగవ్యాజ్య సంయుక్తం తత్సచేన్మృదువహ్నినా"

అంటాడు 'భోజనకుతుహలం' రచయిత రఘునాథ సూరి. ఈ శ్లోకం ప్రకారం- కొబ్బరి పాలతో పాయసం వాతపైత్యాల్ని తగ్గిస్తుంది. ఈ పాయసాన్ని ఎలా తయారుచేయాలో కూడా ఈ శ్లోకం చెబుతుంది. ఈ శ్లోకంలో తనూకృత్యం అంటే కొబ్బరిని సన్నగా తరగటం. ఒకవేళ సన్నగా తురిమే సాధనం లేకపోతే దానిని ఛిన్నం కూడా చేయవచ్చని శాస్త్రకారుడు చెబుతాడు. ఇలా సన్నగా తరిగిన కొబ్బరిని చిక్కని ఆవుపాలలో కలిపి ఉడికించాలి. అలా ఉడికిన మిశ్రమంలో నెయ్యి వేసి దగ్గరపడేలా ఉడికించాలి. అలా ఉడికించిన తర్వాత దానిలో చిటికెడంత పచ్చకర్పూరం కలిపితే మంచి పరిమళంతో పాటుగా పవిత్ర భావం కూడా వస్తుందని రఘునాథ సూరి చెబుతాడు. ఇలా తయారు చేసిన కొబ్బరి పాయసం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయి. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

- కొబ్బరితో చేసిన పాయసం ఎక్కువ పుష్టిదాయకం. శరీరానికి పోషణ ఇస్తుంది. ఎదిగే పిల్లలకు మేలు చేస్తుంది. తక్కువగా తిన్నా ఎక్కువగా ఆకలి తీరుతుంది.
- మంచి నిద్ర పట్టడానికి ఇదొక సాధనం. రక్తస్రావాలు అరికడుతుంది. వాత వ్యాధులు ఉన్నవారు దీనిని జాగ్రత్తగా ఆలోచించి సేవించాలి. దగ్గు, జలుబు, ఆయాసం మొదలైన వ్యాధులతో బాధపడేవారికి ఇది చెడు ఎక్కువ చేస్తుంది.
- ఇది చర్మ సమస్యలకు మంచి మందులా పనిచేస్తుంది. చర్మానికి మంచి మెరుపునిస్తుంది.
- అలసటను తగ్గిస్తుంది. వికారాన్ని, ఎక్కిళ్లను, ఇతర గ్యాసు సమస్యలను తొలగిస్తుంది.
- సాధారణంగా ఎక్కువ మంది ముదురు కొబ్బరిని ఉపయోగిస్తారు. ముదురు కొబ్బరి కన్నా లేత కొబ్బరి ఎక్కువ ప్రయోజనకారి. అనేక రకాల శారీరక సమస్యలకు ఇది విరుగుడుగా పనిచేస్తుంది.



● గంగరాజు అరుణాదేవి

ముత్యాల ముగ్గు

మాకు పంపండి

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్సు, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు,
ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్,
జూబ్లీ హిల్స్
హైదరాబాద్-500033.

ఈ-మెయిల్:
features@andhrajyothy.com



21 చుక్కలు
11 వరుస
సందుచుక్క



ఎస్. జ్యోత్స్న సురేష్, కర్నూలు

వంటిల్లు

శీతాకాలంలో వివిధ రాష్ట్రాల్లో రకరకాలైన వంటలు వండుకుంటూ ఉంటారు. అలాంటి కొన్ని రుచికరమైన పదార్థాలను ఎలా చేయాలో తెలుసుకుందాం.



ఇతర రాష్ట్ర రుచులు మీ కోసం...

బెంగాలీ మాల్పువా

బెంగాల్‌లో రసగుల్లా, గులాబ్‌జామ్‌లతో పాటుగా మాల్పువాను కూడా ఎక్కువగా తింటారు. ముఖ్యంగా చలికాలంలో ఈ మాల్పువాకు మంచి డిమాండ్ ఉంటుంది. ఈ మాల్పువాను ఎలా చేయాలో తెలుసుకుందాం.

కావాల్సిన పదార్థాలు: మైదా- నాలుగు కప్పులు, రవ్వ- ఒక కప్పు, పంచదార- రెండున్నర కప్పులు, ఏలకులు- ఆరు, బేకింగ్ పౌడర్- ఒక స్పూను, చిక్కగా మరగపెట్టిన పాలు- రెండు కప్పులు, నూనె- రెండు కప్పులు, నీళ్లు- తగినన్ని

తయారీవిధానం: ఒక గిన్నెలో మైదా, రవ్వ, ఒక కప్పు పంచదార, ఏలకుల పొడి, బేకింగ్ పౌడర్‌లు వేసి కలపాలి. దానిలో పాలు పోసి ముద్దగా కలపాలి. దీనిపై ఒక మూత పెట్టి అరగంట సేపు ముద్దను నాననివ్వాలి.

- ఒక మూకుడులో నూనెను వేడి చేయాలి. మాల్పువా ముద్దను పలుచగా గారెల మాదిరిగా అరచేతిలో ఒత్తాలి. వాటిని ఈ నూనెలో వేయించాలి.
- మాల్పువాలను వేయిస్తున్న సమయంలోనే ఒక గిన్నెలో ఒక కప్పు నీళ్లు, ఒక కప్పు పంచదార వేసి పాకం పట్టాలి. బాగా వేగిన మాల్పువాలను ఈ పంచదార పాకంలో వేసి.. కొద్దిగా పాకం పీల్చిన తర్వాత బయటకు తీయాలి.

జాగ్రత్తలు
- పంచదార పాకం పలుచగా ఉండాలి. గట్టిపడితే మాల్పువా బావుండదు.
- కొందరు నూనె బదులు నెయ్యి కూడా వాడతారు.



మిసాల్ పావ్

మహారాష్ట్రలో చాలా సుప్రసిద్ధమైన వంటకమిది. దీనిలో పోషక విలువలు ఎక్కువ ఉండటం వల్ల కార్మికులు, కర్షకులు ఎక్కువగా తింటూ ఉంటారు. దీనిని ఎలా తయారుచేయాలో తెలుసుకుందాం.

కావాల్సిన పదార్థాలు: మిసాల్ (పావ్ బ్రెడ్)- నాలుగు, కొబ్బరి తురుము: ఒక కప్పు, ధనియాలు- ఒక చెంచా, జీలకర్ర-ఒక చెంచా, మిరియాలు- అర చెంచా, లవంగాలు-ఆరు, ఏలకులు- నాలుగు, నువ్వులు- రెండు చెంచాలు, ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్- ఒక చెంచా, బంగాళదుంప ముక్కలు- రెండు కప్పులు, మొలకలు- రెండు కప్పులు, కారం- రెండు చెంచాలు, తరిగిన పచ్చిమిరపకాయ ముక్కలు- రెండు చెంచాలు, పసుపు- ఒక చెంచా, మిక్సర్- నాలుగు చెంచాలు, నూనె- ఒక కప్పు, నీళ్లు- తగినన్ని, ఉప్పు- తగినంత, నిమ్మరసం- నాలుగు చెంచాలు

తయారీ విధానం

- ఒక మూకుడులో ధనియాలు, జీలకర్ర, మిరియాలు, లవంగాలు, ఏలకులు, నువ్వులు వేసి వేయించాలి. చల్లారిన తర్వాత వీటిని పొడిలా చేసుకోవాలి.
- అదే మూకుడులో కొద్దిగా నూనె పోసి వేడి చేయాలి. దానిలో ఉల్లిపాయముక్కలు, కొబ్బరితురుము, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి వేయించాలి. దీనిని మిక్సీలో వేసి ముద్దగా చేసుకోవాలి.
- ఒక గిన్నెలో మొలకలు, పసుపు వేసి తగినన్ని నీళ్లు పోసి- కుక్కర్‌లో మూడు విజిల్స్ వచ్చే వరకూ ఉంచాలి. చల్లారిన తర్వాత వీటిని ఒక గిన్నెలో తీసుకొని స్పూనుతో మెత్తగా ముద్దలా చేయాలి.
- మూకుడులో నూనె పోసి వేడి చేయాలి. దానిలో ఉల్లిపాయ ముక్కల పేస్ట్‌ను, మొలకల పేస్ట్‌ను, బంగాళ దుంప ముక్కలను కొద్దిగా నీళ్లు వేసి ఉడికించాలి. ఆ తర్వాత దానిలో ముందుగా తయారుచేసుకున్న పొడిని కలపాలి.
- ఈ మిశ్రమం బాగా ఉడికిన తర్వాత దానిలో పచ్చి మిరపకాయ ముక్కలు, కారం, ఉప్పు వేసి ఒక పది నిమిషాలు ఉడికించాలి.
- దీనిని కిందకు దింపి నిమ్మరసం కలపాలి. మిసాల్ బ్రెడ్, మిక్సర్‌తో పాటుగా తినటానికి అందించాలి.

జాగ్రత్తలు
- కొందరు మిసాల్ బ్రెడ్‌ను వెన్న లేదా నెయ్యితో కాల్చి తింటారు. అలా తింటే రుచి పెరుగుతుంది.
- మొలకలు, బంగాళదుంపలు బాగా మెత్తగా ఉడికిస్తే మంచి రుచి వస్తుంది.
- పావ్ బ్రెడ్ అన్ని కిరాణా దుకాణాలలోను లభిస్తుంది.

ఆలూ భునా

ఉత్తర భారత దేశంలో చలికాలంలో దీన్ని ఎక్కువగా తింటారు. దీనిలో అన్ని రకాల కూరగాయలు వేయటం వల్ల చాలా రుచికరంగా ఉంటుంది.

కావాల్సిన పదార్థాలు:

ఉడికించిన బంగాళ దుంప ముక్కలు: నాలుగు కప్పులు, టమోటా ముక్కలు- ఒక కప్పు, ఉల్లిపాయ ముక్కలు- రెండు కప్పులు, క్యాప్సికం ముక్కలు- ఒక కప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్- ఒక చెంచా, పచ్చి మిరపకాయ ముక్కలు- రెండు స్పూన్లు, కారం- రెండు చెంచాలు, ధనియాల పొడి- ఒక చెంచా, గరం మసాలా- రెండు చెంచాలు, జీలకర్ర - ఒక చెంచా, పెరుగు- ఒక కప్పు, క్రీమ్- పావు కప్పు, తరిగిన కొత్తిమీర- రెండు చెంచాలు, నూనె- పావుకప్పు ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని,

తయారీ విధానం:


ఒక మూకుడులో నూనె వేడి చేయాలి. దానిలో జీలకర్రను వేయించాలి. ఆ తర్వాత ఉల్లిపాయ



జాగ్రత్తలు
- కొందరు కొద్దిగా ఉల్లిపాయలను, జీలకర్రను నూనెలో వేయించి కూరపైన పోపులా వేస్తారు. దీని వల్ల రుచి పెరుగుతుంది.
- బంగాళదుంప ముక్కలు ముద్దగా కాకుండా విడివిడిగా ఉంటే తినేటప్పుడు బావుంటుంది.

ముక్కలు వేసి బంగారు రంగు వచ్చేదాకా వేయించాలి. ఉల్లిపాయ ముక్కలు వేగిన తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చి మిరపకాయ ముక్కలు, టమోటా ముక్కలు, కాప్సికం ముక్కలు వేసి వేయించాలి.

- ఈ మిశ్రమంలో పెరుగు వేయాలి. దానిలో గరం మసాలా, ధనియాల పొడి, కారం వేసి కలపాలి. చివరగా బంగాళదుంప ముక్కలు వేసి కలపాలి.
- దాన్ని దింపిన తర్వాత క్రీమ్, తరిగిన కొత్తిమీర వేయాలి.



ప్రభుత్వ ఉపాధ్యాయుడి దందాలు!

- విజయసాయి అనుచరుడిగా ఉంటూ అకృత్యాలు
- టీడీపీ గ్రీవెన్స్‌లో పందిగుట్టూరు వాసుల ఫిర్యాదు

అమరావతి, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల భూ దందాలపై బాధితుల ఫిర్యాదుల పరంపర కొనసాగుతోంది. గత పాలకుల భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలని అనేక మంది టీడీపీ నేతలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో మంత్రి సంధ్యారాణి, రుడా ఛైర్మన్ వెంకటరమణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా పందిగుట్టూరులో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తూ, వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అనుచరుడిగా వ్యవహరిస్తున్న నిరంజన్‌రెడ్డి అక్రమాలు శ్రుతిమించాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడైన నిరంజన్‌రెడ్డి పాదగిరి స్వయంభూ పాతాళ వినాయకస్వామి ఆలయం పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి, అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. పైగా ఆలయాన్ని నిర్మించిన వారిని ఆలయంలోకి రాకుండా అడ్డుకుంటున్నారన్నారు. ఆలయ నిర్మాతల పేరుతో ఉన్న శిలాఫలకాలను ధ్వంసం చేయడమే కాకుండా ఆలయం చుట్టూ భూములను కబ్జా చేస్తున్నాడని ఫిర్యాదులు చేశారు. విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో అన్ని ఆధారాలతో 30ఏళ్లుగా తమ స్వాధీనంలో ఉన్న భూమిని కొట్టేసేందుకు వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని, పంట వేసుకుంటే రాత్రుళ్లు పైరును ధ్వంసం చేస్తున్నారని ఎల్. వెంకటేశ్వరరెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. అధికారులను ఫిర్యాదు చేసినా, వైసీపీ నేతల వద్ద లంచం తీసుకుని, తమను పట్టించుకోవడం లేదని బాధితుడు వాపోయారు. కర్నూలు జిల్లా పత్తికొండలో తాతల కాలం నుంచి సాగులో ఉండి, 2021 వరకు ఆన్‌లైన్‌లో తమ పేరుతో ఉన్న భూమిని 2022లో అక్రమంగా తన పేరు మీదకు మార్పించుకున్న వైసీపీ నేత లక్ష్మీనారాయణపై చర్యలు తీసుకోవాలని ఎం.మేరీ అనే మహిళ మొరపెట్టుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా వెలగలేరులో తమ ఆస్తులపై కన్నేసిన వైసీపీ నేతలు కె.వేణుబాబు, బి.లీలా కృష్ణారెడ్డి కబ్జాలకు అధికారులు సహకరిస్తున్నారని కె. భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.

ప్రజావేదిక షెడ్యూల్

ఈ నెల 30 నుంచి జనవరి11 వరకు గ్రీవెన్స్‌లో పాల్గొనే మంత్రులు, నేతల షెడ్యూల్‌ను పార్టీ కార్యాలయం ప్రకటించింది. 30న మంత్రి సుభాష్, రాజశేఖర్ గౌడ్, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, జనవరి 2న ఎమ్మెల్యే రాధాకృష్ణ, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, 3న మంత్రి రవీంద్ర, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, రామ్మోహన్‌రావు, 4న మంత్రి నారాయణ, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఎన్టీఆర్ వైద్యసేవ ఛైర్మన్ సుధాకర్, 6న మంత్రి అనిత, ఎమ్మెల్సీ శ్రీకాంత్, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ సత్తిబాబు, 7న మంత్రి రామానాయుడు, ఎమ్మెల్సీచిరంజీవి, స్వచ్ఛాంధ్ర మిషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, 8న మంత్రి ఫరూక్, ఏపీటీడీసీ ఛైర్మన్ బాలాజీ, ఏపీఎస్‌సీపీసీ ఛైర్మన్ సుజాత, 9న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, చీఫ్ విప్ అనురాధ, ఏపీడబ్ల్యూసీఎఫ్‌సీ ఛైర్మన్ గ్రీష్మ, 10న మంత్రి జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఆర్టీసీ ఛైర్మన్ నారాయణ, 11న మంత్రి కేశవ్, పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఏపీఈఆర్‌డీసీ ఛైర్మన్ నాగేశ్వరరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు.

సంచార రైతు బజార్ల ఏర్పాటు

ఎప్పుడు?

మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు



గుంటూరులోని రైతు బజార్ల సంస్థ సీఈవో కార్యాలయం ప్రాంగణంలో మూలనపడ్డ సంచార వాహనాలు

- డిమాండ్, ఆదాయం ఉన్నా.. దృష్టి పెట్టని వైనం
- రాష్ట్రవ్యాప్తంగా నగరాల్లో శివార్ల ప్రజలకు అందుబాటులో లేని కూరగాయలు
- 98 మున్సిపాలిటీలకు 74 చోట్లే రైతుబజార్లు

అమరావతి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో త్వరలో సంచార రైతుబజార్లను ప్రారంభిస్తామని ప్రకటించిన ఏపీ రైతు బజార్ల సంస్థ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. రాష్ట్రంలో రైతుబజార్లను పటిష్ఠం చేయాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా 100 మొబైల్ వాహనాలను ఏర్పాటు చేయనున్నట్లు రైతుబజార్ల సంస్థ సీఈవో గత ఆగస్టులో ప్రకటించారు. విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, కర్నూలు వంటి నగరాల్లో ఆపార్ట్‌మెంట్స్‌లలో, శివారు కాలనీల్లో ఉండే ప్రజలకు రైతుబజార్ సేవలను అందిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం సంచార రైతుబజార్లు కేవలం గుంటూరు, విజయవాడలో 16 మాత్రమే ఉన్నాయి. మిగతా నగర శివార్లలో, ఆపార్ట్‌మెంట్లలో నివసించే వారికి నిత్యావసర కూరగాయలు అందుబాటులో ఉండటం లేదు. వాటి కోసం వినియోగదారులు వాహనాల్లో అయిల్ ఖర్చు చేసుకొని నగరంలోకి రావాల్సి వస్తోంది. శివారు ప్రాంతాలకు మొబైల్ రైతుబజార్లు అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నా.. రైతుబజార్ల సంస్థ పట్టించుకోవడం లేదు. గతంలో నిర్వహించిన మొబైల్ వాహనాలు రైతుబజార్ల సీఈవో కార్యాలయంలో మూలనపడి ఉన్నాయి. ఏటా రూ.10 కోట్లకు పైగా ఆదాయం వస్తున్నా.. వినియోగదారుల నుంచి డిమాండ్ ఉన్నా.. సంచార రైతుబజార్ల ఏర్పాటుపై అధికారులు దృష్టి పెట్టడం లేదు. నగర శివార్లలో తోపుడు బండ్లపై కూరగాయలు అమ్ముతున్న ప్రైవేట్ వ్యక్తులు కిలోకి రూ.20 పైనే అదనంగా వసూలు చేస్తున్నారు.

ప్రారంభం కాని కొత్త రైతు బజార్లు

మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 111 రైతుబజార్లున్నాయి. సాలూరు, అనపర్తి, అంగర, రాయవరం, బాపట్ల, వేంపల్లి, పొద్దుటూరు, పత్తికొండ, ఆళ్లగడ్డ, వెలుగోడు, ఆత్మకూరు, మదనపల్లిలో కొత్తగా నిర్మించిన రైతుబజార్లను కూడా ప్రారంభించలేదు. ప్రతి మున్సిపల్ కేంద్రంలో ఒక రైతుబజార్ ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. కానీ 98 మున్సిపాలిటీలకు 74 చోట్లే రైతుబజార్లు ఉన్నాయి. మిగతా చోట్లా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి.

అంతా నా ఇష్టం!

మంత్రి గింత్రీ జాన్తానై.. మూడు శాఖలు ఆ ఐఏఎస్ చేతిలోనే..

- నిర్ణయాల్లో పూర్తిగా ఏకస్వామ్యం.. ఏకపక్షంగా కీలక నియామకాలు..
- సమీక్ష కోసం ఆయన చాంబర్‌కే మంత్రులు
- సభలో ప్రశ్నలపై సహకరించని అధికారి
- మంత్రుల సిఫారసులూ చెల్లని కాసే
- బడుగు మంత్రులంటే చిన్నచూపు
- వార్డెన్‌ను సైతం బదిలీ చేయించుకోలేని వైనం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఏకంగా మూడు శాఖలను నిర్వహిస్తున్న ఆ ఉన్నతాధికారి ఏ శాఖలోనూ అమాత్యుల మాట వినడం లేదని చెబుతున్నారు. ముఖ్యంగా ఆయన తీరు బడుగు మంత్రులను నిర్వేదంలోకి నెట్టేస్తోందని అంటున్నారు. నిజానికి, ఈయన గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించారు. కూటమి సర్కారు వచ్చిన తర్వాత తనకు ప్రాధాన్యత లేని శాఖలిచ్చారంటూ కొంతకాలం మధనపడ్డారు. ఆ తర్వాత అత్యంత కీలకమైన శాఖ పగ్గాలే ఆయనకు అందాయి. ఇప్పుడు చూస్తే.. ఏ మంత్రికీ సమయం కేటాయించలేనంత 'బిజీ' అయిపోయారు సారు. మంత్రులతో సమన్వయం చేసుకోవాల్సిన ఆ అధికారి ఏకస్వామ్యంగా వ్యవహరిస్తున్నారని, బడుగు మంత్రులం కావడంతో తమను చిన్నచూపు చూస్తున్నారని అంతర్గత సమావేశాల్లో ఆవేదన చెందుతున్నారు.

మంత్రి మాటకే దిక్కు లేదు..

జిల్లాల నుంచి ఎమ్మెల్యేలు చేసిన సిఫారసులను తాను ఆమోదిస్తే, ఆ అధికారి మాత్రం వాటిని సున్నితంగా తిరస్కరిస్తున్నారంటూ ఓ మహిళా మంత్రి వాపోయారు. ఆమె కథనం ప్రకారం.. తమ జిల్లాకు ఓ ఐఏఎస్ అధికారిని ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే మంత్రిని అభ్యర్థించారు. ఎమ్మెల్యే సూచించిన పేరును సదరు అధికారికి ఆమె సిఫారసు చేశారు. అయితే ఆ తర్వాత మంత్రి ప్రమేయం లేకుండానే నాన్ ఐఏఎస్ అధికారిని ఆయన నియమించేశారు. దీంతో మంత్రి అగ్గిమీద గుగ్గిలమయ్యారు. నిజానికి, ఆ పోస్టు భర్తీ చేసిన విషయం కూడా ఆమెకు సమాచారం లేదట. అసెంబ్లీ సమావేశాల సమయంలో ఆ ఎమ్మెల్యే చెప్తేనే ఆమెకు కూడా తెలిసింది. తన శాఖలోనే తనకు తెలియకుండా నియామకాలు చేపడతారా అని నిలదీస్తే....'ఏముందిలే... తీసేద్దాం' అంటూ ఆ అధికారి తేలిగ్గా తీసుకోవడంతో ఆమెకు దిక్కు తోచలేదు. అసెంబ్లీ సమావేశాల్లో వచ్చే ప్రశ్నలపై మంత్రులకు అధికారులు సహకరించాలి. కానీ, ఈ అంశాన్ని ఆయన పట్టించుకోలేదు. దీంతో టీడీపీ నాలెడ్జి సెంటర్, సోషల్ మీడియా, గూగుల్ సహకారం కోరాల్సివచ్చిందని ఓమంత్రి వాపోయారు.

సభకు ఆయన రారు..

శాసనమండలిలో ప్రశ్నలు వచ్చినప్పుడు ఆయా శాఖలకు సంబంధించిన కార్యదర్శులు హాజరుకావడం ఆనవాయితీ. ఈ అధికారి మాత్రం ఒక్కసారి కూడా హాజరు కాలేదని, కింది స్థాయి ఉద్యోగులను పంపి సరిపెట్టారని చెబుతున్నారు. ఆ అధికారికి బడుగు శాఖలన్నా, తామన్నా లెక్కలేదని ఆ మహిళా మంత్రి... సీఎం, సీఎంపేషీ వద్ద వాపోయినట్లు సమాచారం. ఇప్పుడైతే అత్యంత కీలకమైన శాఖ వ్యవహారాల్లో ఆయన బిజీగా ఉన్నారు. ఏకంగా ఆ పెద్దశాఖ మంత్రే ఆయన చాంబర్‌కు వచ్చి సమీక్ష చేస్తుంటారని సమాచారం.

కోచింగ్‌లో ఇష్టారాజ్యం..

డీఎస్సీ కోచింగ్ కోసం అన్నీ సంక్షేమ శాఖల నుంచి నిధులను క్రోడీకరించి హడావుడిగా కోచింగ్ సంస్థలకు ఆ అధికారి మంజూరు చేశారు. ఆ తర్వాత నుంచి కోచింగ్ సెంటర్ ప్రారంభించడంలో శ్రద్ధ చూపడం లేదని, వాటి ఎంపికలో కూడా ఆ అధికారి ఇష్టారాజ్యంగా చేశారంటూ తమ అనుచరులతో మంత్రులు అంతర్గతంగా వాపోతున్నారని తెలిసింది.

ఆదేశించినా జరగని వార్డెన్ బదిలీ..

ఆయన చూస్తున్న మూడు శాఖల పరిధిలోని విద్యాసంస్థలను బలోపేతం చేసేందుకు ఓ రిటైర్డ్ అధికారిని నియమించారు. ఆ తర్వాత మూడు నెలలకే తొలగించారు. ఆయనను ఎందుకు నియమించారో, ఎందుకు తొలగిస్తున్నారో.. ఏదీ తనకు చెప్పలేదని ఓ మంత్రి వాపోయారు. ఓ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో టీడీపీ నేతకి గత ఎన్నికల్లో సమీకరణల కారణంగా సీటు దక్కలేదు. వార్డెన్‌గా పనిచేస్తున్న తన భార్య ట్రాన్స్‌ఫర్ కోసం మంత్రిని ఆయన కోరారు. ఆమెను బదిలీచేయాలని మంత్రి ఆదేశించారు. కానీ, .ఆ అధికారి పట్టించుకోలేదు. మంత్రిగా ఉండి కనీసం వార్డెన్‌ను కూడా బదిలీ చేసుకోలేని స్థితిలో తాను ఉన్నానంటూ తన సన్నిహితుల వద్ద వాపోయారు.

విజిలెన్స్ కమిషన్‌లో పెండింగ్ ఫైళ్ల పరుగులు

అమరావతి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ శాఖల ఉద్యోగులకు సంబంధించిన ఫైళ్ల క్లియరెన్స్‌పై విజిలెన్స్ కమిషన్ ఎట్టకేలకు ప్రత్యేక దృష్టి పెట్టింది. ఫైళ్ల క్లియరెన్సు కాక ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 19న 'ఫైళ్ల క్లియరెన్స్‌లో ఎడతెగని జాప్యం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. దీనిపై విజిలెన్స్ కమిషన్ ఉన్నతాధికారి స్పందించారు. ఉద్యోగుల ఫైళ్లు పెండింగ్ పెట్టడంపై కింది స్థాయి అధికారులపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిసింది. ఆయన ఆదేశాలతో గత వారం రోజుల్లో అనేక మంది ఉద్యోగుల ఫైళ్లను పరిష్కరించినట్లు సమాచారం. దీర్ఘకాలంగా పేరుకుపోయిన ఫైళ్లకు మోక్షం లభిస్తుండటంతో ఉద్యోగులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎన్‌డీపీఎల్ నియంత్రణకు చర్యలు

- ఎక్సైజ్ ఈడీ రాహుల్‌దేవ్ శర్మ

అమరావతి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల్లో పన్ను చెల్లించిన మద్యం(ఎన్‌డీపీఎల్) రాష్ట్రంలోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన 'పొరుగు మద్యం.. అదే జోరు' కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. కొత్త మద్యం పాలసీ అమల్లోకి వచ్చాక రాష్ట్రంలోకి ఎన్‌డీపీఎల్ దిగుమతి తగ్గిందన్నారు. అక్టోబరులో 3114 కేసులు, నవంబరులో 3899 కేసులు నమోదయ్యాయని తెలిపారు. 2023తో పోల్చి చూసినా గత రెండు నెలల్లో ఎన్‌డీపీఎల్ తగ్గిందన్నారు. ఎన్‌డీపీఎల్ కట్టడికి సరిహద్దుల్లో 29 చెక్‌పోస్టులు ఏర్పాటుచేశామని, మరో 19 బోర్డర్ మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. అన్ని చెక్‌పోస్టుల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు. అన్ని డిస్టిలరీల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. మద్యంలో బ్రాండ్‌పై 13 రకాల పరీక్షలు, ఈఎన్ఏపై 9 రకాల పరీక్షలు జరుగుతున్నాయని ఆయన వివరించారు.

పేర్ని జయసుధ ముందస్తు బెయిల్‌పై 30న తీర్పు

మచిలీపట్నం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పీడీఎస్ బియ్యం మాయం కేసులో మాజీ మంత్రి పేర్ని నాని భార్య పేర్ని జయసుధ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం 9వ అదనపు జిలా కోర్టులో వాదనలు జరిగాయి. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయాధికారి బెయిల్ పిటిషన్‌పై తీర్పును ఈ నెల 30కి వాయిదా వేశారు.

మైనార్టీ యువతకు ఉచిత శిక్షణ

- దరఖాస్తు చేసుకోవాలన్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక రంగంలో ఉపాధి, స్వయం ఉపాధికి ఇస్తున్న ఉచిత శిక్షణకు రాష్ట్రంలోని మైనార్టీలకు చెందిన యువత దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కోరారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్(సీడాప్) నిర్వహణలో ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు సరిపోలని నైపుణ్యాలు ఉన్న వారికి, నాణ్యమైన రెసిడెన్షియల్ శిక్షణలను ఉచితంగా అందించి స్కిల్ గ్యాప్‌ను భర్తీ చేస్తుందని తెలిపారు. ఉద్యోగ నియామకాలు, పోస్ట్ జాబ్ ప్లేస్‌మెంట్‌కు మద్దతు కూడా ఉంటుందని తెలిపారు. అన్ని జిల్లా కేంద్రాల్లో ఉన్న మైనార్టీల సంక్షేమ, మైనార్టీ ఫైనాన్స్ కార్యాలయాల్లో తమ దరఖాస్తు ఫారాలను అందించాలని మంత్రి ఫరూక్ కోరారు.

పన్నుల మొండి బకాయిల వసూళ్లు ముమ్మరం

- వాణిజ్య పన్నులశాఖ చీఫ్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు



డివిజన్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న వాణిజ్య పన్నులశాఖ చీఫ్ కమిషనర్ అహ్మద్ బాబు

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో పన్నుల ఆదాయాన్ని పెంపొందించడంతోపాటు మొండి బకాయిలు వసూలు చేయడంపై వాణిజ్య పన్నుల శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ చీఫ్ కమిషనర్ అహ్మద్ బాబు తమ శాఖ డివిజన్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం ఆయన విజయవాడ అశోక్‌నగర్‌లో ఉన్న ఒకటో డివిజన్ కార్యాలయం, అయోధ్యనగర్‌లోని మూడో డివిజన్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఐ

1 నుంచి సదరం క్యాంపులకు బ్రేక్

అమరావతి, డిసెంబర్ 27(ఆంధ్రజ్యోతి) : జనవరి ఒకటి నుంచి సదరం క్యాంపులు, సదరం సర్టిఫికెట్ల పంపిణీని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సెకండరీ హెల్త్ డైరెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో వికలాంగ ధ్రువీకరణ పత్రాల తనిఖీల ప్రక్రియ పూర్తయ్యేవరకూ కొత్త వికలాంగ సర్టిఫికెట్ల జారీని నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

మాదిగ కార్పొరేషన్ సభ్యుల నియామకం

అమరావతి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాదిగ కార్పొరేషన్ సభ్యులుగా 15 మందిని నియమిస్తూ సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటికే మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవిని నియమించారు. తాజాగా కార్పొరేషన్ సభ్యులను నియమించారు. వారు రెండేళ్ల పాటు పదవుల్లో కొనసాగుతారు.

సంక్రాంతికి ఏపీకి 2,400 ప్రత్యేక బస్సులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి : సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లేవాళ్ల కోసం హైదరాబాద్ నుంచి 2,400 ప్రత్యేక బస్సులను ఏపీఎస్ ఆర్టీసీ నడుపుతోంది. జనవరి 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు సంక్రాంతి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని ఏపీఎస్ ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎల్.విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఎంజీబీఎస్‌లో రద్దీని నివారించేందుకు జనవరి 10 నుంచి 12వ తేదీ వరకు కర్నూల్, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, ఒంగోలు, మాచర్ల వైపు వెళ్లే రెగ్యులర్ సర్వీసులతో పాటు ప్రత్యేక బస్సులు ఎంజీబీఎస్ ఎదురుగా ఉన్న గౌలిగూడ సిటీ బస్‌స్టాండ్ నుంచి నడవనున్నట్లు వెల్లడించారు. www.apsrtconline.in ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు.



జాతీయ రహదారి పక్కన గ్రీన్‌బెల్టును తొలగించి నిర్మాణాలు చేపడుతున్న మాల్ యాజమాన్యం, హోం మంత్రి అనిత ఆశీస్సులతో అంటూ ఫ్లెక్సీ



వైసీపీ అధికారంలో ఉండగా మాల్ ముందు మంత్రి అమర్‌నాథ్ పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

విశాఖలో వింత పోకడలు

- కూటమి నేతల ఫ్లెక్సీలు పెట్టి అడ్డగోలు నిర్మాణాలు
- నిర్మాణంలోని మాల్ ఎదుట 'అనిత ఆశీస్సుల'తో ఫ్లెక్సీ
- ఆ చుట్టుపక్కల జీవీఎంసీ, ఏపీఐఐసీ స్థలాల ఆక్రమణ
- రియల్టర్ల కొత్త రకం దందా.. చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న నాయకులు

విశాఖపట్నం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు వినూత్న పోకడలకు శ్రీకారం చుట్టారు. వారి అనధికార వ్యవహారాలు సజావుగా నడవడానికి అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీ నాయకుల ఫ్లెక్సీలను తమ నిర్మాణ ప్రాంగణాల్లో పెట్టి అధికారులు అక్కడకు రాకుండా నిలువరించడం వారి అలవాటుగా మారింది. ఈక్రమంలో పాస్‌పోర్టు సేవా కేంద్రం ఎదురుగా (కప్పరాడ) జాతీయ రహదారిని ఆనుకొని మూడు ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న మెగా మాల్ వద్ద 'హోం శాఖ మంత్రి అనిత ఆశీస్సులతో' అంటూ ఫ్లెక్సీ పెట్టారు. అలాగే స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఐటీ మంత్రి లోకేశ్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫ్లెక్సీలతో పాటు సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చికి సంస్థ యజమాని శాలువా కప్పుతున్న ఫ్లెక్సీ పెట్టి కూడా పనులు చేస్తున్నారు. నిజానికి, రెండేళ్లుగా నిర్మాణాలు జరుపుకొంటున్న ఈ మాల్ వద్ద వైసీపీ హయాంలో అప్పటి మంత్రి గుడివాడ అమర్నాథ్ ఫ్లెక్సీ ఉండేది. షాపింగ్ మాల్‌కు రాకపోకల కోసం జాతీయ రహదారి పక్కనున్న గ్రీన్‌బెల్ట్‌ను పూర్తిగా తొలగించారు. మాల్‌కు రాకపోకల కోసం జీవీఎంసీ స్థలంలో సిమెంట్ ప్లాట్‌ఫాం నిర్మించారు. ఏపీఐఐసీ భూమిలో కొంత ఆక్రమించి పనులు చేపట్టినట్టు సమాచారం. బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఫిర్యాదు చేసేంత వరకు జీవీఎంసీ అధికారులు ఆ నిర్మాణం వైపు కన్నెత్తి చూడలేదు. ఇప్పుడు కూడా ఆక్రమించిన స్థలానికి డబ్బులు వసూలుచేయడం గానీ, లీజు మొత్తం ఖరారుగానీ చేయకుండా చోద్యం చూస్తున్నారు. ఏపీఐఐసీ ఇచ్చిన నోటీసులను మాల్ యాజమాన్యం పక్కన పెట్టేసినా ఏమీ చేయలేకపోతున్నారు. కూటమి నాయకులకు ఇవన్నీ తెలిసినా ఎవరూ నోరెత్తడంలేదు.

డ్రోన్లు తీర్చిన అమరావతి అందం!

- పచ్చదనాన్ని పెంచే ప్రయోగం సక్సెస్
- కిలోమీటరు మేర చెట్లపై డ్రోన్లతో పిచికారీ
- సీడ్ యాక్సెస్ రోడ్డులో ఏడీసీ వినూత్న కార్యక్రమం
- వృక్షాలపై పోషకాలు, మందుల చిలకరింపు
- కేవలం అర్ధగంటలోనే పని ముగించిన వైనం



ఎత్తైన చెట్లపై మందు పిచికారీ చేస్తున్న డ్రోన్

విజయవాడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏడీసీ)... డ్రోన్ల బాట పట్టింది. డ్రోన్ సమ్మిట్ ఇచ్చిన స్ఫూర్తితో అమరావతి రాజధానిలో పచ్చదనాన్ని పరిరక్షించేందుకు, పర్యవేక్షించేందుకు ముందుకొచ్చింది. 'డ్రోన్ల వినియోగం పెంచండి' అన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలను కార్యరూపంలోకి తెచ్చింది. రాజధానిని భవిష్యత్తులో ఉద్యానవనాలు, పచ్చటి ప్రకృతితో అలరారేలా ఏడీసీ అద్భుతమైన ప్రణాళికలు రూపొందించింది. ఇప్పటికే పలు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. అమరావతి అర్బన్ గ్రీనరీ, ల్యాండ్ స్కేపింగ్ వంటి పనులు పెద్ద ఎత్తున చేపడుతోంది. అమరావతిలో నాటే ప్రతి మొక్క ఎదిగేలా, ఎదిగిన చెట్లను సంరక్షించుకునేలా, అవి మరింత బలంగా పెరగటానికి వీలుగా డ్రోన్ల సహాయాన్ని తీసుకోవాలని ఏడీసీ సీఎండీ లక్ష్మీపార్థసారథి భాస్కర్ నిర్ణయించారు. దీంతో ఉద్యాన విభాగాధిపతి వి.ధర్మజ ఇతర సిబ్బంది డ్రోన్ల వినియోగాన్ని తీసుకువచ్చారు. శుక్రవారం సీడ్ యాక్సెస్ రోడ్డులోని చెట్లను పర్యవేక్షించటంతో పాటు పోషకద్రవాల పిచికారీ కూడా నిర్వహించారు. దాదాపుగా సీడ్ యాక్సెస్ రోడ్డు వెంబడి ఒక కిలోమీటరు పొడవునా డ్రోన్లతో పోషకాలను పిచికారీ చేయించారు. ప్రయోగాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. అలాగే చెట్లు ఏ పరిస్థితులలో ఉన్నాయన్నది కూడా అధికారులు పరిశీలించగలిగారు. రాజధానిలో అందమైన పూలమొక్కలు అనేకం నాటారు. నాటుతున్నారు. వీటితో పాటు చెట్ల తెగుళ్లను నివారించటానికి, వాటిని సంరక్షించటానికి డ్రోన్లు ఎంతగానో దోహదపడతాయని ఏడీసీ అధికారులు భావిస్తున్నారు. నగరానికి వచ్చే అతిథులను విశేషంగా ఆకర్షించేలా తబోబియా రోజియా మొక్కలు నాటారు. ఇవి పెరిగితే రంగురంగుల పూలతో ఆకట్టుకుంటాయి. ఈ మొక్కలపై డ్రోన్ల ద్వారా 13-0-45 (మల్టీకే) ఫార్ములాతో కూడిన పోషకాలను పిచికారీ చేశారు. సీడ్ యాక్సెస్ రోడ్డుపై 10 కిలోమీటర్ల మేర ఉన్న ఈ మొక్కలను డ్రోన్లతో సంరక్షించాలని నిర్ణయం తీసుకున్నారు.

25 నిమిషాలు.. 35 కిలోమీటర్లు..

చెట్టు పైభాగం పరిస్థితి ఎలా ఉందో కూలీలు తెలుసుకోవటం కష్టం. అలాగే వాటిపై పిచికారీ చేయటం కూడా సాధ్యపడదు. డ్రోన్లద్వారా అయితే పొడవాటి చెట్లపై భాగాలపై కూడా మందులు, పోషకాలను స్ప్రే చేయవచ్చు. ఒక డ్రోన్ సుమారు 25 నిమిషాలు నిర్విరామంగా పనిచేస్తుంది. డ్రోన్ గంటకు 36 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయగలదు. డ్రోన్లద్వారా పోషకాల వినియోగం, నీటి వృధాను కూడా అరికట్టవచ్చు. రానున్న రోజుల్లో రాజధానిలోని 35 ప్రధాన రహదారులపై పచ్చని చెట్లను డ్రోన్లద్వారా పర్యవేక్షించి, పరిరక్షించేందుకు ఏడీసీ సిద్ధమవుతోంది.

'అవినీతి' అధికారికే మళ్లీ చాన్స్..!



ముడుపులు, పైరవీలతో వ్యవసాయ యాంత్రీకరణ విభాగంలో తిరిగి పోస్టింగ్

- వైసీపీ డీలర్లను రంగంలోకి దించుతున్న వైనం
- నొచ్చుకుంటున్న అధికార పార్టీ నేతలు

అమరావతి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యక్తిగత వ్యవసాయ పనిముట్ల పంపిణీకి ప్రభుత్వం సిద్ధమవుతున్న నేపథ్యంలో వ్యవసాయ యాంత్రీకరణ విభాగంలో ఇటీవల తిరిగి చేరిన ఓ అధికారి.. వైసీపీ డీలర్లను రంగంలోకి దించుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సదరు అధికారి 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో రైతు రథం పేరుతో రైతులకు ట్రాక్టర్లు పంపిణీ చేసినప్పుడు పలు అవకతవకలకు పాల్పడ్డారు. డీలర్ల వద్ద కమీషన్లు తీసుకుని, వాస్తవ ధర కన్నా అధికంగా బిల్లులు చేయించారన్న ఆరోపణలున్నాయి. అప్పట్లో సదరు అధికారిపై సీఎం చంద్రబాబు, మంత్రి సోమిరెడ్డికి ఫిర్యాదులు వెళ్లాయి. అతని నిర్వాకం వల్లే గత ప్రభుత్వం రైతు రథం పథకంపై విచారణ చేయించింది. అప్పట్లో వ్యక్తిగత వ్యవసాయ పరికరాలు సరఫరా చేసిన డీలర్ల నుంచి ఆ అధికారి లంచాలు పుచ్చుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఒక వేళ చేతులు తడపకపోతే.. బీమా పాలసీలు చేయించడం, కుటుంబసభ్యులకు బట్టలు తెప్పించుకోవడం వంటివి చేశారన్న ఫిర్యాదులున్నాయి. దీంతో అప్పటి ప్రభుత్వం సదరు అధికారిని రాయలసీమలో భూసార సంరక్షణ విభాగానికి బదిలీ చేసింది. గత ప్రభుత్వంలో శతవిధాలా ప్రయత్నించినా.. ఉన్నతాధికారులు వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో పోస్టింగ్ ఇవ్వలేదు. తాజాగా మధ్యవర్తికి ముడుపులిచ్చి.. ఓ మంత్రి వద్ద పైరవీ చేసి, మళ్లీ కమిషనరేట్‌లో పైగా తాను కోరుకున్న విభాగంలో పోస్టింగ్ సంపాదించారు. రాయలసీమలో ఒకే సామాజికవర్గానికి చెందిన కొందరు వ్యవసాయ యంత్ర పరికరాల కంపెనీలకు డీలర్లుగా ఉన్నారు. వారి నుంచి ముడుపులు పుచ్చుకొని, ఎంప్యానల్ అయ్యేలా సదరు అధికారి పావులు కదుపుతున్నారు. వైసీపీ పాలనలో లబ్ధి పొందిన డీలర్లను ప్రోత్సహించి, అధికార పార్టీ సానుభూతిపరులైన డీలర్లను వెనక్కి నెట్టే ప్రయత్నాలు మొదలు పెట్టారు. మరోవైపు రోటోవేటర్, స్ప్రేయర్లు, సీడ్ డ్రమ్స్, పవర్ టిల్లర్, పవర్ వీడర్స్ వంటి పరికరాల సేకరణ, సరఫరాకు ఏపీ ఆగ్రోస్ సంస్థ నోడల్ ఏజెన్సీగా ఉండగా, నేరుగా వ్యవసాయ శాఖ ద్వారానే యంత్ర సామగ్రి సేకరించేలా ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. గతంలో వ్యవసాయశాఖ కమిషరేట్‌లో సదరు అధికారి పని చేసినప్పుడు వరల్డ్‌బ్యాంక్ ప్రాజెక్ట్‌తో సహా మూడు ప్రాజెక్ట్‌లను పర్యవేక్షించారు. ఈ మూడు ప్రాజెక్ట్‌ల నిర్వహణ సక్రమంగా లేక కనుమరుగయ్యాయి. ఇలాంటి అధికారిని తిరిగి కీలక స్థానంలో నియమించడంపై అధికార పార్టీ నేతలు, డీలర్లు నొచ్చుకుంటున్నారు.

నాడు షాకులు... నేడు శోకాలు

పేలవంగా 'పోరుబాట'

ఉమ్మడి కడపలోనే కాస్త మెరుగు.. గట్టి నేతలున్న చోట్ల జనసమీకరణ

- జమ్మలమడుగు, పులివెందుల, రాయచోటి, ప్రొద్దుటూరుల్లో పర్వాలేదు
- పుంగనూరు, తిరుపతి, కోవూరులో కూడా..
- చాలాచోట్ల 100-200 లోపే హాజరు
- పోరుబాటకు కదలిరాని నేతలు, శ్రేణులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

విద్యుత్ ట్రూ అప్ చార్జీల పెంపును నిరసిస్తూ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నిర్వహించిన 'పోరుబాట' పేలవంగా ముగిసింది. చాలా చోట్ల జనస్పందన లేదు. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయాల వద్ద జరిగిన ఈ ఆందోళనల్లో వైసీపీ శ్రేణులు, నేతలు మొక్కుబడిగా పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు పలువురు ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. బలమైన నేతలు ఉన్న చోట్ల మాత్రం జనసమీకరణ జరిగింది. ముఖ్యంగా మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు జగన్ సొంత ఉమ్మడి జిల్లా కడపలో 4-5 నియోజకవర్గాల్లో పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. జమ్మలమడుగు, పులివెందుల, ప్రొద్దుటూరు, రాయచోటిల్లో స్థానిక వైసీపీ నేతలు తమ ఆందోళనలకు బాగానే జనాలను తరలించారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో, తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి నేతృత్వంలో భారీగానే నిరసనలు జరిగాయి. ఏలూరు జిల్లాలో ఎక్కడా 50 మంది కూడా కనబడలేదు. విజయనగరం జిల్లాలో చీపురుపల్లిలో తప్ప ఎక్కడా స్పందన లేదు. నంద్యాల, విశాఖపట్నంలోనూ దాదాపు ఇదే పరిస్థితి. శ్రీకాకుళం జిల్లాలో ధర్నాలకు మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు దూరంగా ఉన్నారు. ఆయన కుమారుడు కూడా హాజరు కాలేదు. ఒక్క నరసన్నపేట నియోజకవర్గ కేంద్రంలోనే మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ నేతృత్వంలో ఆందోళన జరిగింది. మిగతా చోట్ల ద్వితీయ శ్రేణి నేతలే నిర్వహించారు. నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం బుచ్చిరెడ్డిపాళెంలో మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, అనంతపురంలో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం, పార్వతీపురంలో వైసీపీ కేడర్ హాజరు ఫర్వాలేదు. కాకినాడలో మాజీ మంత్రి కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరెడ్డి ఆధ్వర్యంలో పోరుబాట జరిగింది. వైసీపీ కార్యాలయానికి 300 మీటర్ల దూరాన ఉన్న విద్యుత్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయానికి నేతలు ర్యాలీగా వెళ్లారు. ఇద్దరు నేతలు కలసి ఆందోళన చేపడితే వెంట 150 మంది మించి రాలేదు. తునిలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, పిఠాపురంలో వంగా గీత, పెద్దాపురంలో దవులూరి దొరబాబు, జగ్గంపేటలో తోట నరసింహం, విశాఖలో వాసుపల్లి గణేశ్, ఉరవకొండలో విశ్వేశ్వరరెడ్డి నేతృత్వంలో జరిగిన ధర్నాల్లో జనమెవరూ పాల్గొనలేదు. వీటితో పాటు అనేక నియోజకవర్గాల్లో పోరుబాట జరిగినా స్పందన కనిపించలేదు. కాగా.. ధాన్యం కొనుగోళ్ల కోసం ఈ నెల రెండో వారంలో వైసీపీ చేపట్టిన రైతు పోరుబాట కూడా చప్పగా సాగిన సంగతి తెలిసిందే.

విద్యుత్తు చార్జీలపై జనవరిలో నిరసనలు: సీపీఎం

నరసాపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఎం ఆందోళనలకు పిలుపు ఇచ్చింది. వచ్చే నెల 7, 10 తేదీల్లో విజయవాడ, కర్నూలులో ధర్నాలు, భోగి మంటల్లో చార్జీల పెంపు జీవోలను దహనం చేస్తామని ఆ పార్టీ ఓ ప్రకటనలో పేర్కొంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1, 2, 3, 4 తేదీల్లో నెల్లూరు జిల్లాలో సీపీఎం రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపింది. సభలకు రాష్ట్రం నలుమూలల నుంచి 470 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరావు, మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బలరాం పాల్గొన్నారు.

'బాదుడే బాదుడు'...
అని 2019 ఎన్నికల్లో ఊరూరా మైకుల్లో హోరెత్తించి మరీ అధికారంలోకి వచ్చారు!

'పవర్'లోకి రాగానే...
ట్రూ అప్ చార్జీల పేరిట ఏటేటా షాకుల మీద షాకులు ఇస్తూ బాధలు పెట్టారు!

ఇప్పుడు... అధికారంలో
పోగానే 'బిల్లులు భగభగ' అంటూ తన రోత పత్రికలో రాతలు రాస్తున్నారు! అసలు విషయం ఏమిటంటే... షాకులు ఇచ్చిందీ ఆయనే! శోకాలు పెడుతున్నదీ ఆయనే!


ఇదీ... జగన్మాయ!
మరో నిజం ఏమిటంటే... 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచలేదు. ఇప్పుడు... కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదికి సంబంధించి ఎలాంటి సర్దుబాటు చార్జీలు ఉండబోవని ఇప్పటికే స్పష్టం చేసింది. వెరసి.. ఇప్పుడు భగభగ మంటున్న బిల్లులకు ఆజ్యం పోసింది... నిప్పు రాజేసింది ఎవరో కాదు! ఆయన... వైఎస్ జగన్మోహన్ రెడ్డి! అదే జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ ధర్నాలు, నిరసనలకు పిలుపునివ్వడం విచిత్రం!

(మొదటి పేజీ తరువాయి)

'చార్జీలు పెంచడం లేదు' అంటూ వార్షిక వ్యయ నివేదికలను సమర్పించే సమయంలో ఘనంగా ప్రకటించడం... ఆ తర్వాత ట్రూఅప్, ఇంధన సర్దుబాటు పేరిట భారం వేయడం! ఇదే రివాజు. ఇలా ట్రూఅప్ చార్జీల పేరిట వినియోగదారులపై దొంగ దెబ్బతీయవచ్చన్న ఆలోచన గతంలో ఏ ముఖ్యమంత్రికీ రాలేదు. ట్రూ అప్, ఇంధన సర్దుబాటు ప్రతిపాదనలు పరంపర జగన్ ఐదేళ్ల పాలనలో కొనసాగుతూ వచ్చింది. 2019-20లో డిస్కమ్‌లు రూ.1788.73 కోట్లకు ఈఆర్‌సీకిప్రతిపాదనలు పంపగా.. ఈఆర్‌సీ ఏకంగా రూ.1851.15 కోట్లకు ఆమోదం తెలిపింది. 2021-22లో రూ.3554.58 కోట్ల మేర ఇంధన సర్దుబాటు చార్జీల ప్రతిపాదనలను డిస్కమ్‌లు చేశాయి. రూ.3082.09 కోట్లకు ఈఆర్‌సీ ఆమోదం తెలిపింది.

అక్కడా 'మేనేజ్' చేశారు...

ట్రూఅప్ చార్జీల వరుస బాదుడుతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోందని గ్రహించిన జగన్.. పెంపు ప్రతిపాదనలపై ఈఆర్‌సీ వెంటనే ఆమోద ముద్ర వేయకుండా 'మేనేజ్' చేసుకున్నారు. మరీ ముఖ్యంగా ఎన్నికల ముందు చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. సహజంగా డిస్కమ్‌ల ప్రతిపాదనలపై 90 రోజుల్లోనే ఈఆర్‌సీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కానీ... 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చేంత వరకూ ఈఆర్‌సీ 2022-23 ట్రూఅప్‌పై నిర్ణయం తీసుకోలేదు. అదే సమయంలో... ఈఆర్సీ ఆమోదం లేకుండానే డిస్కమ్‌లు జనం నుంచి చార్జీలు వసూలు చేసి దొంగ దెబ్బ తీశాయి. ఈ భారం రూ.2869 కోట్లు! ఇక జగన్ పాలనలో చివరి ఏడాది 2023-24లోనూ ట్రూఅప్ చార్జీల ప్రతిపాదనలను ఈఆర్‌సీకి పంపేందుకు డిస్కమ్‌లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. చివరి ఏట.. ఏకంగా రూ.12,849 కోట్ల బాదుడుకు సిద్ధమయ్యారు. దీనిపైనా.. ఈఆర్‌సీ తన నిర్ణయాన్ని పెండింగ్‌లో పెట్టింది. ఎన్నికలు ముగిసి, కూటమి సర్కారు వచ్చాక 2022-23లో రూ.6702 కోట్లకు.. 2023-24లో రూ.9400 కోట్ల వసూలుకు ఆమోదం తెలిపింది. విచిత్రమేంటంటే .. జగన్ పాలనలో ఆఖరి ఏట వినియోగదారులకు తెలియకుండా యూనిట్‌కు 40 పైసల చొప్పున ట్రూఅప్ చార్జీల భారాన్ని వేశారు. వెరసి... కూటమి సర్కారులో 'బిల్లులు భగభగమంటున్నాయి' అని శోకాలు పెడుతున్న రూ.15000 కోట్ల విద్యుత్తు భారమంతా.. జగన్ పాలనలోని చివరి రెండు సంవత్సరాల్లో ఆయన ప్రతిపాదించినవే. తన జమానాలో పెంచిన చార్జీలను ఇప్పుడు తగ్గించాలనడమే పెద్ద విచిత్రం!



ఇదీ జగన్ బాదుడు

అధికారంలోకి వచ్చినప్పటి నుంచే జనానికి జగన్ కరెంటు షాకులు ఇవ్వడం మొదలుపెట్టారు. ఎలాగంటే...

2020 ఫిబ్రవరిలో 500 యూనిట్లు దాటి వాడిన వారిపై యూనిట్‌కు 90 పైసల పెంపు భారం	రూ.1,300 కోట్లు
2020 మే నెలలో శ్లాబులు సవరణ	రూ.1,500 కోట్లు
2021 ఏప్రిల్‌లో కిలోవాట్‌కు రూ.10 పెంపు	రూ.3,542 కోట్లు
2014-19 మధ్య కాలంలో ఆదాయ వ్యయ వ్యత్యాసం తలెత్తిందంటూ జగన్ మోపిన భారం	రూ.3,669 కోట్లు
2022 ఏప్రిల్ శ్లాబుల కుదింపు పేరిట	రూ.3,900 కోట్లు
2021-22 విద్యుత్ కొనుగోలు సర్దుబాటు	రూ.3,082 కోట్లు
2023 మే నుంచి ఫ్యూయల్ & పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్	రూ.400 కోట్లు
2022-23 ట్రూఅప్ ప్రతిపాదనలు	రూ.8,113 కోట్లు
2023-24 ఇంధన సర్దుబాటు ప్రతిపాదనలు	రూ.12,849 కోట్లు

(చివరి రెండు ప్రతిపాదనలపై ఈఆర్‌సీ కూటమి సర్కారు వచ్చాక నిర్ణయం తీసుకుంది)

చెదురుమదురుగా వర్షాలు
పెరగనున్న చలి

విశాఖపట్నం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం శుక్రవారం పూర్తిగా బలహీనపడింది. అయితే ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో సముద్రం నుంచి వస్తున్న గాలులతో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల శుక్రవారం తెలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. మరికొన్నిచోట్ల సుమారు వారం రోజుల తర్వాత ఎండ కాయడంతో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు, మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. రానున్న 24 గంటల్లో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో చెదురు మదురుగా వర్షాలు కురుస్తాయని, ఉత్తర కోస్తాలో పొడి వాతావరణం నెలకొంటుందని వాతావరణశాఖ తెలిపింది. రానున్న రెండు, మూడు రోజుల తర్వాత చలి స్వల్పంగా పెరిగి రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయని వెల్లడించింది.

ప్రాణాలు తీస్తున్న వాతావరణ వైపరీత్యాలు

- 2024లో ప్రపంచవ్యాప్తంగా 3,700 మంది మృతి: డబ్ల్యూడబ్ల్యూఏ నివేదిక

న్యూఢిల్లీ, డిసెంబరు 27: వాతావరణ మార్పులు జీవకోటికి పెను సవాల్‌గా మారుతున్నాయి. ఈ మార్పుల వల్ల వాతావరణ వైపరీత్యాలు ఏర్పడి ఏటా వేలాది ప్రాణాలను బలితీసుకుంటున్నాయి. 2024లో సంభవించిన 26 వాతావరణ వైపరీత్యాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా 3,700 మందికిపైగా మరణించారని, లక్షలాది మంది నిరాశ్రయులయ్యారని తాజా నివేదిక వెల్లడించింది. వాతావరణ మార్పుల కారణంగా చోటుచేసుకుంటున్న అసాధారణ పరిస్థితులపై వరల్డ్ వెదర్ అట్రిబ్యూషన్ (డబ్ల్యూడబ్ల్యూఏ), క్లైమేట్ సెంట్రల్ సంస్థలు అధ్యయనం చేసి.. ఆ నివేదికను శుక్రవారం వెల్లడించాయి. మానవ తప్పిదాల వలన వాతావరణానికి కలిగే హాని కారణంగా 2024లో ప్రపంచవ్యాప్తంగా సగటున 41 రోజులపాటు విపరీతమైన వేడిని ఎదుర్కోవాల్సి వచ్చిందని ఈ నివేదిక పేర్కొంది. ఈ వేడి వాతావరణం వడగాడ్పులు, కరువులు, తుఫాన్లు, వరదలకు కారణమైందని తెలిపింది. కేరళ పరిసర ప్రాంతాల్లో వరదలకు కూడా వాతావరణ మార్పులే కారణమని పేర్కొంది. అలాగే.. సుడాన్, నైజీరియా, కామెరూన్ దేశాల్లో సంభవించిన వరదల్లో సుమారు 2వేల మంది ప్రాణాలు కోల్పోయారని, లక్షలాది మంది నిరాశ్రయులయ్యారని ఈ నివేదిక గుర్తుచేసింది. 2040 లేదా 2050వ దశకం నాటికి ఉష్ణోగ్రతలు మరో 2 డిగ్రీలమేర పెరిగితే ఈ ప్రాంతాల్లో ఏటా ఇదే స్థాయిలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.

చార్జీలను మేం పెంచలేదు...
పెంచం

- ఉనికి కోసమే వైసీపీ డ్రామాలు: గొట్టిపాటి

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ హయాంలో సీఎం హోదాలో పెంచిన విద్యుత్తు చార్జీలను నిరసిస్తూ ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ధర్నాలకు పిలుపును ఇవ్వడమేంటి?' అని మాజీ సీఎం జగన్‌ను విద్యుత్తు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రశ్నించారు. వైసీపీ హయాంలో పెరిగిన విద్యుత్తు చార్జీలకు నిరసగా జగన్ ధర్నాకు పిలుపును ఇవ్వడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వైసీపీ చేపట్టిన ధర్నా కార్యక్రమానికి వైసీపీ ముఖ్య నేతలు దూరంగా ఉన్న నేపథ్యంలో గొట్టిపాటి పత్రికా ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వానికి విద్యుత్తు చార్జీలు పెంచే ఆలోచన లేదన్నారు. కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీలు పెంచబోదని స్పష్టం చేశారు. 2019 నుంచి జగన్ ప్రభుత్వం ప్రజలపై రూ.35,000 కోట్ల భారాన్ని వేసిందన్నారు. అంతేకాకుండా రూ.1,20,000 కోట్ల నష్టాల్లోకి విద్యుత్తు రంగాన్ని తోసేసిందన్నారు. గుట్టుచప్పుడు కాకుండా ఈఆర్‌సీకి ట్రూఅప్, ఇంధన సర్దుబాటు ప్రతిపాదనలను జగన్ పంపారని గొట్టిపాటి ఆగ్రహం వ్యక్తంచేశారు ప్రతిపాదనలు వచ్చిన 90 రోజుల్లోనే ట్రూఅప్, ఇంధన సర్దుబాటు చార్జీలపై నిర్ణయం తీసుకోవాల్సిన ఈఆర్‌సీ... ఎన్నికల దాకా ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించకపోవడమేంటని నిలదీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈఆర్‌సీ విద్యుత్తు చార్జీల పెంపు నిర్ణయం తీసుకుందని జగన్ తెలియదా అని గొట్టిపాటి ప్రశ్నించారు. పీపీఏలను రద్దుచేసి విద్యుత్తు వాడకుండానే హైకోర్టు ఆదేశాల మేరకు రూ.8,000కోట్లను చెల్లించాల్సి వచ్చిందని, ఈ భారాన్నంతా ప్రజలపైనే వేశారన్నారు. ఇలా తప్పులన్నీ చేసి, తన పాలనాకాలంలో విద్యుత్తు చార్జీలు మోయలేనంతగా పెంచేసిన జగన్.. ఇప్పుడు తన తప్పుకు తానే నిరసన కార్యక్రమాలకు దిగడం తుగ్లక్ చేష్టలను తలపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చర్చకు రండి.. తప్పెవరిదో తేల్చేద్దాం: సవిత

'జగన్ అసమర్థత, అవినీతి వల్లే విద్యుత్ చార్జీలు పెరిగాయి. ఆయన తుగ్లక్ డ్రామాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. తన పార్టీ ఉనికి కోసం జగన్ సరికొత్త డ్రామాలు ఆడుతున్నారు. రూ.17 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం వేసిందే జగన్. ఆనాడు జగన్ చేసిన ఒప్పంద ఫలితమే నేడు కరెంటు చార్జీల్లో పెరుగుదల. 5ఏళ్ల జగన్ దరిద్రపు పాలనలో తొమ్మిది పర్యాయాలు విద్యుత్ చార్జీలు పెంచారు' అని మంత్రి సవిత మంత్రి మండిపడ్డారు. విద్యుత్ చార్జీల పెంపు పాపం ఎవరిదో తేలుద్దాం, దమ్ముంటే చర్చకు రావాలంటూ జగన్‌కు, సవిత సవాల్ విసిరారు.

వైసీపీ మోపిన భారమే: మంత్రి సంధ్యారాణి

'వైసీపీ హయాంలో ప్రజలపై రూ.32వేల కోట్ల మేర చార్జీల భారం మోపారు. అవే ఇప్పటికీ బిల్లుల్లో వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం కొత్తగా ఒక్క పైసా కూడా పెంచలేదు. ఇప్పుడు పడుతున్న అదనపు భారం అంతా వైసీపీ ప్రభుత్వం మోపి పోయిందే. రెగ్యులేటరీ కమిషన్ ఆదేశాల వల్ల కొంతకాలం పాటు వాటిని వసూలు చేయడం తప్ప మార్గం లేదు' అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు.

రాజధానిలో డీసీ పనులపై
సీఆర్‌డీఏ సమీక్ష

- ఒక్కట్రాన్స్‌కోనే 8 వేలకోట్ల పనులు
- అంచనాలను పెంచిన నేపథ్యంలో ఆరా
- పవర్‌గ్రిడ్, ట్రాన్స్‌కో లైన్ల మార్పిడి అంచనాలలో మెటీరియల్ స్ర్కాప్ చూపలేదని గుర్తింపు
- లైన్లకు 40 శాతం లేబర్ కాస్ట్ పెంపుదల
- సీఆర్‌డీఏపై 370 కోట్ల అదనపు భారం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

అమరావతి రాజధానిలో ఇతర శాఖల పర్యవేక్షణలో చేపట్టే డిపాజిటరీ కంట్రిబ్యూషన్(డీ సీ) పనులపై సీఆర్‌డీఏ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. రాజధానిలో ప్రస్తుతం డీసీ విధానంతో ఏపీ ట్రాన్స్‌కో భూగర్భ విద్యుత్ లైన్లు, టవర్ల మార్పిడి వంటి పనులు చేపడుతోంది. ట్రాన్స్‌కో పిలిచిన టెండర్లలో పలు లోపాలను సీఆర్‌డీఏ అధికారులు గుర్తించారు. తద్వారా రూ.370 కోట్ల అదనపు భారం పడుతోందని అంచనా వేశారు. డీసీ విధానంలో సీఆర్‌డీఏ డబ్బులు ఖర్చు చేస్తుండగా.. పనులు మాత్రం ఆయా శాఖల నేతృత్వంలో జరుగుతున్నాయి. ఒక్క ఏపీ ట్రాన్స్‌కో ద్వారానే రూ.8 వేల కోట్ల వ్యయంతో సీఆర్‌డీఏ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులు క్షేత్రస్థాయిలో జరుగుతున్నాయి. రానున్న రోజులలో మరికొన్ని శాఖల ద్వారా చేయించే పనులు కూడా ఉన్నాయి. టెండర్ల దగ్గర నుంచి అన్నీ సంబంధిత శాఖలే నిర్వహించాల్సి ఉంటుంది. టెండర్ల అంచనాలను ఏ విధంగా నిర్దేశించారన్న దానిపై సీఆర్‌డీఏ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఏపీ ట్రాన్స్‌కో పిలిచిన టెండర్లు వివాదాస్పదం కావటంతో సీఆర్‌డీఏ ఉన్నతాధికారులు వాటిని సమీక్షించగా పలు లోపాలు బయట పడ్డాయి. సీఆర్‌డీఏకు భారీగా నష్టం జరుగుతోందని గుర్తించారు. అలాగే మిగిలిన శాఖలు పిలవబోయే టెండర్లను కూడా పరిశీలిస్తున్నారు.

సీఆర్‌డీఏపై అదనపు భారం

ట్రాన్స్‌కో పిలిచిన టెండర్లలోని లోపాలను సీఆర్‌డీఏ గుర్తిస్తోంది. తాజాగా ట్రాన్స్‌కో పిలిచిన టెండర్లలో ట్రాన్స్‌మిషన్ టవర్ల స్ర్కాప్ ఎను తగ్గించి చూపకపోవటాన్ని అధికారులు గుర్తించారు. రాజధానిలో భవన నిర్మాణాలకు విఘాతంగా ఉన్న పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ట్రాన్స్‌కో విద్యుత్ లైన్లను ఉన్నచోట నుంచి మార్చాలని నిర్ణయించారు. ఆ మేరకు 60 కిలోమీటర్ల పొడవున వేర్వేరుగా మూడు టెండర్లు పిలిచారు. ఈ పనులకు అంచనాలలో ట్రాన్స్‌కో ఎక్కడా కూడా స్ర్కాప్ మెటీరియల్‌ను పొందు పరచలేదు. స్ర్కాప్ మెటీరియల్ అనేది అంచనాల నుంచి తగ్గించాలి. దీనివల్ల సీఆర్‌డీఏపైన భారం కొంత తగ్గుతుంది. ఈ స్ర్కాప్ మెటీరియల్ చూపకపోవటం వల్ల సీఆర్‌డీఏపై రూ.70 కోట్ల భారం పెరిగింది. ఇక సీఆర్‌డీఏ పరిధిలో రూ.8 వేల కోట్ల వ్యయంతో ట్రాన్స్‌కో పనులు చేపడుతుండగా, ఇందులో సుమారుగా రూ.2 వేల కోట్ల విలువైన లేబర్ పోర్షన్ ఉంటుంది. లైన్ల పనులకు ట్రాన్స్‌కో 40 శాతం లేబర్ పోర్షన్‌ను పెంచటాన్ని సీఆర్‌డీఏ గుర్తించింది. మార్గదర్శకాల ప్రకారం లైన్లకు లేబర్ పోర్షన్ 20 శాతమే నిర్దేశించి ఉందని గతంలో ఇదే ట్రాన్స్‌కో అధికారులు సమాచార హక్కుచట్టం కింద సమాచారం ఇచ్చారు. సబ్‌స్టేషన్ల వంటి వాటికి మాత్రమే 40 శాతం వర్తింపు ఉంటుందని తెలిపారు. లైన్లకు 40 శాతం లేబర్ పోర్షన్ ఉండదని స్పష్టం చేశారు. మరి లైన్లకు 40 శాతం ఎందుకు పెంచారన్నది కూడా సీఆర్‌డీఏ ఆరా తీస్తోంది. ఒక్క సీఆర్‌డీఏ పరిధిలోనే లైన్లకు 40 శాతం విధించి.. మిగిలిన చోట్ల 20 శాతం వర్తింపు చేయటం వల్ల భారీగా భారం పడుతోందని గ్రహించింది. సీఆర్‌డీఏ పరిధిలోని లేబర్ పోర్షన్‌లో 300 కోట్ల దాకా భారం పడినట్టు అంచనా వేసింది.

అయిూమా ప్రకారమే ధరలు: ట్రాన్స్‌కో

అమరావతిలో అండర్ గ్రౌండ్ కేబుల్ లైన్ల పనులపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన అండర్ గ్రౌండ్ దందా కథనంపై ట్రాన్స్‌కో స్పందించింది. అండర్ గ్రౌండ్ లైన్లకు నిర్దేశించిన అంచనాలు ఇండియన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఐఈఈఎంఏ) నిర్దేశించిన ప్రకారం నిర్ణయించినట్టు తెలిపింది. 2018లో బేసిక్ ధర రూ.1,17,69,531లు ఉండగా జీవీపీఆర్ అనే సంస్థ 30.52 శాతం పెంపుతో కోట్ చేసినట్టు వివరించింది. దీని ప్రకారం అయిూమా ఫార్ములాను అనుసరించి ప్రస్తుత రేటును నిర్ణయించినట్టు తెలిపింది.

మన్మోహన్ మృతి దేశానికి తీరనిలోటు

- నేటి దేశాభివృద్ధి ఆయన తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణల ఫలితమే: చంద్రబాబు
- మాజీ ప్రధాని భౌతికకాయానికి సీఎం నివాళులు

న్యూఢిల్లీ/అమరావతి, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం చాలా బాధాకరమని, ఆయన మృతి దేశానికి తీరని నష్టమని సీఎం చంద్రబాబు అన్నారు. దేశ నిర్మాణంలో మన్మోహన్ కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. ఢిల్లీలోని మన్మోహన్ నివాసంలో శుక్రవారం ఆయన భౌతికకాయానికి చంద్రబాబు నివాళులర్పించారు. మన్మోహన్‌సింగ్ సతీమణి గురుచరణ్ కౌర్‌ను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మన్మోహన్‌సింగ్ కేంద్ర ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టి దేశానికి దశ, దిశను నిర్దేశించారని, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారని తెలిపారు. దేశంలో విదేశీమారక ద్రవ్యం లేని పరిస్థితుల్లో మన్మోహన్ ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారని తెలిపారు. భారత దేశం ఈ రోజు ప్రపంచంలోనే గొప్పగా మారుతోందంటే ఆనాడు మన్మోహన్ వేసిన పునాదులే కారణమని పేర్కొన్నారు. అధ్యాపకుడిగా జీవితాన్ని ప్రారంభించిన మన్మోహన్ ప్రధాని స్థాయికి ఎదిగారని కొనియాడారు. చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు కింజారపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు బైరెడ్డి శబరి, కేశినేని చిన్ని, సానా సతీశ్ తదితరులు మన్మోహన్‌కు నివాళులర్పించారు. బాపట్ల ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కూడా మాజీ ప్రధాని భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించారు. కాగా, మాజీ ప్రధాని, దివంగత మన్మోహన్‌సింగ్ భౌతికకాయానికి మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ నివాళులర్పించారు.

దేశ పురోగతికి ప్రేరణ

మన్మోహన్‌సింగ్ ఆర్థిక సంస్కరణల ఆద్యుడని, దేశ పురోగతికి ప్రేరణ కల్పించారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. దేశ ప్రయోజనాల కోసం ఆర్థిక సంస్కరణలు చేపట్టిన వ్యక్తిగా మన్మోహన్ చరిత్రలో నిలిచిపోతారని మంత్రి అచ్చెన్నాయుడు సంతాప సందేశంలో తెలిపారు. పదేళ్ల ప్రధానిగా పనిచేసినా, అతి సాధారణ జీవితాన్ని గడిపిన వ్యక్తి మన్మోహన్‌సింగ్ అని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. మన్మోహన్‌సింగ్ ఆర్థిక సంస్కరణల పితామహుడిగా నిలిచిపోతారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. అంకితభావం కలిగిన మన్మోహన్‌సింగ్ విజనరీ లీడర్ అని మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. సరళీకృత ఆర్థిక విధానాలతో దేశాన్ని మలుపుతిప్పిన మహనీయుడు మన్మోహన్‌సింగ్ అని మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి నివాళులర్పించారు. దేశ ఆర్థిక వ్యవస్థని పటిష్టపర్చడంలో మన్మోహన్‌సింగ్ తనదైన ముద్ర వేశారని మంత్రి కొలుసు పార్థసారధి పేర్కొన్నారు. మన్మోహన్‌సింగ్ దేశ ఆర్థిక వ్యూహాన్ని మారుస్తూ, గ్లోబల్ మార్కెట్‌లో భారత్‌ను ఆర్థిక శక్తిగా నిలిపారని మంత్రి కందుల దుర్గేష్ కొనియాడారు. మన్మోహన్‌సింగ్ కన్నుమూత దేశానికి తీరని లోటని మంత్రి సవిత పేర్కొన్నారు. మన్మోహన్‌సింగ్ మరణంతో దేశం మహోన్నత వ్యక్తిని కోల్పోయిందని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. 1990 దశకంలో మన్మోహన్‌సింగ్ సరళీకృత విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థని మలుపుతిప్పారని మంత్రి వాసంశెట్టి సుభాశ్ పేర్కొన్నారు.



మన్మోహన్ సింగ్ సతీమణిని పరామర్శిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ బైరెడ్డి శబరి తదితరులు



మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పిస్తున్న పురందేశ్వరి

నిశ్శబ్ద శక్తి మన్మోహన్‌సింగ్

దూర దృష్టి, విశాల దృక్పథంతో భారత ఆర్థిక వ్యవస్థకు మన్మోహన్‌సింగ్ నూతన దిశానిర్దేశం చేసిన నిశ్శబ్ద శక్తి. ఆయన మరణం బాధాకరం. చట్ట సభలో ఎలా వ్యవహరించాలో ఆయనను చూసి నేటి యువ నాయకులు నేర్చుకోవాలి.

\- స్పీకర్ అయ్యన్న పాత్రుడు

దిగ్ర్భాంతికి గురయ్యా

దేశాన్ని ఆర్థికంగా కొత్త పుంతలు తొక్కించిన మన్మోహన్‌సింగ్ దివంగతులయ్యారన్న వార్త తెలిసి దిగ్ర్భాంతికి గురయ్యా. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా.

\- ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

మహానుభావుడు

దేశ ఆర్థిక విధానాల్లో మన్మోహన్‌సింగ్ ఆదర్శప్రాయమైన మార్పును తెచ్చారు. ఆయన లేని లోటు పూడ్చలేనిది. ఈ దేశాన్ని ఆర్థికంగా ముందుకు నడిపించిన మహానుభావుడు.

\- మంత్రి నారా లోకేశ్

కేంద్ర అనుమతుల కోసం వెయిటింగ్

ఏపీలో భారీ పెట్టుబడులకు ఆర్సెలార్-నిప్పన్ సిద్ధం

డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ రెడీ.. అనుమతులకు కేంద్రానికి ప్రతిపాదనలు

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రానికి భారీ పారిశ్రామిక సంస్థలు వరుసగా తరలివస్తున్నాయి. రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టడానికి ఆర్సెలార్ మిట్టల్- నిప్పన్ స్టీల్ ఉక్కు కర్మాగారం, గూగుల్ ఏఐ డేటా సెంటర్ సిద్ధంగా ఉన్నాయి. వీటి ఏర్పాటుకు కేంద్రం నుంచి కొన్ని అనుమతులు కావాల్సి ఉంది. దాని కోసం ఆ కంపెనీలు తమ ప్రతిపాదనలు ఇప్పటికే ఢిల్లీకి అందచేశాయి. ఈ అనుమతులు త్వరగా సాధించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా తరచూ కేంద్రంలోని సంబంధిత శాఖలతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ రెండు ప్రాజెక్టులు అమల్లోకి వస్తే అవి రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిపై బలమైన ముద్ర వేస్తాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

పెండింగ్‌లో పైప్‌లైన్ నిర్మాణం అనుమతి

ఆర్సెలార్- నిప్పన్ సంయుక్త సంస్థ విశాఖ సమీపంలోని నక్కపల్లిలో లక్షా నలభై వేల కోట్ల రూపాయల భారీ పెట్టుబడితో అతి పెద్ద ఉక్కు కర్మాగారం నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒక అంగీకారం కూడా కుదుర్చుకొంది. ఈ కంపెనీకి అవసరమైన ముడి ఇనుప ఖనిజం ఛత్తీస్‌గఢ్ నుంచి రావాల్సి ఉంది. ద్రవ (స్లర్రీ) రూపంలో పైప్ లైన్ ద్వారా దానిని తెప్పించాలని ఆ కంపెనీ భావిస్తోంది. గతంలో ఎస్సార్ స్టీల్ కంపెనీ కిరండోల్ నుంచి విశాఖకు ఓ పైప్‌లైన్ నిర్మించింది. 267 కిమీ పొడవు ఉన్న ఈ పైప్ లైన్ దేశంలోనే స్లర్రీ రవాణాలో అతి పెద్దది. కానీ ఇది ఎక్కువగా అటవీ ప్రాంతం నుంచి వస్తోంది. అందువల్ల పైప్‌లైన్‌లో కొంత భాగాన్ని మార్చి జాతీయ రహదారుల పక్క నుంచి వేసుకొంటూ రావాలని తాజాగా ప్రతిపాదించారు. దీనివల్ల పైప్‌లైన్‌కు రక్షణ ఉంటుందని భావిస్తున్నారు. కొంత కాలం క్రితం ఆర్సెలార్-నిప్పన్‌లో ఎస్సార్ స్టీల్ విలీనమైంది. దీంతో ఎస్సార్ నిర్మించిన పైప్‌లైన్ కూడా కొత్త కంపెనీ ఆధీనంలోకి వచ్చింది. అయితే పైప్‌లైన్ కొంత భాగాన్ని మార్చడానికి కేంద్ర ప్రభుత్వ అనుమతి కావాల్సి ఉంది. అది వస్తే పైప్‌లైన్ నిర్మాణం, ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం రెండూ ఒకేసారి ప్రారంభించవచ్చన్న అంచనాలో ఆ కంపెనీ ఉన్నట్లు సమాచారం. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడారు. సూత్రప్రాయంగా కేంద్రం కూడా ఆమోదానికి సుముఖత వ్యక్తం చేసింది. అధికారికంగా అనుమతులు వస్తే పనులు వెంటనే ప్రారంభించే అవకాశం ఉంది. పైప్‌లైన్ మార్పుకు సుమారు రూ. వెయ్యి కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు.

గూగుల్ డేటా సెంటర్‌కు రక్షణ..

విశాఖ నగరంలో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో ఇటీవల ఎంఓయూ కుదుర్చుకొంది. గూగుల్‌కు ఇప్పటికే ముంబై, ఢిల్లీలో డేటా సెంటర్లు ఉన్నాయి. ఐటీలో వేగంగా దూసుకువెళ్తున్న వైజాగ్‌లో కృత్రిమ మేధస్సు (ఏఐ)కు ప్రత్యేకంగా ఒక డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని గూగుల్ సంస్థ నిర్ణయించినట్లు సమాచారం. విదేశాలతో సమాచార మార్పిడికి విశాఖ నుంచి సముద్రం అడుగున కేబుళ్లు వేసే యోచనలో కూడా గూగుల్ ఉన్నట్లు తెలుస్తోంది. గూగుల్ డేటా సెంటర్ రాకతో రాష్ట్రానికి మరిన్ని ఐటీ సంస్థలు వచ్చే వీలుందని ప్రభుత్వం ఆశిస్తోంది. ఈ డేటా సెంటర్ విషయంలో గూగుల్ కూడా కేంద్ర ప్రభుత్వం నుంచి కొన్ని అనుమతుల కోసం ఎదురు చూస్తోంది. డేటా సెంటర్‌కు కేంద్రం ప్రత్యేక రక్షణ కల్పించాలని ఆ సంస్థ కోరుతున్నట్లు సమాచారం. గూగుల్ దరఖాస్తు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉంది. అయితే దీనికోసం కొన్ని చట్టాలను మార్చాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. గూగుల్‌కు అనుమతులన్నీ త్వరగా రాబట్టడానికి సీఎం చంద్రబాబు తన వంతు ప్రయత్నం చేస్తున్నారు. కొత్త ఏడాదిలో ఇవన్నీ సాకారం అవుతాయన్న నమ్మకంతో రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు ఉన్నాయి.

పీసీబీ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేం

▸▸ ద్వారంపూడి రొయ్యల ఫ్యాక్టరీ పిటిషన్‌పై హైకోర్టు

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్‌లో ఉత్పత్తి నిలిపివేయాలంటూ కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకొనేందుకు హైకోర్టు నిరాకరించింది. సదరు ఫ్యాక్టరీ వైసీపీ నేత ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సోదరుడిది. కాలుష్య నియంత్రణ పద్ధతులు సక్రమంగా లేకపోవడంతో పీసీబీ ఇచ్చిన ఆదేశాలపై ఆ కంపెనీ ఎండీ ద్వారంపూడి వీరభద్రారెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. దానిపై హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. పీసీబీ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ ఈ దశలో ఉత్తర్వులు ఇవ్వలేమని, కౌంటర్ దాఖలు చేయాలని పీసీబీని ఆదేశించింది. విచారణను జనవరి 3కి వాయిదా వేసింది. కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు మండలం, లంపకలోవలోని రొయ్యల ఫ్యాక్టరీ వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉత్పత్తి నిలిపివేయాలని ఆదేశిస్తూ డిసెంబరు 2న పీసీబీ విశాఖ జోన్ జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిని సవాల్ చేస్తూ కంపెనీ ఎండీ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది వి.సురేందర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఉత్పత్తి నిలిపివేత ఉత్తర్వులు జారీ చేసే అధికారం సదరు అధికారికి లేదని, లోపాలపై తామిచ్చిన వివరణను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. పలు దేశాలతో సరఫరా ఒప్పందాలు ఉన్నాయని, ఉత్పత్తి నిలిపివేస్తే న్యాయపరమైన చిక్కులను ఎదుర్కోవాల్సి వస్తుందని, కాబట్టి పీసీబీ ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని కోరారు. పీసీబీ తరఫున ప్రభుత్వ న్యాయవాది వై.సోమరాజు వాదనలు వినిపిస్తూ... 'ఫ్యాక్టరీలోని వ్యర్థాలను శుద్ధి చేయకుండా నేరుగా కాలువల్లోకి వదులుతున్నారు. ఉల్లంఘనలను సరిచేసుకోవడానికి సమయమిచ్చాం. అయినా పట్టించుకోలేదు. ఐస్ ప్లాంట్ నిర్వహణకు పీసీబీ నుంచి కన్సెంట్ టు ఆపరేట్(సీటీవో) పొందలేదు. అందుకనే ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేస్తాం. ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవద్దు' అని కోరారు.

వాసుదేవరెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయంలో మద్యం బాటిళ్లపై అతికించే సెక్యూరిటీ హోలోగ్రామ్‌ల తయారీ, సరఫరా కాంట్రాక్ట్ టెండర్ అప్పగింత కుంభకోణం వ్యవహారంలో మంగళగిరి సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఏపీ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఆ పిటిషన్ శుక్రవారం విచారణకు రాగా... ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచాలని సీఐడీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. విచారణను జనవరి 3కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు.

సజ్జల భార్గవ్ కేసు విచారణ వాయిదా

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్లలో తనపై బహుళ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ వైసీపీ సోషల్ మీడియా మాజీ కన్వీనర్ సజ్జల భార్గవ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. హోంశాఖ తరఫు ప్రభుత్వ న్యాయవాది జయంతి స్పందిస్తూ.. ఈ వ్యవహారంపై అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపిస్తారని తెలిపారు. కేసు తొలిసారి విచారణకు వచ్చిందని, వివరాల సమర్పణకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అందుకు అంగీకరించిన న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప విచారణను జనవరి 3కి వాయిదా వేశారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడంతో పాటు అనుచిత పోస్టులు పెట్టేలా ప్రోత్సహించారనే ఆరోపణలపై శ్రీసత్యసాయి జిల్లా, రొద్దం పోలీసులు నమోదు చేసిన కేసును మొదటి ఎఫ్ఐఆర్‌గా, ఇదే వ్యవహారంపై వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన ఎఫ్ఐఆర్‌లు అన్నింటినీ వాంగ్మూలాలుగా పరిగణించేలా ఆదేశాలు ఇవ్వాలని భార్గవ్ తన పిటిషన్‌లో కోరారు. మరోవైపు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సజ్జల భార్గవ్‌రెడి, వైసీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు దాఖలు చేసిన పలు వ్యాజ్యాలపై విచారణను హైకోర్టు వచ్చేనెల 3కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.విజయ్ ఉత్తర్వులు జారీ చేశారు.



కంబాలకొండకు కయాకింగ్ కళ

విశాఖపట్నంలో జంతు ప్రదర్శన శాలకు ఎదురుగా ఉన్న కంబాలకొండ చెరువులో పర్యాటకుల కోసం కయాకింగ్ (బోటు షికారు) ఏర్పాటు చేశారు. పర్యాటక సీజన్ కావడంతో చెరువు మొత్తం కయాకింగ్ బోట్లతో కళకళలాడుతోంది. ప్రవేశ మార్గం నుంచి 1.5 కిలోమీటర్లు నడిచివెళ్లాల్సి ఉన్నా.. ఎవరూ వెనక్కి తగ్గడం లేదు. అంతా అక్కడికే క్యూ కడుతున్నారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

మెగా డీఎస్సీ ఇంకెప్పుడు?

(మొదటి పేజీ తరువాయి)


పరిస్థితి నెలకొంది. ఏటా వేసవి సెలవుల అనంతరం జూన్ 12న బడులు తెరుచుకుంటాయి. ఈ ఐదు నెలల్లోపే కొత్త టీచర్ల ఎంపిక, వారికి శిక్షణ పూర్తిచేయడం సాధ్యం కాదనే వాదన వినిపిస్తోంది.

డీఎస్సీకి వరుస బ్రేకులు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 20రోజుల వ్యవధిలోనే డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించేందుకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. అయితే సన్నద్ధతకు కొంత గడువు ఇవ్వాలని అభ్యర్థులు కోరారని, ఆ మేరకు 3నెలలు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. అక్టోబరు 6న డీఎస్సీ ప్రకటనకు ముహూర్తం ఖరారు చేసింది. ఈలోగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) పూర్తిచేసింది. ఇంతలో ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో నోటిఫికేషన్‌కు మరోసారి బ్రేక్ పడింది. వర్గీకరణ సిఫారసుల కోసం ఏకసభ్య కమిషన్‌ను నియమించిన ప్రభుత్వం... మూడు నెలల్లోగా నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఈ కమిషన్ కొద్దిరోజుల కిందటే క్షేత్రస్థాయి పర్యటనలు ప్రారంభించడంతో నివేదికకు కనీసం మరో 2నెలలు పట్టే పరిస్థితి కనిపిస్తోంది. ఆ తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే బడులు తెరిచే నాటికి భర్తీ ప్రక్రియ పూర్తికావడం సాధ్యం కాదు. గతంలో ఎప్పుడూ ఈ ప్రక్రియ అనుకున్న సమయానికి సజావుగా పూర్తికాలేదు. అందులోనూ ఇప్పుడు 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ కావడంతో మరింత సమయం అవసరం.

నిరుద్యోగుల ఎదురుచూపులు

సీఎం తొలి సంతకం పెట్టినప్పటినుంచీ బీఈడీ చదివిన నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో ఎప్పుడు టెట్ నిర్వహించినా కనీసం 4లక్షల మంది పరీక్షలు రాస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ లేకపోవడంతో ఆశావహుల సంఖ్య ఇంకా పెరిగిపోయింది. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడెప్పుడు వస్తుందోనని వారంతా ఆత్రుతగా ఉన్నారు. కానీ వివిధ కారణాలతో డీఎస్సీ వాయిదా పడుతూ వస్తోంది. బడుల్లో టీచర్ల సంఖ్యను తగ్గించేలా గత జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117ను రద్దు చేయాలని నిర్ణయించడంతో, కొత్త ఉపాధ్యాయుల అవసరం పెరగనుంది. ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక టీచర్‌ను కేటాయించాలని, మిగిలిన ప్రాథమిక పాఠశాలల్లోనూ అదనపు టీచర్లను ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈలోగా బడుల పునర్నిర్మాణ ప్రక్రియను పూర్తిచేయనుంది. బడులు తెరిచే నాటికి కొత్త పాఠశాలల వ్యవస్థ అమల్లోకి వస్తే టీచర్ల అవసరం కూడా మరింత పెరుగుతుంది.





రైలు పట్టాలపై ఆగిన లారీ

శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలం చాకర్లపల్లి రైల్వే గేటు వద్ద శుక్రవారం ఓ లారీ పట్టాలపై ఆగిపోయింది. మంగళూరు నుంచి తాడిపత్రి వెళ్తున్న లారీ చాకర్లపల్లి గేటు వద్దకు వచ్చేసరికి బ్యాటరీలో లోపంతో ఆగిపోయింది. రైల్వే సిబ్బంది ట్రాక్‌పై ప్రమాద హెచ్చరిక ఏర్పాటు చేశారు. ఢిల్లీ నుంచి బెంగళూరు వెళుతున్న కర్ణాటక ఎక్స్‌ప్రెస్‌ను రంగేపల్లి స్టేషన్‌లో ఆపేశారు. రాజ్‌కోట్ వెళ్తున్న మరో ఎక్స్‌ప్రెస్‌నూ కాసేపు ఆపారు. ఎట్టకేలకు బ్యాటరీని సరిచేయడంతో లారీ అక్కడి నుంచి కదిలింది. ఈ ఘటనపై లారీ డ్రైవర్ హరీశ్, ఓనర్‌పై కేసు నమోదు చేశామని ఆర్పీఎఫ్ ఎస్ఐ శీనప్ప చెప్పారు.

- సోమందేపల్లి, ఆంధ్రజ్యోతి



వాగులో చిక్కుకున్న టెంపో

▸▸ పోలీసుల చొరవతో 12మంది ప్రయాణికులు సురక్షితం

పామూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): దైవదర్శనానికి వెళ్తూ వాగులో చిక్కుకున్న వాహనంలోని ప్రయాణికులను ప్రకాశం జిల్లా పామూరు పోలీసులు సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. కడపకు చెందిన 12 మంది భద్రాచలానికి టెంపోలో బయలుదేరారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బొట్లగూడూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నల్లవాగులో వీరి వాహనం చిక్కుకుంది. దీంతో ఆందోళన చెందిన ప్రయాణికులు 100కు ఫోన్ చేశారు. సమాచారం అందుకొన్న ఎస్ఐ టి.కిశోర్‌బాబు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ఎక్స్‌కవేటర్ సహాయంతో వాహనాన్ని బయటకు తీయించారు. ప్రయాణికులను మరో వాహనంలో స్వగ్రామాలకు పంపించారు. తమను కాపాడిన పోలీసులకు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.



రేపు పీఎస్ఎల్వీ-సీ60 కౌంట్‌డౌన్

సూళ్లూరుపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్ నుంచి పీఎస్ఎల్వీ-సీ60 ప్రయోగానికి కౌంట్‌డౌన్ ఆదివారం ప్రారంభం కానుంది. ప్రయోగానికి 25గంటల ముందు అంటే రాత్రి 8.58 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. రాకెట్ నాలుగు దశలతో పాటు ఉపగ్రహాల అనుసంధాన పనులను ఇప్పటికే పూర్తి చేశారు. ఈ రాకెట్ ద్వారా స్పేస్ డాకింగ్‌కు చెందిన స్పాడెక్స్ జంట ఉపగ్రహాలను ఇస్రో రోదసిలోకి పంపనుంది. ఈ నెల 30వ తేదీ సోమవారం రాత్రి 9.58 గంటలకు షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. కౌంట్‌డౌన్‌కు సంబంధించిన మిషన్ రెడీనెస్ రివ్యూ (ఎంఆర్ఆర్) సమావేశం షార్‌లో శనివారం జరగనుంది. అనంతరం షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అధ్యక్షతన లాంచింగ్ ఆథరైజేషన్ బోర్డు(ల్యాబ్) ప్రయోగానికి సంసిద్ధత తెలుపనుంది.

గొంతు మీద కాలేసి.. పిడిగుద్దులు!

▸▸ దళిత ఎంపీడీవోపై వైసీపీ మాజీ ఎంపీపీ దాడి

▸▸ అన్నమయ్య జిల్లా గాలివీడులో దౌర్జన్యకాండ

▸▸ ఎంపీపీ గది తాళాలు ఇవ్వనందుకు దాడి

▸▸ హత్యకు యత్నించారని జవహర్‌బాబు ఫిర్యాదు

▸▸ నిందితుడు సుదర్శన్‌రెడ్డి, అనుచరులపై కేసు నమోదు



గాలివీడు ఎంపీడీవో ఆఫీస్ వద్ద గుమికూడిన జనం

రాయచోటి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళితులపై వైసీపీ నేతల దౌర్జన్యాలు ఆగడం లేదు. తాజాగా.. మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో) కార్యాలయంలోకి ప్రవేశించి, విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. గొంతు మీద కాలేసి తొక్కి, పిడిగుద్దులు కురిపించారు. నానా దుర్భాషలాడారు. కులం పేరుతో దూషించారు. ఈ దారుణ ఘటన అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. వైసీపీ నేతలు బరితెగించడానికి కారణం ఏంటంటే.. ఎంపీపీ చాంబర్ తాళాలు అడిగితే.. వైసీపీ నాయకులకు తాళాలు ఇవ్వలేవని, ఎంపీపీ వస్తే ఇస్తానని చెప్పడమే!!

నాకే తాళాలు ఇవ్వవా..?

గాలివీడు ఎంపీడీవోగా దళితుడైన జవహర్‌బాబు పనిచేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం మాజీ ఎంపీపీ, ప్రస్తుత ఎంపీపీ కొడుకు జల్లా సుదర్శన్‌రెడ్డి ఎంపీపీ కార్యాలయానికి వచ్చారు. ఆఫీస్ తాళాలు కావాలని తన అనుచరులతో ఎంపీడీవోను అడిగించారు. తాళాలు ప్రస్తుతం తన వద్ద లేవని, అటెండర్ వద్ద ఉన్నాయని, 15 నిమిషాలు ఆగమని జవహర్‌బాబు బదులిచ్చారు. తర్వాత మళ్లీ సుదర్శన్‌రెడ్డి అనుచరులు వచ్చి తాళాలు అడగ్గా.. వైసీపీ నేతలకు తాళాలు ఇవ్వలేమని, ఎంపీపీ వస్తే ఇస్తానని తెలిపారు. దీంతో ఆగ్రహించిన సుదర్శన్‌రెడ్డి తన అనుచరులతో కలిసి ఎంపీడీవో చాంబర్‌లోకి వచ్చి, గది తలుపులు మూసి జవహర్‌బాబుపై దాడికి పాల్పడ్డారు. అక్కడున్న సిబ్బంది తలుపులు బద్దలు కొట్టి ఎంపీడీవోను రక్షించారు. దాడి ఘటనపై ఎంపీడీవో మాట్లాడుతూ తనను సుదర్శన్‌రెడ్డి కుర్చీలో నుంచి కిందకు పడేసి.. గొంతు మీద కాలేసి తొక్కాడని, కర్రలు, కుర్చీలతో కొట్టారని విలపిస్తూ పేర్కొన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు ఎంపీడీవోను పరీక్షించి ఆరోగ్యం నిలకడగా లేదని, మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి.. అక్కడి నుంచి కడపరిమ్స్‌కు తీసుకెళ్లారు.

నిందితుడు శ్రీకాంత్‌రెడ్డి ముఖ్య అనుచరుడు

విషయం తెలుసుకున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఎంపీడీవోకు ఫోన్ చేసి ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై ఎంపీడీవో ఫిర్యాదు మేరకు హత్యాయత్నం, విధులకు ఆటంకం కలిగించడం, కులం పేరుతో దూషించడం, అక్రమంగా చాంబర్‌లోకి ప్రవేశించి దాడి చేయడం వంటి ఆరోపణలపై గాలివీడు పోలీసులు సుదర్శన్‌రెడ్డితో పాటు మరో 13 మంది, మరికొందరిపై కేసు నమోదు చేశారు. రాయచోటి డీఎస్పీ క్రిష్ణమోహన్ పర్యవేక్షణలో విచారణ జరుగుతోంది. గాలివీడులో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, ఎంపీడీవోపై దాడికి పాల్పడిన సుదర్శన్‌రెడ్డి వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డికి ముఖ్య అనుచరుడు. ప్రస్తుతం ఇతను పోలీసుల అదుపులో ఉన్నాడని సమాచారం. కాగా, ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడిని ఏపీ పీఆర్ గెజిటెడ్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. పంచాయతీరాజ్ అధికారులకు తగిన భద్రత కల్పించాలని సంఘం నేతలు కేవీస్ వరప్రసాద్, వెంకట్రావు కోరారు.

దాడిపై పవన్ ఆగ్రహం

▸▸ నిందితులపై కఠిన చర్యలకు ఆదేశం

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోకి చొరబడి దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గాలివీడు ఘటనపై ఆయన శుక్రవారం అధికారులతో చర్చించారు. ఎంపీడీవోపై వైసీపీ నేత సుదర్శన్‌రెడ్డి, అతని అనుచరులు దాడిచేయడాన్ని ఖండించారు. దాడికి గురైన ఎంపీడీవోకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. జవహర్‌బాబును పరామర్శించి, ధైర్యం చెప్పాలని పంచాయతీరాజ్ కమిషనర్‌కు డిప్యూటీ సీఎం సూచించారు.

నేడు కడపకు పవన్

కడప రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబును పరామర్శించేందుకు పవన్ కల్యాణ్ శనివారం కడప వెళ్లనున్నారు. ఎంపీడీవోను పరామర్శించి పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఉద్యోగుల్లో నైతిక స్థైర్యం పెంచేందుకు ఆయన ఈ పర్యటనకు సిద్ధమైనట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. ఒక మండల స్థాయి అధికారి కోసం సాక్షాత్తూ ఉప ముఖ్యమంత్రి స్వయంగా వచ్చి పరామర్శించాలని నిర్ణయం తీసుకోవడంపై పంచాయతీరాజ్ అధికారుల సంఘం ధన్యవాదాలు తెలిపింది.



మృతదేహం పార్శిల్ కేసు వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

'చెక్క పెట్టెలో మృతదేహం' చెల్లెలి పనే..!

▸▸ అక్కను భయపెట్టి ఆస్తి కాజేసేందుకు కుట్ర

▸▸ భర్త, అతని మూడో భార్యతో కలిసి పన్నాగం

▸▸ వివరాలు వెల్లడించిన ఎస్పీ నయీం

భీమవరం క్రైం, ఉండి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మృతదేహాన్ని పంపించి.. భయపెట్టి.. ఆస్తిని రాయించుకునేందుకు అక్కపై సొంత చెల్లెలు కుట్ర పన్నింది. తన భర్త, ఆయన మూడో భార్యతో కలిసి ఒకరిని హత్యచేసి ఆ మృతదేహాన్ని అక్కకు పార్శిల్ చేయించినట్టు పోలీసుల విచారణలో తేలింది. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం యండగండిలో ఈ నెల 19న సాగి తులసి ఇంటికి 'పార్శిల్‌లో మృతదేహం డోర్ డెలివరీ' కేసులో రంగరాజు రెండో కుమార్తె రేవతి, ఆమె భర్త తిరుమాని శ్రీధర్ వర్మ(అలియాస్ చేకూరి సిద్ధార్థ వర్మ), అతని మూడో భార్యగా చెబుతున్న పెనుమత్స సుష్మా(విజయలక్ష్మి)లను నిందితులుగా నిర్ధారించారు. ఈ కేసు వివరాలను ఎస్పీ అద్నాన్ నయీం అస్మి శుక్రవారం వెల్లడించారు.

ఇదంతా ఆ ముగ్గురి ప్లాన్..

యండగండికి చెందిన ముదునూరి రంగరాజు-హైమావతి దంపతుల కుమార్తెలు తులసి, రేవతి. సాగి తులసికి 11 ఏళ్ల క్రితం నిడదవోలుకు చెందిన వ్యక్తితో వివాహమైంది. వారికి ఒక కుమార్తె. అప్పులపాలవడంతో తులసి భర్త 2012లో కనిపించకుండా పోయాడు. తులసికి యండగండిలో జగనన్న కాలనీలో స్థలం రావడంతో ఇంటి సామగ్రి కావాలని కొందరిని కోరింది. ఈ క్రమంలో ఈ నెల 19న ఆటోలో చెక్క పెట్టెలో ఇంటి సామాన్ల పేరిట ఒక పార్శిల్ వచ్చింది. ఆ బాక్సు తెరిచి చూడగా 45 ఏళ్ల వ్యక్తి మృతదేహం కుళ్లిన స్థితిలో కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. అనేక కోణాల్లో దర్యాప్తు చేసిన పోలీసులు.. మృతదేహం వచ్చిన సమయంలో తులసి మరిది, రేవతి భర్త శ్రీధర్‌వర్మ అక్కడే ఉన్నాడని, పోలీసులు వస్తున్నారన్న సమాచారంతో అక్కడి నుంచి పరారయ్యాడని గుర్తించారు. దీంతో రంగరాజు కుటుంబ నేపథ్యంపై ఆరా తీసి రేవతి, ఆమె భర్త శ్రీధర్‌వర్మపై నిఘా పెట్టారు. రేవతి కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం మల్లంపూడికి చెందిన శ్రీధర్ వర్మను పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుని భీమవరంలో కాపురం పెట్టింది. అంతకు ముందు శ్రీధర్ వర్మ 2010లో కాళ్ల మండలం ఇస్కులంక గ్రామానికి చెందిన చిప్పల రాణిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. అలాగే విజయవాడకు చెందిన వివాహమై ఒక కూతురు ఉన్న పెనుమత్స సుష్మ(విజయలక్ష్మి)తో కూడా సహజీవనం చేస్తున్నట్టు తెలిసింది. కాగా, శ్రీధర్‌వర్మ, రేవతి ఈ మధ్య కాలంలోనే తరచూ యండగండి వస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. తల్లిదండ్రులు అర ఎకరం పొలం రేవతికి, అర ఎకరం పొలం తులసికి రాసిచ్చారు. మిగిలిన ఎకరం 40 సెంట్ల పొలం రేవతి తండ్రి పేరు మీద ఉంది. వారుంటున్న ఇల్లు తల్లి హైమావతి పేరుపై ఉండటంతో మొదటి నుంచి రేవతికి, ఆమె అక్క తులసికి మధ్య మనస్పర్థలు ఉన్నాయి. తులసి, ఆమె తల్లిదండ్రుల ఆస్తిని కాజేయాలని రేవతి నిర్ణయించుకుంది. ఈ క్రమంలో తులసిని ఎలాగైనా భయపెట్టి ఆమె పేర ఉన్న ఆస్తిని, తల్లిదండ్రుల పేర ఉన్న ఆస్తిని కాజేయాలని శ్రీధర్‌వర్మ, రేవతి ప్లాన్ వేశారు. సిద్ధాంతి, చేతబడి, మృతదేహం పార్శిల్ పేర్లు చెప్పి భయపెట్టాలని చూశారు.

మృతదేహాన్ని పంపించేందుకు పక్కా ప్లాన్

ఈ క్రమంలో శ్రీధర్‌వర్మ, అతని రెండో భార్య రేవతి, మూడో భార్య సుష్మ.. కలిసి ఎవరినైనా హత్య చేసి ఆ మృతదేహాన్ని తులసికి పార్శిల్ చేయాలని ప్లాన్ వేశారు. అప్పటి నుంచి నిత్యం చేప దొరికిందా వర్మా(మృతదేహం దొరికిందా..) అంటూ శ్రీధర్‌వర్మను రేవతి విసిగించింది. దీంతో బర్రె పర్లయ్యను హత్య చేయాలని వారు నిర్ణయించుకున్నారు. ఈ నెల 17న పర్లయ్యను కారులో తీసుకెళ్లి మద్యం తాగించి గొంతుకు వైరు బిగించి హత్య చేశారు. రెండురోజులపాటు మృతదేహాన్ని కారులోనే తిప్పి ఈ నెల 19న దాన్ని చెక్క పెట్టెలో పెట్టి ఆటోలో తులసి ఇంటికి పార్శిల్ చేశారు. దాంతోపాటు రూ.1.30 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అజ్ఞాత వ్యక్తి పేరుతో ఉత్తరం రాయించి బాక్సుకు అంటించారు. బాక్సులో శవం వచ్చినట్టు తులసి చెప్పడంతో శ్రీధర్‌వర్మ ఏమీ తెలియనట్టు యండగండి వెళ్ళాడు. లెటర్ చదివి వారికి డబ్బులు ఏదో విధంగా తాను ఏర్పాటు చేస్తానని, తర్వాత ఈ పొలాలు అమ్మి డబ్బులు ఇవ్వొచ్చని ఆమెకు చెప్పాడు. కానీ, తులసి పోలీసులకు చెబుదాం అనే సరికి అక్కడి నుంచి మెల్లగా జారుకున్నాడు. ఈ కేసులో శ్రీధర్‌వర్మను ప్రధాన నిందితుడిగా నిర్ధారించిన పోలీసులు మచిలీపట్నంలోని కానూరు వద్ద అరెస్టు చేశారు. సుష్మను కూడా అదుపులోకి తీసుకున్నారు. యండగండిలో రేవతిని అదుపులోకి తీసుకుని విచారించారు. కాగా, నిందితులు శ్రీధర్‌వర్మ, రేవతి, సుష్మలను అరెస్ట్ చేసి భీమవరం క్రిమినల్ కోర్టుకు తరలించగా న్యాయాధికారి 14 రోజులు రిమాండ్ విధించారని ఆకివీడు పోలీసులు తెలిపారు.

ఆ గోడౌన్లతో సంబంధం లేదు!

▸▸ నిర్వహణలో బంధువులు ఉంటే నాకేంటి సంబంధం?

▸▸ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బేతంచర్లలో ఉన్న రేషన్ బియ్యం గోడౌన్లతో తనకు ఎలాంటి సంబంధమూ లేదని వైసీపీ నేత, ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా బేతంచర్ల పట్టణంలోని స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ (ఎస్‌డబ్ల్యూసీ) గోదాముతో పాటు ప్రైవేటు గోదాములో దాదాపు 1,300 బస్తాల రేషన్(650 క్వింటాళ్ల) బియ్యం మాయమైనట్లు గురువారం పౌరసరఫరా అధికారుల తనిఖీల్లో బయటపడిన విషయం తెలిసిందే!. ప్రైవేటు గోడౌన్‌ను నిర్వహిస్తున్న భాగస్వామ్య వ్యాపారుల్లో ఒకరిద్దరు.. బుగ్గన బంధువులు ఉండడంతో ఆయనపైనా విమర్శలొచ్చాయి. ఈ నేపథ్యంలో బుగ్గన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్లో మాట్లాడారు. 'నా బంధువుల్లో కొందరు.. నలుగురైదుగురు భాగస్వామ్య వ్యాపారులతో కలిసి బేతంచర్లలో రేషన్ బియ్యం గోడౌన్ నిర్వహిస్తున్న మాట వాస్తవమే. అంతమాత్రాన నాకేం సంబంధం?. ఎన్నికల తరువాత టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అధికార పక్షం నేతల ఒత్తిళ్లతో గోడౌన్ నిర్వహణ వదులుకోవడంతో, కర్నూలు నగరానికి చెందిన ఓ వ్యక్తి నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉంది. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు నెలలుగా గోడౌన్ల నిర్వహణలో ఎవరి ప్రమేయం ఉందో విచారణ చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. సివిల్ సప్లైస్ డైరెక్టర్‌గా ఎంపికైన వ్యక్తి ఒకరు ఈ గోడౌన్లను బేతంచర్ల నుంచి పక్క నియోజకవర్గానికి తరలించుకుపోయే ఉద్దేశంతో ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారు' అని బుగ్గన వివరణ ఇచ్చారు.

భూసమస్యల పరిష్కారం నా వల్ల కాదు!

▸▸ రెవెన్యూ సదస్సు నుంచి వెళ్లిపోయిన తహసీల్దార్



రెవెన్యూ సదస్సు నుంచి అర్ధాంతరంగా వెళ్లిపోతున్న తహసీల్దార్ విజయ్‌భాస్కర్

తర్లుపాడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): భూసమస్యలను తాను పరిష్కరించలేనంటూ ప్రకాశం జిల్లా తర్లుపాడు తహసీల్దార్ విజయ్‌భాస్కర్ రెవెన్యూ సదస్సు నుంచి అర్ధంతరంగా వెళ్లిపోయారు. ఈ ఘటన కారుమానుపల్లెలో శుక్రవారం చోటుచేసుకుంది. తర్లుపాడుకు చెందిన షేక్ పూలమహబూబీకి పదేళ్ల క్రితం 77/9 సర్వే నంబర్‌లో రెండెకరాలను అసైన్‌మెంట్ కమిటీ మంజూరు చేసింది. నాలుగేళ్ల క్రితం ఓ వైసీపీ నాయకుడు ఈ భూమిని పోలెబోయిన రమణమ్మ పేరుతో ఆన్‌లైన్ చేయించుకున్నాడు. తనకు న్యాయం చేయాలంటూ మహబూబీ అర్జీ ఇచ్చి కన్నీటిపర్యంతమయ్యారు. ఇలాంటివి తాను పరిష్కరించలేనని తహసీల్దార్ విజయ్‌కుమార్ తేల్చి చెప్పారు. దీంతో న్యాయం చేయాలంటూ మహబూబీ నిరసనకు దిగడంతో.. మండలంలో ఇలాంటి సమస్యలు అధికంగా ఉన్నాయని, వీటిని పరిష్కరించలేనని తహసీల్దార్ అన్నారు. రెవెన్యూ సభలోనే సెలవు చీటి రాసి నిష్క్రమించారు.

ప్రత్యేక చట్టాలతో భూసమస్యల పరిష్కారం

▸▸ రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా

ముదినేపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠమైన ప్రత్యేక చట్టాల ను రూపొందించేందుకు చర్యలు తీసుకుంటోందని ఏపీ ప్రభుత్వ రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పి.సిసోడియా తెలిపారు. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పెదపాలపర్రులో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సిసోడియా మాట్లాడుతూ ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ల్యాండ్ రెవెన్యూ చట్టాలకు సవరణలు చేసేందుకు యోచిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ఇప్పటివరకు లక్షా 50 వేల అర్జీలు అందాయని, అవసరమైతే సదస్సుల నిర్వహణను పొడిగిస్తామన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.